www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 7-9-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 143 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి రా.11.38 తదుపరి పాడ్యమి, నక్షత్రం: శతభిషం రా.9.41 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: తె.3.38-5.08, దుర్ముహూర్తం: సా.4.42-5.31, అమృతఘడియలు: మ.2.51-4.22, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.20 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పీపీపీలో మెడికల్ కాలేజీలు.. వైసీపీ ఏడ్పులు

వైద్యంపై విషం

నాడు జగన్ ఉత్తుత్తి ఆర్భాటం

గత జగన్ ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తామని 2020లో ఆర్భాటంగా ప్రకటించింది. 2023 డిసెంబరు చివరి నాటికే నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు తరగతులు కూడా ప్రారంభిస్తామని గొప్పలు చెప్పింది. నిర్మాణ అంచనా వ్యయం రూ.8,480 కోట్లు. కానీ జగన్ హయాంలో నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. నాబార్డు, కేంద్ర ప్రభుత్వ నిధులు, సహకారంతో పనులు ప్రారంభించారు. నాలుగేళ్లలో నాలుగో వంతు పనులు కూడా చేయలేదు. పూర్తి స్థాయిలో భవనాల నిర్మాణం, ఫ్యాకల్టీ నియామకం చేపట్టకుండానే 5 మెడికల్ కాలేజీలు ప్రారంభించారు.

నేడు కూటమి దిద్దుబాటు

ఎన్నికల తర్వాత పాడేరు మెడికల్ కాలేజీ ప్రారంభించారు. కేంద్రం నిధులతో ఓ కాలేజీ నిర్మించనున్నారు. అసంపూర్తిగా ఉన్న మరో 10 మెడికల్ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది. ఒకటి, రెండు చోట్ల కనీసం ఇటుక కూడా వేయని దుస్థితి. పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టాలంటే ప్రస్తుతం రూ.6 వేల కోట్లకు పైగా వెచ్చించాలి. సిబ్బంది జీతాలు, కాలేజీల నిర్వహణకు ఏటా రూ.1500 కోట్లు అవసరం. ఇక జగన్ దిగిపోతూ కాంట్రాక్టు సంస్థలకు రూ.674 కోట్లు బకాయిలు పెట్టారు. వీటిని పూర్తి చేయడం పెను భారం.. వదిలేస్తే అప్పటికే చేసిన ఖర్చు వృథా! అందుకే.. 10 కాలేజీలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం సమనసలో పునాది దశలోనే వైద్య కళాశాల భవన సముదాయాలు

వైఫల్యాలు దాచి కూటమిపై జగన్ అభాండాలు

- నాడు ఆర్భాటంగా 17 కాలేజీలకు శంకుస్థాపన
- నిర్మాణ అంచనా వ్యయం రూ.8,480 కోట్లు
- నాలుగేళ్లలో చేసింది 2125 కోట్ల పనులే
- ఈ నిధులన్నీ అప్పులు, కేంద్రం సాయమే
- పైగా 674 కోట్ల బిల్లులు పెండింగ్
- హడావుడిగా 5 కాలేజీలు ప్రారంభం
- అరకొర వసతులు, ఫ్యాకల్టీతోనే క్లాసులు
- మరో 10 కాలేజీల పూర్తికి 6 వేల కోట్లు కావాలి
- వాటిని పీపీపీతో నిర్మాణానికి ప్రభుత్వ నిర్ణయం
- వాస్తవాలు దాచి జగన్ విష ప్రచారం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం సాధ్యం కాదని, ప్రభుత్వానికి ఆర్థికంగా భారమవుతుందని నాడు ఆర్థిక శాఖ అధికారులు చెప్పినా జగన్ వినలేదు. హడావుడిగా శంకుస్థాపనలు చేసేసి, మీ ప్రాంతానికి మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు వస్తున్నాయని ప్రజల్లో ఆశలు రేకెత్తించారు. ఆర్భాటం అయితే చేశారు కానీ తన హయాంలో పూర్తి స్థాయిలో ఒక్క మెడికల్ కాలేజీని కూడా నిర్మించలేదు. తగిన వసతులు, అవసరమైన ఫ్యాకల్టీ లేకుండానే 5 కాలేజీలను ప్రారంభించారు. మిగిలిన కాలేజీలను అసంపూర్తిగా వదిలేశారు. ఇప్పుడు వేల కోట్లు ఖర్చు చేసి

మిగతా 13వ పేజీలో...


జైలు నుంచి బయటకు వస్తున్న మిథున్ రెడ్డి

మద్యం స్కాంలో మరో ముగ్గురికి బెయిల్

- ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పకు మంజూరు
- దేశం విడిచి వెళ్లొద్దు.. సాక్షులను కలవొద్దని షరతులు
- పాస్‌పోర్టులు సమర్పించాలని ఆదేశం
- నేడు విడుదల చేయనున్న అధికారులు

14

మిథున్‌రెడ్డికి మధ్యంతర బెయిల్

- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకే
- 11న తిరిగి లొంగిపోవాలని కోర్టు ఆదేశం

ఎరువుల లభ్యతపై భరోసా ఇవ్వండి

13

- సచివాలయ సిబ్బంది నుంచి కలెక్టర్ దాకా క్షేత్రస్థాయికి వెళ్లి పంపిణీ తీరు చూడండి
- టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు ఆదేశాలు

మోదీ మిత్రుడే కానీ..

- ప్రస్తుతం ఆయన చేస్తున్న పనే నాకు నచ్చట్లేదు
- కానీ.. ఇరు దేశాల మధ్య ప్రత్యేక బంధం ఉంది
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త రాగం
- నాదీ అదే మాట: 'ఎక్స్'లో ప్రధాని మోదీ

2

కేసీఆర్.. కష్టకాలం!



అధికారంలో ఉన్నప్పుడు ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి జుట్టు దొరకపుచ్చుకొని ఒక ఆట ఆడుకున్న కేసీఆర్... ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి ఎత్తుగడలకు చిత్తు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తన చేతికి మట్టి అంటకుండా సీబీఐ భుజాలపై తుపాకీ పెట్టి కేసీఆర్‌ను దెబ్బతీసే ఎత్తుగడను రేవంత్ ఎంచుకున్నారు.

> తెలంగాణ ఏర్పడి పదకొండు సంవత్సరాలు దాటినా, ఇప్పటికీ రాజకీయంగా ఇబ్బంది ఎదురైన ప్రతిసారీ చంద్రబాబును బూచిగా చూపించడం భారత రాష్ట్ర సమితికి అలవాటే. ఇప్పుడు కూడా కేసీఆర్‌పై సీబీఐ విచారణ జరిగితే అందుకు చంద్రబాబు కారణమని నిందించడం మొదలు పెట్టారు.

రాజకీయాల్లో ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో కూడా తెలియాలి. అది తెలుసుకున్నందు వల్లే ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా 30 ఏళ్ల క్రితం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు మధ్యలో కొన్నాళ్లు అధికారం కోల్పోయినా మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నారు.

> బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నట్టుగా రేవంత్ రెడ్డి-చంద్రబాబు-మోదీ కలిసి కుట్ర పన్నారన్నది నిజమే అనుకుందాం. ఇలాంటి రాజకీయాలు కేసీఆర్‌కు కొత్త కాదు. 2019 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించడానికి జగన్మోహన్ రెడ్డితో కలిసి కుట్ర చేశారు కదా!

ఒకప్పుడు బీఆర్ఎస్ పార్టీని ఇంటి పార్టీగా ప్రచారం చేసిన కవితకు ఇప్పుడు ఆ ఇంటి పార్టీలో చోటు లేకుండా పోయింది. ఇంతకూ కవిత తెగింపునకు కారణం ఏమిటో? ఏమి చూసుకొని ఆమె పార్టీతో సంబంధం తెంచుకోవడానికి సిద్ధపడ్డారన్నది ప్రస్తుతానికి మిస్టరీగానే ఉంది.

> కవిత మొదట్లో హరీశ్ రావు జోలికి వెళ్లలేదు. ఇప్పుడు కవిత అనే బాణం దిశ మార్చుకుంది. మొదట్లో కేటీఆర్‌కు గుచ్చుకుంటే ఇప్పుడు దిశ మార్చుకొని హరీశ్ రావుకు గుచ్చుకుంది ఏమిటా అని రాజకీయ పరిశీలకులు సైతం ఆశ్చర్యపోతున్నారు.

ఎవరు అంగీకరించినా అంగీకరించక పోయినా మన సమాజంలో వారసులు అంటే కుమారులే అన్న భావన ఉంది. రాజకీయాల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది. మగ పిల్లలు లేని సందర్భంలోనే ఆడ పిల్లలకు రాజకీయ వారసత్వం లభిస్తోంది. కాంగ్రెస్ నాయకత్వం కూడా రాహుల్ గాంధీకే దక్కడం గమనార్హం. ప్రియాంక గాంధీకి అర్హత లేదా? అంటే ఏం చెబుతాం?

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

పన్ను సరళీకరణ.. అందరికీ ఉపయోగమే



- తప్పుడు ఇన్‌వాయిస్‌లు ఇచ్చే వారిని జీఎస్టీ గమనిస్తుంది
- పన్ను తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందివ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు
- 'ఆంధ్రజ్యోతి'తో జీఎస్టీ కమిషనర్ సాధు నర్సింహారెడ్డి



జీఎస్టీ రేట్ల తగ్గింపును కేవలం శ్లాబుల తగ్గింపుగా చూడలేం.. ప్రస్తుతం అమల్లో ఉన్న పన్నులను సరళతరం చేయడం, వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడం, దేశీయ ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్రం ఈ సంస్కరణలను చేపట్టింది. జీఎస్టీ శ్లాబులను సరళీకరించడం ద్వారా ప్రభుత్వం జీఎస్టీ రేట్లపై ఉన్న విమర్శలకు సమాధానం చెప్పినట్లయింది.

-సాధు నర్సింహారెడ్డి, సెంట్రల్ జీఎస్టీ (అప్పీల్స్) కమిషనర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హైదరాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలను ప్రకటించిన నేపథ్యంలో.. ధరల తగ్గింపుపై కొనుగోలుదారుల్లో చర్చ మొదలైంది. ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్న కొత్త పన్ను రేట్లపై చాలా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాటన్నింటినీ 'ఆంధ్రజ్యోతి'.. సాధు నర్సింహారెడ్డి ముందు ఉంచింది. ఆ సందేహాలకు ఆయన ఇచ్చిన సమాధానాల్లో ముఖ్యాంశాలు..

సాధారణ వినియోగదారులకు జీఎస్టీ సంస్కరణలతో నేరుగా ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది? ధరలు తగ్గుతాయా?

గతంలో జీఎస్టీ వస్తువులు లేదా సేవలను వాటి కోడ్‌లు, పేర్లతో చూసేవారు, కానీ ఈ సంస్కరణలలో

మిగతా 11వ పేజీలో...



మహీంద్రా తగ్గింపు తక్షణమే

- ఆ కార్లు 1.56 లక్షల వరకు తగ్గింపు
- టొయోటా రూ.3.49 లక్షల వరకు, రెనో రూ.96,395 వరకు తగ్గింపు
- ఇప్పటికే తగ్గిస్తున్నట్టు టాటా ప్రకటన
- భారీగా తగ్గించే యోచనలో మారుతి

2

అంతర్జాతీయ స్థాయిలో ఆపద సేవలు!

- అత్యవసర సర్వీసులు ఒకే గొడుగు కిందకు
- 100, 112, 1930, 1972లకు ఒకే కమాండ్ కంట్రోల్
- టెక్ టవర్ కేంద్రంగా.. ఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణ
- 24 గంటల పాటు 152 మంది సిబ్బందితో నిర్వహణ
- యూఈఆర్‌సీసీ పేరుతో త్వరలో అందుబాటులోకి
- ప్రజల సంతృప్తికే ప్రాధాన్యం: డీజీపీ హరీశ్‌కుమార్

14

ఎక్సైజ్‌పై 'బార్' ఒత్తిడి

- రీనోటిఫికేషన్ తర్వాత మిగిలిన 428 బార్లలో ఇప్పటివరకూ ఐదింటికే దరఖాస్తులు
- మొత్తం బార్లకు దరఖాస్తులు తేవాలని ఒత్తిడి.. లేదంటే బదిలీ వేటు
- జిల్లాల యంత్రాంగానికి పైస్థాయి హెచ్చరికలు
- ఇప్పటికే ఇద్దరు ఈఎస్‌లపై చర్యలు
- వ్యాపారులు రాకపోతే మేమేం చేయాలి?
- ఆందోళనలో ఎక్సైజ్ యంత్రాంగం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎక్సైజ్ జిల్లాల అధికారులకు కొత్త బార్ పాలసీ తలనొప్పిగా మారింది. మిగిలిపోయిన బార్లకు దరఖాస్తులు రప్పించాలని వారిపై ఒత్తిడి పెరిగింది. ఎలాగైనా వ్యాపారులను ముందుకు తీసుకొచ్చి దరఖాస్తులు వేయించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేస్తున్నారు. మొత్తం

మిగతా 13వ పేజీలో...



వాహనానికీ 'మాస్క్'

12

అనంతపురం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేతో భేటీ కోసం ప్రభుత్వ ప్రొటోకాల్ వాహనం.. 'ఏపీ16టీజే1' నంబరు తెల్లరంగు ఇన్నోవాను 'ఎల్విన్ ఇండస్ట్రీస్' ప్రతినిధికి సమకూర్చింది ఎవరు? ఇదేం దందా అని సదరు ఎమ్మెల్యే కస్సుమనడంతో... 'ప్రభుత్వ వాహనం'పై స్టిక్కర్ అతికించడం నిజం కాదా? ఈ ఫొటోలే దీనికి సాక్ష్యం.

నెడ్‌క్యాప్, మెప్మా.. నిజమేమిటి చెప్మా!

- అంతా సక్రమమే.. కమలాకర్, తేజ్‌భరత్ వివరణ
- అవాస్తవాలంటూ 'ఆంధ్రజ్యోతి' కథనానికి ఖండన
- 'ఇన్‌స్టలేషన్'ను దాచేసి.. 'ప్రచారం'కే పరిమితం
- దాచేస్తే దాగని నిజం.. లేఖల్లో అసలు వాస్తవం
- తమది వ్యాపారమే అని స్పష్టం చేసిన 'ఎల్విన్'

మోదీ మిత్రుడే కానీ..

ప్రస్తుతం ఆయన చేస్తున్న పనే నాకు నచ్చట్లేదు



- ఇరు దేశాల మధ్య ప్రత్యేక బంధం ఉంది
- విభేదాలున్నా ఆందోళన చెందక్కర్లేదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త రాగం

న్యూయార్క్/వాషింగ్టన్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: పెనం మీద అట్టు తిరగేసినంత సులువుగా మాట మార్చడంలో ట్రంప్ నేర్పరి అని మరోసారి రుజువైంది. "భారత్‌ను, రష్యాను చీకటి చైనాకు కోల్పోయాం.. ఆ మూడు దేశాలూ చిరకాలం సుసంపన్నంగా వర్ధిల్లాలి" అంటూ వ్యంగ్యం ఒలకబోసిన 24 గంటల్లోనే.. ట్రంప్ స్వరం మార్చారు. తాను ఎప్పటికీ మోదీకి స్నేహితుడుగా ఉంటానని.. భారత్, అమెరికా మధ్య ప్రత్యేక సంబంధాలు ఉన్నాయని కొత్త రాగం అందుకున్నారు. వైట్‌హౌస్‌లోని తన కార్యాలయమైన ఓవల్ ఆఫీసులో మీడియాతో మాట్లాడిన ఆయన.. భారత్-అమెరికా సంబంధాలను పునరుద్ధరించడానికి సిద్ధంగా ఉన్నారా? అని అడిగిన ప్రశ్నకు ఇలా స్పందించారు. "నేనెప్పటికీ మోదీకి మిత్రుడిగా ఉంటాను. ఆయనో గొప్ప ప్రధాని. చాలా గొప్పవాడు. ఆయనతో స్నేహంగా ఉంటాను. కాకపోతే.. ప్రస్తుతం ఆయన చేస్తున్న పనే నాకు నచ్చట్లేదు. కానీ, భారత్-అమెరికా మధ్య ప్రత్యేక బంధం ఉంది. (రెండు దేశాల సంబంధాల గురించి) ఆందోళన చెందాల్సిన పని లేదు. కొన్నిసార్లు చిన్న చిన్న విభేదాలు వస్తాయి అంతే" అని నవ్వుతూ చెప్పారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేయడం తనను నిరాశకు గురిచేసిందన్నారు. "అందుకే భారత్‌పై భారీగా 50% సుంకాలు విధించాం. అది చాలా ఎక్కువ టారిఫ్. అయినా నేను ప్రధాని మోదీతో బాగా కలిసిపోతాను. ఆయన చాలా గొప్పవారు" అని వ్యాఖ్యానించారు. భారత్‌తో, ఇతర దేశాలతో వాణిజ్య చర్చలు ఎలా జరుగుతున్నాయనే మరో ప్రశ్నకు.. భారత్‌తో పాటు చాలా దేశాలతో చర్చలు బాగా జరుగుతున్నాయని చెప్పారు. కానీ.. గూగుల్‌తో సహా పలు ఇతర పెద్ద కంపెనీలో విషయంలో యూరోపియన్ యూనియన్‌లో జరుగుతున్న దాని పట్ల తాము అసంతృప్తిగా ఉన్నామని ట్రంప్ బదులిచ్చారు. గూగుల్ వ్యాపార విధానాలు చట్టవిరుద్ధమని పేర్కొంటూ ఈయూ ఇటీవలికాలంలో రూ.వేల కోట్ల జరిమానాలు విధించిన సంగతి తెలిసిందే. అలాగే.. పన్ను ఎగవేత కేసులో యాపిల్‌పైన, వినియోగదారుల డేటా రక్షణ విషయంలో ఫేస్‌బుక్(మెటా)పైన, మార్కెట్లో సొంత ఉత్పత్తులకు మాత్రమే ప్రోత్సాహం ఇచ్చిందంటూ అమెజాన్‌పైన, ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్‌ను విండోస్‌తో కలిపి అమ్మినందుకు మైక్రోసాఫ్ట్‌పైన ఈయూ జరిమానాలు విధించింది. ఈ క్రమంలోనే ట్రంప్ ఈయూపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సానుకూల భాగస్వామ్యం..

ఇండియా-అమెరికా మధ్య ప్రత్యేక బంధం ఉందని.. చిన్నచిన్న విభేదాలున్నా అవి సర్దుకుంటాయన్న ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ అంతే సానుకూలంగా స్పందించారు. ట్రంప్ అభిప్రాయాలను తాను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని.. తాను కూడా అదే భావాలతో స్పందిస్తున్నానని మోదీ పేర్కొన్నారు. "ఇండియా, అమెరికా మధ్య అత్యంత సానుకూలమైన, ముందుచూపుతో కూడిన సమగ్ర అంతర్జాతీయ స్థాయి వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది" అని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మోదీ, ట్రంప్ చివరిసారిగా ఈ ఏడాది జూన్ 17న ఫోన్‌లో మాట్లాడుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత వారిద్దరూ బహిరంగ వేదికపై తమ అభిప్రాయాలు పంచుకోవడం ఇదే మొదటిసారి.

ఒక్క ముద్ద తక్కువ తింటాం కానీ, ఆత్మ గౌరవాన్ని వదులుకోం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: భారత్, రష్యా దేశాలు చైనాకు తలొగ్గాయన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత మనీశ్ తివారీ తీవ్రంగా స్పందించారు. "భారతీయులు ఒక ముద్ద తక్కువైనా తింటారేమో గానీ, ఆత్మ గౌరవాన్ని మాత్రం వదులుకోరు" అని అన్నారు. ఆయుధ బలాన్ని చూపించి భారతదేశాన్ని ఎవరూ లొంగదీసుకోలేరని వ్యాఖ్యానించారు. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంతో పోరాడి విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. "ఇక్కడ సమస్య టారిఫ్‌లు కాదు.. ఆత్మగౌరవం, మర్యాద" అని ట్రంప్, నవారోను ట్యాగ్ చేస్తూ మనీశ్ తివారీ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎస్‌సీవో సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, జిన్‌పింగ్, పుతిన్ కలిసి ఉన్న ఫొటోను ట్రంప్ శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి.. "భారత్, రష్యా చైనాకు లొంగిపోయినట్లున్నాయి. భారత్‌ను మనం కోల్పోయాం" అని వ్యాఖ్యానించారు.

మెరుగైన ప్రతిపక్షం కోసం ప్రజా ఉద్యమం రావాలి



- జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్ష నేతలవి అవగాహన లేని విమర్శలు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల ఫైర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: ప్రతిపక్ష నేతలు జీఎస్టీపై ఏ మాత్రం అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. మన దేశంలో మెరుగైన ప్రతిపక్షం, మెరుగైన ప్రతిపక్ష నేతల అవసరం ఉందని వ్యాఖ్యానించారు. చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు వచ్చిన తరహాలో దేశంలో మెరుగైన ప్రతిపక్షం, మెరుగైన ప్రతిపక్ష నేతల కోసం ఉద్యమం రావాల్సి ఉందని పేర్కొన్నారు. శనివారం పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలపై నిర్మల విమర్శలు గుప్పించారు. "జీఎస్టీ ప్రవేశపెట్టిన మొదట్లో 4శ్లాబులు పెట్టడం తప్పు అని, తాము చెప్పినట్టే ఇప్పుడు 2శ్లాబులకు తగ్గించారని కాంగ్రెస్ చెప్పడం తప్పు. జీఎస్టీ తేవడం, పన్ను శ్లాబుల నిర్ధారణ బీజేపీ ఒక్కదాని నిర్ణయం కాదు. అప్పటి కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడి సాధికార కమిటీ నిర్ణయం తీసుకున్నది అప్పటి పశ్చిమ బెంగాల్ ఆర్థిక మంత్రి అసీమ్ దాస్ గుప్తా అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి చర్చల్లోనే 4శ్లాబులను నిర్ణయించారు. ఇది ప్రతిపక్షాలకు తెలియదా? అవగాహన లేదా? ఒకవేళ మేం తప్పు చేసి ఉంటే క్షమాపణ చెప్పడానికి నేను సిద్ధం. కానీ ప్రతిపక్షాల ఆరోపణలన్నీ అవాస్తవం. విషయం ఏమిటనేది అర్థం కానప్పుడు ఏమీ మాట్లాడకుండా ఉంటే మంచిది" అని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతల వ్యాఖ్యలు ప్రజలను తప్పుదారి పట్టించేలా, దేశానికి హాని చేసేలా ఉన్నాయని.. అది మంచిది కాదని పేర్కొన్నారు. జీఎస్టీ శ్లాబుల తగ్గింపు, రేట్ల మార్పు ప్రజా సంస్కరణలని, వాటి ప్రయోజనం ప్రతి కుటుంబానికి దక్కుతుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ ప్రయోజనాలు ప్రజలకు అందేలా తాను వ్యక్తిగతంగా కూడా పర్యవేక్షిస్తానని తెలిపారు. ఇప్పటికే కార్ల తయారీ సంస్థలు, ప్రభుత్వ రంగ ఇన్సూరెన్స్ సంస్థలు, దుస్తులు, పాదరక్షల సంస్థలు ధరల తగ్గింపును ప్రకటించాయని చెప్పారు. జీఎస్టీ మండలి భేటీలో రాష్ట్రాల ప్రతినిధులు తమ అభ్యంతరాలు, అభిప్రాయాలను వెల్లడించారని.. చివరికి ఏకగ్రీవంగా సంస్కరణలకు ఆమోదం తెలిపారని నిర్మల చెప్పారు. దీనితో దేశంలో సాధారణ ప్రజలకు ప్రయోజనం చేకూరిందని, దీనిపై అభినందిస్తూ రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాశానని తెలిపారు.

బీడీలు-బిహార్ పోస్ట్ వివాదంతో కేరళ కాంగ్రెస్ సోషల్ మీడియా చీఫ్ రాజీనామా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: బీడీలు-బిహార్ అంటూ పెట్టిన సోషల్ మీడియా పోస్ట్‌పై విమర్శలు వచ్చిన నేపథ్యంలో కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(కేపీసీసీ) సోషల్ మీడియా, డిజిటల్ సెల్ చీఫ్ వీటీ బలరాం రాజీనామా చేశారు. జీఎస్టీ పన్నుల్లో మార్పులను ఉద్దేశించి కేపీసీసీ అధికారిక 'ఎక్స్' ఖాతాలో బిహార్‌ను బీడీలతో ముడిపెట్టి ఈ పోస్ట్ పెట్టారు. బీడీల మీద పన్నును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తూ, అదే సమయంలో సిగరెట్లపై పన్నును పెంచుతూ జీఎస్టీ మండలి నిర్ణయం తీసుకుంది. దీన్ని ఉద్దేశించి.. "బీడీలు, బిహార్.. బితో మొదలవుతాయి.. ఇక బీడీలు తాగడం తప్పు కాదు.." అని ఆ పోస్ట్ పెట్టిన గంటల్లోనే రాజకీయ పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. బిహార్ అధికార ఎన్డీయే పక్ష నేతలు ఇది బిహార్‌ను అవమానించడమేనని ఆరోపించారు. విమర్శల నేపథ్యంలో కేపీసీసీ ఆ పోస్ట్‌ను తొలగించి క్షమాపణలు తెలియజేసింది.

పెద్దనోట్ల రద్దు సమయంలో 450 కోట్లతో చక్కెర ఫ్యాక్టరీ కొన్న శశికళ!



చెన్నై, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలు వీకే శశికళపై మరో సీబీఐ కేసు నమోదయింది. పెద్ద నోట్ల రద్దు సమయంలో రూ.450 కోట్లతో ఓ చక్కెర ఫ్యాక్టరీని కొనుగోలు చేశారని, తన బినామీల ద్వారా ఆ ఫ్యాక్టరీని నడిపారని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. కాంచీపురంలో ఉన్న ఓ చక్కెర ఫ్యాక్టరీ రూ.కోట్లు రుణం తీసుకొని మోసగించినట్లు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మద్రాసు హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆ పిటిషన్‌పై విచారణ జరిపి, కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు గత జూలైలో సీబీఐ అధికారులు పలుచోట్ల సోదాలు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి సీబీఐ తయారు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఐటీ శాఖ స్వాధీనం చేసుకున్న దస్తావేజుల్లో శశికళకు సంబంధించిన చక్కెర ఫ్యాక్టరీ వ్యవహారాన్ని కూడా ప్రస్తావించింది. అంతేకాకుండా ఆ చక్కెర కర్మాగారాన్ని నడిపిన విదేశ్ శివగన్ పటేల్ ఇచ్చిన వాంగ్మూలం మేరకు ఆ చక్కెర కర్మాగారాన్ని కొనుగోలు చేసేందుకు రూ.450 కోట్ల విలువైన రద్దయిన పెద్దనోట్లను ఉపయోగించారని కూడా వివరించింది. ఆ చక్కెర కర్మాగారం బినామీ ఆస్తి అని, దాని స్వంతదారు శశికళ అని ఐటీ శాఖ ప్రకటించిన విషయాన్నీ సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

ఖలిస్థానీ గ్రూపులకు కెనడా నుంచే నిధులు

- తాజా నివేదికలో ఆ దేశ ప్రభుత్వం అంగీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: ఖలిస్థానీ గ్రూపులతో సహా పలు ఉగ్ర సంస్థలకు కెనడా నుంచే నిధులు అందుతున్నట్లు ఆ దేశ ప్రభుత్వం తాజా నివేదికలో వెల్లడించింది. కెనడా ఆర్థిక విభాగం '2025 అసెస్‌మెంట్ ఆఫ్ మనీలాండరింగ్ అండ్ టెర్రరిస్టు ఫైనాన్సింగ్ రిస్క్స్ ఇన్ కెనడా' పేరుతో విడుదల చేసిన నివేదికలో బబ్బర్ ఖాల్సా ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్ అనే రెండు ఖలిస్థానీ ఉగ్ర గ్రూపుల పేర్లను పేర్కొంది. రాజకీయ ప్రేరేపిత హింసాత్మక తీవ్రవాదం (పీఎంవీఈ) సంబంధిత కార్యకలాపాలకు హమాస్, హెజ్‌బొల్లా, ఖలిస్థానీ ఉగ్ర సంస్థలకు కెనడా భూభాగంపై నుంచే ఆర్థిక మద్దతు లభిస్తోందని తెలిపింది. ఈ మేరకు భద్రతా, నిఘా సంస్థలు గుర్తించాయని వెల్లడించింది. భారత్‌లోని పంజాబ్‌లో స్వతంత్ర రాజ్య స్థాపనకు ఖలిస్థానీ తీవ్రవాద గ్రూపులు హింసాత్మక మార్గాలను ఆశ్రయిస్తున్నాయని కెనడా ప్రభుత్వం నివేదికలో అంగీకరించింది.

మీరట్‌లో 'న్యూడ్ గ్యాంగ్' అరాచకాలు

మీరట్, సెప్టెంబరు 6: ఎలాంటి దుస్తులు ధరించకుండా నగ్నంగా తిరిగే పురుషులు కొందరు 'న్యూడ్ గ్యాంగ్' పేరుతో ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారు. దౌరాలా, భారాల గ్రామాల్లో తిరుగుతూ మహిళలను నిర్మానుష్య ప్రాంతాలకు లాక్కెళ్తున్నట్టు సమాచారం అందింది. ఇంతవరకు నిందితులు ఎవరూ దొరకకపోవడంతో పోలీసులు డ్రోన్లను వినియోగించి గాలింపు చర్యలు చేపట్టారు. ఇటీవల భారాల గ్రామంలో ఒంటరిగా నడుచుకొని వెళ్తున్న మహిళను నగ్నంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు పొలాల్లోకి లాక్కెళ్లారు. ఆమె ఎలాగోలాగ తప్పించుకొని ఇంటికి చేరింది. దాంతో గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు ఇలాంటివి మూడు సంఘటనలు జరిగినా సిగ్గుతో అధికారుల దృష్టికి తీసుకెళ్లలేదని తెలిసింది. నిందితుల ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులు కీలక ప్రదేశాల్లో సీసీటీవీ కెమేరాలు ఏర్పాటు చేశారు. డ్రోన్ల ద్వారా కూడా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఇది కేవలం వదంతి మాత్రమేనని కొందరు కొట్టిపారేస్తున్నారు.

గుజరాత్‌లో రోప్ వే ట్రాలీ కూలి ఆరుగురి మృతి

- మహాకాళి శక్తిపీఠం వద్ద కేబుల్స్ తెగడంతో ఘటన

గాంధీనగర్, సెప్టెంబరు 6: గుజరాత్‌లోని పంచమహల్ జిల్లా పావ్‌గఢ్ హిల్స్ మహాకాళి శక్తిపీఠం వద్ద జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతిచెందారు. ఆలయం సమీపంలో కేబుల్ రోప్ వేకు సంబంధించిన పనులు చేస్తుండగా కార్గో రోప్‌వే ట్రాలీ కూలిపోవడంతో ఈ ఘటన జరిగింది. టవర్‌పై నుంచి రోప్ వే ట్రాలీ ద్వారా నిర్మాణ సామాగ్రిని తరలిస్తుండగా కేబుల్స్ తెగి ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు లిఫ్ట్ ఆపరేటర్లు, ఇద్దరు కార్మికులు, మరో ఇద్దరు ఉన్నారు. మృతుల్లో ఇద్దరు కశ్మీరీలు, ఒకరు రాజస్థాన్‌కు చెందినవారున్నారు.

లోకం తీరు



హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న కాంగ్రెస్

- ఎంపీ శశికాంత్ యూట్యూబర్లతో ధర్మస్థలపై అసత్య ప్రచారం చేయించారు
- రాహుల్ గాంధీ హస్తం కూడా ఉంది
- గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి



బెంగళూరు, బళ్లారి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాలపై కాంగ్రెస్ పార్టీ అసత్య ఆరోపణలు చేయిస్తోందని, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తోందని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ తెరవెనుక ఉండి, యూట్యూబర్ల చేత ధర్మస్థల మంజునాథ ఆలయంలో హత్యలు జరిగాయని అసత్య ఆరోపణలు చేయించారని ఆయన తీవ్ర విమర్శచేశారు. బళ్లారిలోని తన నివాసంలో బీజేపీ నాయకులతో కలిసి శనివారం గాలి జనార్దన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ శశికాంత్ సెంథిల్‌తోపాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా తెరవెనుక ఉన్నారని ఆరోపించారు. ఈ కేసును సీబీఐ, ఎన్ఐఏకి అప్పగిస్తే వాస్తవాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ధర్మస్థలలో హత్యలు జరిగాయని, మృతదేహాలను పూడ్చిపెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేసిన మాజీ పారిశుధ్యకార్మికుడు వాస్తవాలను అంగీకరించాడని, కొందరి ఒత్తిడి కారణంగానే అసత్య ఫిర్యాదు చేశానని ఒప్పుకున్నాడని గుర్తు చేశారు. అయితే, గాలి జనార్దనరెడ్డి నిరాధార ఆరోపణలు చేశారని పేర్కొంటూ బెంగళూరు సిటీ సివిల్ కోర్టులో శశికాంత్ సెంథిల్ శనివారం పరువునష్టం దావా వేశారు. ఇదిలా ఉండగా, ధర్మస్థలలో యువతుల మృతదేహాలను పాతిపెట్టినట్టు అసత్య ఫిర్యాదు చేసిన మాజీ పారిశుధ్య కార్మికుడు చన్నయ్యకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

ఎప్పటి నుంచో జీఎస్టీ సంస్కరణలపై కసరత్తు

- వాటికి, బయటి విషయాలకు సంబంధం లేదు: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలకు, దేశం బయట నెలకొన్న పరిస్థితులకు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర రైల్వే, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఏడాదిన్నర క్రితమే.. అమెరికా ఎన్నికలకు ముందే జీఎస్టీ సంస్కరణలపై కసరత్తు మొదలైందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలకు, ఇటీవల భారత వస్తువులపై అమెరికా అధిక సుంకాలు విధించడానికి సంబంధం ఏదైనా ఉందా అన్న ప్రశ్నకు ఆయన ఈ వివరణ ఇచ్చారు. శనివారం ఆయన బీజేపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. దసరా నవరాత్రుల మొదటి రోజైన ఈ నెల 22 నుంచి జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వస్తాయని, ఇవి ప్రజలపై పన్నుల భారం తగ్గిస్తాయని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ ఇచ్చిన వాగ్దానం నెరవేరిందన్నారు. రోజువారీ వినియోగించే వస్తువులు అన్నింటిపై జీఎస్టీ తగ్గుతుందని తెలిపారు.

మోదీ అమెరికా పర్యటన రద్దు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: ప్రధాని మోదీ అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ నెల చివరిలో అమెరికాలోని ఐక్య రాజ్యసమితి(ఐరాస) సచివాలయంలో 80వ ఉన్నతస్థాయి సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మోదీ హాజరై ప్రసంగించాల్సి ఉంది. అయితే, ట్రంప్ విధించిన సుంకాల వైఖరిపై ఆగ్రహంతో ఉన్న ప్రధాని.. ఈ సమావేశానికి దూరంగా ఉండడంతోపాటు తన ప్రసంగాన్నీ రద్దు చేసుకున్నారు. ప్రధానికి బదులుగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరుకానున్నారు. దీంతో ఈ సమావేశంలో ప్రసంగించే వారి పేర్లను సవరిస్తూ ఐరాస తాజాగా జాబితాను విడుదల చేసింది. ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు జరిగే సమావేశాల్లో తొలిరోజు ప్రపంచ దేశాల నేతలను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించనున్నారు. అనంతరం.. బ్రెజిల్ సహా ఇతర దేశాలకు చెందిన నాయకులు ప్రసంగిస్తారు. భారత్ తరపున హాజరయ్యే జైశంకర్ ఈ నెల 27న మాట్లాడనున్నారు. కాగా, గత జూలైలో విడుదల చేసిన వక్తల జాబితాలో మోదీ 26వ తేదీన ప్రసంగించనున్నట్టు పేర్కొన్నారు.

మహీంద్రా తగ్గింపు తక్షణమే

కార్ల ధరల తగ్గింపును ప్రకటించిన టొయోటా, రెనో, మహీంద్రా



న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాన్ని కొత్త కార్ల కొనుగోలుదారులకు అందించేందుకు మరిన్ని కంపెనీలు ముందుకువచ్చాయి. ఇప్పటికే పలు మోడళ్ల ధరలను తగ్గించనున్నట్టు టాటా మోటార్స్ శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఇదే బాటలో టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం), రెనో ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీలు తమ వాహనాల ధరలను తగ్గిస్తున్నట్టు శనివారం ప్రకటించాయి. టొయోటా, రెనో ఈ నెల 22 నుంచి తగ్గించిన ధరలను అమల్లోకి తీసుకురానున్నట్టు ప్రకటించగా.. మహీంద్రా మాత్రం తక్షణమే అమల్లోకి తెస్తున్నట్టు వెల్లడించింది.

టొయోటా రూ.3.49 లక్షల వరకు..

తన వాహనాల ధరలను రూ.3.49 లక్షల వరకు తగ్గిస్తున్నట్టు కంపెనీ వెల్లడించింది. గ్లాంజా హ్యాచ్‌బ్యాక్ ధర రూ.85,300 వరకు, టైసర్ ధర రూ.1.11 లక్షలు, రుమియన్ ధర రూ.48,700, హైరైడర్ రూ.65,400, క్రిస్టా రూ.1.8 లక్షలు, హైక్రాస్ రూ.1.15 లక్షలు, ఫార్చ్యూనర్ ధర రూ.3.49 లక్షలు తగ్గనున్నట్టు పేర్కొంది. అలాగే లెజెండర్ ధర రూ.3.34 లక్షలు తగ్గే అవకాశం ఉండగా.. హైలక్స్ ధర రూ.2.52 లక్షలు, క్యామ్రీ ధర రూ.1.01 లక్షలు, వెల్‌ఫైర్ ధర రూ.2.78 లక్షలు తగ్గనున్నట్టు తెలిపింది. ఈ నెల 22 నుంచి సవరించిన ధరలు అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఈ ప్రయోజనాలను తమ కస్టమర్లకు అందిస్తున్నందుకు సంతోషంగా ఉందని టీకేఎం వైస్ ప్రెసిడెంట్ (సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ అండ్ ప్రాఫిట్ ఎన్‌హాన్స్‌మెంట్) వరిందర్ వాద్వా పేర్కొన్నారు.

రెనో రూ.96,395 వరకు..

జీఎస్టీ రేటు తగ్గింపు ప్రయోజనాన్ని కొనుగోలుదారులకు పూర్తిగా అందించనున్నట్టు రెనో ప్రకటించింది. తమ వాహనాల ధరలను రూ.96,395 వరకు తగ్గించనున్నట్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా అన్ని డీలర్‌షిప్‌లలో కొత్త ధరలతో కస్టమర్లు రెనో కారును బుక్ చేసుకోవచ్చని తెలిపింది. ఎంట్రీలెవల్ క్విడ్ ధర రూ.55,095 వరకు, ట్రైబర్ ధర రూ.80,195, కైగర్ ధర రూ.96,395 వరకు తగ్గనున్నట్టు కంపెనీ తెలిపింది. సవరించిన ధరలు ఈనెల 22న, ఆ తర్వాత చేసే అన్ని డెలివరీలకు వర్తిస్తుందని పేర్కొంది.

భారీగా ధరలు తగ్గించే యోచనలో మారుతీ

దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీ అయిన మారుతీ సుజుకీ కూడా తన కార్ల ధరలను భారీగా తగ్గించే అవకాశం ఉందన్న సంకేతాలిచ్చింది. ఆల్టో ధర రూ.40,000-50,000, వ్యాగన్ ఆర్ ధర రూ.60,000-67,000 మధ్య తగ్గవచ్చని మారుతీ సుజుకీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ 'బిజినెస్ స్టాండర్డ్' ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ధరలకు సంబంధించిన వివరాలపై కంపెనీ అధికారులు ఇంకా కసరత్తు చేస్తున్నారని చెప్పారు. జీఎస్టీ తగ్గింపు నేరుగా చిన్న కార్లకు ప్రయోజనం కలిగిస్తాయని, ఈ ఏడాదిలో అమ్మకాల్లో 10 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పన్ను సంస్కరణలతో ఆటో రంగానికి కీలకమైన ఊతం లభిస్తుందన్నారు. కాగా పన్ను తగ్గింపు తర్వాత (ఎక్స్‌షోరూమ్) మారుతీ కార్ల బేస్ మోడళ్ల ధరల అంచనాల విషయానికి వస్తే.. ఆల్టో కే10 రూ.40వేలు, వ్యాగన్ ఆర్ రూ.57 వేలు, స్విఫ్ట్ రూ.58వేలు, డిజైర్ రూ.61 వేలు, బాలెనో రూ.60వేలు, ఫ్రాన్‌ఎక్స్ రూ.68వేలు, బ్రెజ్జా రూ.78వేలు, ఎర్టిగా రూ.41వేలు, సెలేరియో రూ.50వేలు, ఎక్స్‌ఎల్ 6 రూ.35 వేలు, జిమ్నీ రూ.1.14 లక్షలు, ఇగ్నిస్ రూ.52వేలు, ఇన్విక్టో రూ.2.25 లక్షలు, ఎస్-ప్రెసో రూ.38 వేలు తగ్గవచ్చని అంచనా.

మహీంద్రా రూ.1.56 లక్షల వరకు

తన ప్యాసెంజర్ వాహన శ్రేణి ధరలను రూ.1.56 లక్షల వరకు తగ్గించినట్టు కంపెనీ ప్రకటించింది. తగ్గించిన ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. బొలేరో/నియో రేంజ్ ధర రూ.1.27 లక్షలు, ఎక్స్‌యూవీ3ఎక్స్‌వో (పెట్రోల్) రూ.1.4 లక్షలు, ఎక్స్‌యూవీ3ఎక్స్‌వో (డీజిల్) రూ.1.56 లక్షలు, థార్2డబ్ల్యూడీ (డీజిల్) రూ.1.35 లక్షలు, థార్4డబ్ల్యూడీ (డీజిల్) రూ.1.01 లక్షలు, స్కార్పియో క్లాసిక్ రూ.1.01 లక్షలు, థార్‌రాక్స్ రూ.1.33 లక్షలు, ఎక్స్‌యూవీ700 రూ.1.43 లక్షల మేర తగ్గించింది.

రూ.2 లక్షల దిగువకు జావా, యెజ్డీ బైక్‌లు

350 సీసీకన్నా తక్కువ ఉన్న మోటార్‌సైకిళ్లపై జీఎస్టీని 28% నుంచి 18 శాతానికి తగ్గించిన నేపథ్యంలో జావా, యెజ్డీ మోటార్‌సైకిళ్ల ధరలను తగ్గిస్తున్నట్టు క్లాసిక్ లెజెండ్స్ కంపెనీ ప్రకటించింది. దీంతో కొత్త కస్టమర్లకు రూ.17 వేల వరకు ప్రయోజనం కలుగనుంది. ధరల తగ్గింపుతో పలు మోడళ్ల ధరలు రూ.2 లక్షల ధరకన్నా(ఎక్స్‌షోరూమ్) దిగువకు రానున్నాయి. యెజ్డీ అడ్వెంచర్, రోడ్‌స్టర్, స్క్రాంబ్లర్, జావా 42 బాబర్ వంటి మోడళ్ల ధరలు దిగిరానున్నాయి. జావా 42 ధర రూ.1,72,942 నుంచి రూ.1,59,431కు (రూ.13,511 ఆదా), జావా 350 ధర రూ.1,98,950 నుంచి రూ.1,83,407కు (రూ.15,543 ఆదా), 42 బాబర్ ధర రూ.2,09,500 నుంచి రూ.1,93,133కు (రూ.16,367 ఆదా), 42 ధర రూ.2,10,142 నుంచి రూ.1,93,725కు (రూ.16,417 ఆదా), పెరాక్ ధర రూ.2,16,705 నుంచి రూ.1,99,775కు (రూ.16,930 ఆదా) తగ్గనుంది. ఇక యెజ్డీ రోడ్‌స్టర్ ధర రూ.2,09,969 నుంచి రూ.1,93,565కు (రూ.16,404 ఆదా), అడ్వెంచర్ ధర రూ.2,14,900 నుంచి రూ.1,98,111కు (రూ.16,789 ఆదా), స్క్రాంబ్లర్ ధర రూ.2,11,900 నుంచి రూ.1,95,345కు (రూ.16,555 ఆదా) దిగిరానున్నాయి.


దేశమంతా 'సర్' ప్రక్రియ!

- బిహార్ ఎన్నికల తర్వాత చేపట్టే యోచన?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6 : ఓటరు సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను దేశమంతా అమలుచేసే ఆలోచనలో భారత ఎన్నికల సంఘం(ఈసీ) ఉంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియను సర్వత్రా చేపట్టాలని యోచిస్తోంది. దీనిపై ఈసీ అధికారికంగా ఇంతవరకు ప్రకటన చేయకపోయినా, ఎన్నికల సంఘం వర్గాల కథనాలు, మాత్రం ఇదే విషయం ధ్రువీకరిస్తున్నాయి. ఈ వర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ చానల్ కథనం ప్రసారం చేసింది. ఈ కథకాన్ని అనుసరించి.. ఈ నెల 10వ తేదీన రాష్ట్రాల/కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారులతో (సీఈవోలు) భారత ఎన్నికల సంఘం ఢిల్లీలో భేటీ కానుంది. 'సర్' ప్రక్రియను దేశమంతా విస్తరించడంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే వీలుంది. పది పాయింట్లపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌కు వీలుగా సిద్ధమై రావాలని సీఈవోలను ఈసీ ఆదేశించింది. అయితే, ఇవన్నీ 'సర్'తో ముడిపడినవే కావడం గమనార్హం.. సీఈవోలు పనిచేస్తున్న రాష్ట్రం లేక కేంద్ర పాలిత ప్రాంతం పరిధిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు... చివరిగా 'సర్' ప్రక్రియ అక్కడ ఎప్పుడు నిర్వహించారు.. తదితర అంశాలపై ప్రజంటేషన్ ఉండాలని ఈసీ నిర్దేశించింది.

బీజేపీలో కామరాజ్ ప్లాన్!?

- పదేళ్లుగా క్యాబినెట్లో ఉన్నవాళ్లు పార్టీలోకి.. పార్టీలో సీనియర్లు ప్రభుత్వంలోకి
- ప్రజల్లోకి తరం మార్పు జరిగిందనే సంకేతాలు.. ఢిల్లీలో బీజేపీ అగ్ర నేతల ఆలోచన



న్యూఢిల్లీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో బీజేపీ కామరాజ్ ప్లాన్‌ను అమలు చేయనుందా!? పదేళ్లుగా కేంద్ర మంత్రివర్గంలో ఉన్న వారిని పార్టీలోకి.. పార్టీలో ఉన్న ముఖ్య నాయకులను ప్రభుత్వంలోకి తీసుకోనుందా!? తద్వారా, ఇటు పార్టీలోనూ అటు ప్రభుత్వంలోనూ కొత్త వారికి అవకాశం కల్పించనుందా!? ఈ ప్రశ్నకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. ఉప రాష్ట్రపతి ఎన్నిక ముగిసిన తర్వాత పార్టీ అగ్ర నేతలు ఈ అంశంపై దృష్టి సారించనున్నారని వివరించాయి. ప్రభుత్వంలో చిరకాలం ఉన్న నాయకులు పార్టీలోకి.. పార్టీకి చెందిన ముఖ్యమైన నాయకులు ప్రభుత్వంలోకి వెళ్లినప్పుడే కొత్త వారికి అవకాశాలు లభిస్తాయంటూ ఒకప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ అధ్యక్షుడు కామరాజ్ రూపొందించిన ప్రణాళికను ఇప్పుడు బీజేపీ తనదైన శైలిలో అమలు చేయనున్నట్టు తెలుస్తోంది. మోదీ క్యాబినెట్లో మొదటి నుంచీ కొనసాగుతున్న.. అధికార యంత్రాంగం నుంచి మంత్రి వర్గంలోకి చేరిన మంత్రుల్లో అత్యధికులను తప్పించి.. ఇప్పటి వరకూ పార్టీ సేవకే అంకితమైన వారిని క్యాబినెట్లో చేర్చుకునే విషయంపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఈ ప్రణాళికకు తుది రూపకల్పన జరిగిన వెంటనే మోదీ తన మంత్రివర్గ సభ్యులతో రాజీనామా చేయించే అవకాశాలున్నాయని, ఆ తర్వాత సాధ్యమైనంత మేరకు కొత్త ముఖాలతో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. అలాగే, క్యాబినెట్లోనే కాకుండా పార్టీలోనే కొనసాగుతున్న మరి కొంతమందికి వివిధ స్థాయిల్లోనూ అవకాశాలు కల్పిస్తారన్న చర్చ జరుగుతోంది. ముఖ్యంగా యువకులు, అనుభవజ్ఞులకు సమానంగా అవకాశం ఇవ్వాలని, పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తరం మార్పు జరిగిందనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు. ఇప్పటి వరకూ పలువురు ఎంపీలను ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్యేలను ఎంపీలుగా పోటీ చేయించే పద్ధతి బీజేపీలో ఉందని, కానీ, పార్టీ నుంచి ప్రభుత్వానికి, ప్రభుత్వం నుంచి పార్టీకి నాయకులను బదిలీ చేసి వారి సేవలను ఉపయోగించుకునే ప్రక్రియను అంతగా అమలు చేయలేదని పార్టీ నేత ఒకరు చెప్పారు. తద్వారా, పార్టీతో పాటు ప్రభుత్వాన్ని కూడా మరింత బలోపేతం చేయాలన్నదే తమ లక్ష్యమని ఆయన వివరించారు. కాగా, ఈ ప్రణాళికను అమలు చేస్తే కేంద్ర క్యాబినెట్లో దాదాపు 30 మంది మంత్రులను తప్పించాల్సి వస్తుందని తెలుస్తోంది. వీరిలో అత్యధికులు 2014 నుంచీ మంత్రి పదవిలో ఉన్నవారు ఉండవచ్చని సమాచారం. ఇక, పార్టీ జాతీయ అధ్యక్షుడిగా కూడా ప్రస్తుతం చర్చలో ఉన్న పేర్లు కాక కొత్త వ్యక్తిని ముందుకు తీసుకువచ్చినా ఆశ్చర్యం లేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇప్పటి వరకూ శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్, ధర్మేంద్ర ప్రధాన్ తదితరుల పేర్లు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. పార్టీ అధ్యక్షుడి టీమ్‌లో కూడా అనేక కొత్త ముఖాలకు ఆస్కారం ఉందని తెలుస్తోంది.



విశిష్ట తెలుగు దిగ్దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సాహితీవేత్తలు

చదువు, ఉద్యోగాలను మాతృభాషతో అనుసంధానం చేయాలి

- ప్రాచీన తెలుగుహోదా ఫలాలు భవిష్యత్తు తరాలకు అందించాలి
- ఆధునిక అవసరాలకు అనుగుణంగా భాషను మన పద్ధతుల్లో అన్వయించుకోవాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

విజయవాడ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'చదువు, ఉద్యోగాలను మాతృభాషతో అనుసంధానం చేసే దిశగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకు రావాలి. అప్పుడే ఇంగ్లీషుపై వ్యామోహం తగ్గుతుంది' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. తూమాటి దొణతిమ్మ రాయ చౌదరి(దొణప్ప) శతజయంతిని పురస్కరించుకుని విజయవాడలోని సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో 'విశిష్ట తెలుగు దిగ్దర్శనం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. పుస్తక రూపకర్తలైన చెన్నపురి తెలుగు అకాడమీ సభ్యులు తూమాటి సంజీవరావు, తిరునగరి భాస్కర్, పుస్తకంలోని వ్యాసాలు అందించిన రచయితలకు అభినందించారు. "మన జీవన విధానంలో మాతృభాష ఆయువు పట్టు వంటిది. ఆయువు లేకపోతే ఏ ప్రాణి అయినా జీవచ్ఛవం. అటువంటి తెలుగు సంప్రదాయాలను పునరుజ్జీవింప చేయాలి. లేకపోతే భవిష్యత్తు తరాలకు ప్రమాదం. తెలుగువారికి తెలుగు రాకపోతే మాట పడిపోయినట్టే. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ తెలుగు నేర్చుకోవాలి. తెలుగు వారు ఎక్కడ కలుసుకున్నా మాతృభాషలోనే సంభాషించుకోవాలి. 'మన భాషను నేర్చుకుందాం- పరభాషను గౌరవిద్దాం' అనే నినాదంతో తెలుగు వారు ముందుకెళ్లాలి. రాష్ట్రంలో తెలుగుభాషా పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటుచేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఎంతో మంది మహనీయుల కృషి ఫలితంగా భారతప్రభుత్వం తెలుగుకు ప్రాచీన హోదా ఇచ్చినా, తెలుగు వెలుగులు భావితరాలకు అందకపోవడం విచారకరం. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి తదితర విభాగాల్లో దొణప్ప చేసిన కృషి మహోన్నతమైనది' అని వెంకయ్య అన్నారు.. సాహితీ సవ్యసాచిగా, సాహితీ కృషీవలుడుగా పేరు పొందిన దొణప్పతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, తెలుగు సాహితీవేత్త సూరం శ్రీనివాసరావు, పాలడుగు లక్ష్మణరావు, తెలుగు భాషాభిమానులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'పల్లెకు పోదాం'

- వినూత్న కార్యక్రమానికి కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాషా శ్రీకారం
- 79 గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ఆకస్మిక పర్యటన
- వివిధ శాఖల పనితీరుపై సర్వే



పర్ల గ్రామంలో పత్తి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు, సెప్టంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు గుర్తించి, సత్వర పరిష్కారమే లక్ష్యంగా కర్నూలు కలెక్టర్ పి.రంజిత్‌బాషా 'పల్లెకు పోదాం' వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 79 మంది జిల్లా అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా ఎంపిక చేశారు. కలెక్టరు పి.రంజిత్‌బాషా సహా ప్రత్యేక అధికారులు, ఆయా శాఖల సిబ్బంది ఎంపిక చేసిన గ్రామాల్లో శనివారం ఆకస్మిక పర్యటన చేపట్టారు. పి.రంజిత్‌బాషా కల్లూరు మండలం పర్ల గ్రామంలో ఈమేరకు పర్యటించారు. తాగునీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్), అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధి హామీ పథకం అమలు, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, పారిశుధ్యం, ఇలా వివిధ శాఖల పని తీరును అధికారుల బృందం పరిశీలించింది. వివిధ శాఖల పనితీరు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కారానికి అవసరమైన నిధులు.. ఇలా సమగ్ర వివరాలతో సర్వే చేసి ఆ వివరాలను ప్రత్యేకంగా తయారు చేయించిన 'వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ సమస్యలు శాఖల వారీగా జిల్లా అధికారులకు పంపిస్తారు. ఏ నిధుల కింద ఏ సమస్యలను పరిష్కరించవచ్చో అంచనాలు తయారు చేసి ప్రాధాన్యతా క్రమంలో మండల ప్రత్యేక అధికారుల ద్వారా పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటారు. ప్రతి నెలలో ఒక గ్రామానికి ప్రత్యేక అధికారులు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

16 నెలల తరువాత తాడిపత్రికి పెద్దారెడ్డి

- సుప్రీం కోర్టు ఆదేశాలతో అనుమతించిన పోలీసులు
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు

తాడిపత్రి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎట్టకేలకు తాడిపత్రికి చేరుకున్నారు. పోలీసు బందోబస్తు నడుమ ఆయన శనివారం తన నివాసానికి చేరుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 16 నెలల తర్వాత పోలీసులు ఆయనను తన నియోజకవర్గ కేంద్రానికి అనుమతించారు. సాధారణ ఎన్నికల సమయంలో జరిగిన గొడవల నేపథ్యంలో టీడీపీ, వైసీపీ కీలక నాయకులను అప్పటి అధికారులు జిల్లా నుంచి బహిష్కరించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మూడు నెలల తరువాత తాడిపత్రికి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి వచ్చారు. కానీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని మాత్రం జేసీ వర్గీయులు తాడిపత్రికి రానివ్వలేదు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు పెద్దారెడ్డిని పలుమార్లు అడ్డుకున్నారు. దీంతో ఆయన పోలీసు శాఖ ఉన్నతాధికారులు, కోర్టులను ఆశ్రయించారు. చివరకు సుప్రీంకోర్టుకు వెళ్లి అనుమతి పొందారు. పెద్దారెడ్డి రాకతో తాడిపత్రిలో టెన్షన్ వాతావరణం ఏర్పడింది. పెద్దారెడ్డి వారం క్రితం తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వినాయకచవితి పండుగ తరువాత వెళ్లాలని ఎస్పీ జగదీశ్ సూచించడంతో ఆగిపోయారు. ఎస్పీ ఆదేశాలకు అనుగుణంగా చోటా మోటా నాయకులందరినీ పోలీసులు శనివారం హౌస్ అరెస్ట్ చేశారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులకు సహకరిస్తానని పెద్దారెడ్డి అన్నారు.

అప్పన్నను దర్శించుకున్న న్యాయమూర్తులు

సింహాచలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ శనివారం ఉదయం సింహాచలంలో వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అంతరాలయంలో పూజల అనంతరం కప్పస్తంభం ఆలింగనం, బేడా మండప ప్రదక్షిణ, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు జరిపారు.



కప్పస్తంభం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తి జస్టిస్ గుణరంజన్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న డిప్యూటీ ఈఓ రాధ

స్వామీ.. ఇదేం భారం!

- దేవుడి మొక్కులకు హుండీల్లో విలువలేని నోట్లు
- 'ద్వారకా తిరుమల'లో పేరుకుపోతున్న రద్దయిన పాత కరెన్సీ
- దాచలేక.. పడేయలేక అధికారుల తంటాలు
- చిల్లర నాణేలతోనూ పనిలేదని పెదవి విరుపు

(ద్వారకాతిరుమల-ఆంధ్రజ్యోతి)

దేవుడి హుండీలు కానుకలతో నిండితే మంచిదే! ఆలయ అభివృద్ధి పాటు భక్తులకు తగిన వసతి సదుపాయాలు కల్పించేందుకు అవకాశముంటుంది. కానీ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ ఆలయాల హుండీల్లో భక్తులు ఇంకా 'మొక్కు'..బడిగా పాత చెల్లని కరెన్సీని కానుకలుగా వేయడం నిర్వాహకులకు తలనొప్పిగా మారింది. ఈ కారణంగా ద్వారకా తిరుమల, అన్నవరం, సింహాచలం, విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీశైలం, కాణిపాకం, పెనుగంచిప్రోలు వంటి ప్రముఖ ఆలయాల్లో కోట్లాది రూపాయల మేర రద్దయిన పాత కరెన్సీ కోట్లాది రూపాయల మేర పేరుకుపోయింది. ఆయా ఆలయాల్లో హుండీలు తెరిస్తే చాలు... ఇప్పటికీ పాత రూ.500, రూ.1000ల నోట్లు దర్శనమిస్తూనే ఉన్నాయి. ఈనోట్లు రద్దయి తొమ్మిదేళ్లు గడుస్తున్నా కొందరు భక్తులు ఇంకా ఆ నోట్లను ఇప్పటికీ హుండీల్లో వేస్తూనే ఉన్నారు. దీంతో ఇవి ఆలయాల స్ట్రాంగ్ రూముల్లో మూటల్లో మూలుగుతున్నాయి. విలువలేని ఈ నోట్లను భద్రంగా బీరువాల్లో భద్రపరుస్తున్నారు. ఇవి రద్దయిన రెండేళ్ల తర్వాత అంటే 2018-2019 ప్రాంతంలో దేవదాయ శాఖ ఆదేశాల మేరకు అన్ని ఆలయాల సిబ్బంది ముంబైలోని రిజర్వ్ బాంక్‌కు వెళ్లి పాతనోట్లు మార్చాలని కోరినా, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు లేవని చెప్పడంతో వారు వెనుతిరిగారు. అప్పటి నుంచి అవి స్ట్రాంగ్ రూమ్‌లకే పరిమితమయ్యాయి. ఇటీవల రద్దైన రూ.2వేల నోటు కూడా ఆ జాబితాలో చేరినా, దాన్నింకా మార్చుకునే అవకాశం ఉండటం కాస్త ఊరటనిస్తోంది.



ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయ హుండీల లెక్కింపులో నాణేలు, కరెన్సీని జల్లెడతో వేరు చేస్తున్న సిబ్బంది



గత తొమ్మిదేళ్లుగా మూటల్లో మూలుగుతున్న పాత కరెన్సీ

మొక్కుబడిగా..!

ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చినవెంకన్న దేవస్థానంలో 2017 జనవరి 17 నుంచి 2025 జూలై 17 నాటికి రూ.88.17 లక్షల విలువైన పాత కరెన్సీ ఉన్నట్టు ఆలయ అధికారులు చెబుతున్నారు. ఆలయ స్ట్రాంగ్ రూమ్‌లో, రద్దయిన వెయ్యి నోట్లు 2,873, రద్దయిన రూ.500 నోట్లు 11,888 ఉన్నట్లు వారు వివరించారు. రద్దయిన రూ.2000 నోట్లు కూడా ఉన్నా వాటిని మార్చుకునే అవకాశం ఇంకా ఉందని వారు ధీమా వ్యక్తం చేశారు. హుండీల ద్వారా రూ.2 వేల నోట్లు వంద వరకు వచ్చిన వెంటనే వాటిని హైదరాబాద్, రిజర్వ్ బ్యాంకులో మారుస్తున్నట్టు చెబుతున్నారు. తాజాగా, గత నెల 17న నిర్వహించిన హుండీల లెక్కింపులో సైతం 14.. 2000 నోట్లు మినహాయిస్తే, పాత రూ.500 నోట్లు 15, రూ.1000లు 12 నోట్లు వచ్చాయి. ఇంకా తమ వద్ద ఉన్న ఇలాంటి నోట్లను పాడేయడం ఇష్టం లేకే.. సదరు భక్తులు విలువలేని నోట్లను మొక్కుబడుల పేరుతో హుండీల్లో వేస్తున్నట్టు తెలుస్తోంది. వీటిని ఇలా మూటలు కట్టి దాయడం తప్ప ఏమీ చేయలేమని అధికారులు పెదవి విరుస్తున్నారు. విలువలేని కరెన్సీ నోట్ల పరిస్థితి ఇలా ఉంటే... విలువ ఉన్న చిల్లర నాణేలు సైతం పలు కారణాలతో బ్యాంకుల్లో మూలుగుతున్నాయి.



ద్వారకా తిరుమల శ్రీవారికి హుండీల ద్వారా వచ్చిన రద్దయిన పాత కరెన్సీ

బ్యాంకుల్లో మూలుగుతున్న చిల్లర మూటలు

ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల ద్వారా ప్రతి నెలా దాదాపు రూ.9 లక్షల వరకూ చిల్లర నాణేలు వస్తాయి. కోట్లాది రూపాయల మేర డిపాజిట్‌లు ఉంటాయికాబట్టి నోట్లతో పాటు ఆ చిల్లర నాణేలను సైతం యూనియన్ బ్యాంకు అధికారులు తప్పనిసరిగా తమతో తీసుకుని వెళ్తున్నారు. ప్రస్తుతం స్థానిక యూనియన్ బ్యాంకులో రూ.35 లక్షల వరకూ చిల్లర నాణేలు మూటల్లో మూలుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. గతంలో వ్యాపారులు ఆలయ హుండీలు తెరిచే సమయంలో ఆ నాణేల కోసం పడిగాపులు కాసేవారు. అయితే ఇప్పుడా పరిస్థితులు లేవు. యూపీఐ చెల్లింపులు అందుబాటులోకి రావడంతో ప్రత్యక్ష నగదు చెల్లింపులు కొంతవరకు ఆగిపోయాయి. దీంతో బ్యాంకుల్లో చిల్లర మూటలు పేరుకుపోతున్నాయి.

25లోగా అద్దాల వంతెన, టీసీఎస్ ప్రారంభం

- విశాఖలో సిద్ధమైన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ప్రతిష్ఠను పెంచే రెండు ప్రాజెక్టులను ఈ నెల 25వ తేదీలోపు ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ పీపీపీ కింద రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన అద్దాల వంతెనను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ప్రారంభింపజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. కైలాసగిరిపై ఇప్పటికే ప్రారంభించిన పారా సైక్లింగ్ గ్లైడింగ్ విజయవంతంగా నడుస్తున్నాయన్నారు.

సిద్ధమైన టీసీఎస్ టవర్

టీసీఎస్ విశాఖలో తన కార్యాలయాన్ని సిద్ధం చేసుకుంది. సంస్థకు రుషికొండ ఐటీ పార్కు హిల్ నంబరు-3పై మిలీనియం టవర్స్ కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో ఇంటీరియర్ పనులు పూర్తయ్యాయి. ఈ నెల 20వ తేదీన టీసీఎస్ ప్రారంభించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆరోజున సీఎం రాక ఖరారైతే, అదేరోజు గ్లాస్ వంతెన ప్రారంభం కూడా ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఉన్నత విద్యతోనే దేశాభివృద్ధి

- వీఐటీ వ్యవస్థాపకులు కె. విశ్వనాథన్
- ఘనంగా 'వీఐటీ చెన్నై' 13వ స్నాతకోత్సవం
- 6,581 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం



టాప్ ర్యాంకర్‌కు బంగారు పతకం, ప్రశంసాపత్రం ప్రదానం చేస్తున్న కె.విశ్వనాథన్, జీవీ సెల్వం తదితరులు

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'వీఐటీ చెన్నై' 13వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వీఐటీ చెన్నై ప్రాంగణంలో జరిగిన ఈ స్నాతకోత్సవానికి వీఐటీ వ్యవస్థాపకులు, చాన్స్‌లర్ డాక్టర్ కె.విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, వర్సిటీ ఉపాధ్యక్షులు డా.శంకర్ విశ్వనాథన్, డా.జీవీ సెల్వం అతిథులను పరిచయం చేశారు. వైస్ చాన్స్‌లర్ డా.వీఎస్ కాంచన భాస్కరన్ స్వాగతోపన్యాసం చేశారు. తమిళనాడు సమాచార, సాంకేతిక శాఖ మంత్రి డా.పళనివేల్ త్యాగరాజన్ ముఖ్య అతిథిగా, చెన్నైలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ షెల్లీ సలేహిన్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ స్నాతకోత్సవంలో 6,468 మంది అండర్ గ్రాడ్యుయేట్, 113 మంది పోస్టుగ్రాడ్యుయేట్ మొత్తం 6,581 మంది విద్యార్థిని,విద్యార్థులు పట్టాలు స్వీకరించారు. 39 మంది టాప్ ర్యాంకర్లు బంగారు పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో విద్యార్థుల స్థూలనమోదు నిష్పత్తి కేవలం 29శాతమేనని, ఇది 50 శాతానికి పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విద్యకు కేవలం 2.5 శాతం నిధులు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. ఉన్నత విద్య ద్వారా మాత్రమే భారతదేశం 2047 నాటికి ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటవగలదని అభిప్రాయపడ్డారు. మంత్రి త్యాగరాజన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేగవంతమైన ఆర్థికాభివృద్ధికి కారణం విద్యావంతులైన మహిళలు వివిధ పరిశ్రమల్లో పనిచేయటమేనన్నారు. ప్రస్తుతం విద్య అనేది ఉద్యోగం, నైపుణ్యాలను మెరుగుపరచడం గురించి మాత్రమే ఉందని, ఈ విధానాన్ని కొద్దిగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక అతిథి షెల్లీ సలేహిన్ మాట్లాడుతూ... వీఐటీ వ్యవస్థాపకులు విశ్వనాథన్ నిర్వహిస్తున్న ఉన్నత విద్యాసంస్థల్లో డిగ్రీలు పూర్తిచేసిన వారెందరో బంగ్లాదేశ్‌తో పాటు వివిధ దేశాల్లో ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ వైస్ ఛాన్సలర్ డా.డి.త్యాగరాజన్, అడ్వైజర్ డా.ఎస్పీ త్యాగరాజన్, వీఐటీ వేలూరు అసోసియేట్ వైస్ ఛాన్సలర్ డా.పార్థసారధి మాలిక్, అదనపు రిజిస్ట్రార్ టి.జయభారతి, డా.పీకే మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.

- చంద్రగ్రహణం ఎఫెక్ట్..

నేటి మధ్యాహ్నం శ్రీవారి ఆలయం మూసివేత

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3.30 నుంచి సోమవారం వేకువజాము 3 గంటల వరకు తిరుమల శ్రీవారి ఆలయం మూతపడనుంది. ఆదివారం రాత్రి 9.50 గంటలకు చంద్రగ్రహణం మొదలై సోమవారం వేకువజామున 1.31 గంటలకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణానికి 6 గంటల ముందు ఆలయ తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సోమవారం ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవతో ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు శ్రీవారి దర్శనం మొదలవుతుంది. అయితే శనివారం సాయంత్రానికే సర్వదర్శన క్యూలైన్ బాటగంగమ్మ ఆలయం వరకు వ్యాపించింది. ఈ క్రమంలో వీరందరికీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల లోపు దర్శనం పూర్తిచేయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, ఆదివారం నాటి ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలతో పాటు పౌర్ణమి గరుడసేవను కూడా టీటీడీ రద్దు చేసింది. మరోవైపు గ్రహణం కారణంగా అన్నప్రసాద కేంద్రాన్ని ఆదివారం సాయంత్రం 3 గంటలకే మూసివేస్తారు. తిరిగి సోమవారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో తిరుమలలోని పలు ప్రదేశాల్లో దాదాపు 30 వేల అన్నప్రసాద ప్యాకెట్లను అందించేలా ప్రణాళికలు రూపొందించారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో కేఎల్‌యూకు 26వ ర్యాంక్



ర్యాంక్ సర్టిఫికెట్లు చూపిస్తున్న కేఎల్‌యూ వీసీ సారధివర్మ, యూనివర్సిటీ అధికారులు

తాడేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు పాటించే యూనివర్సిటీలకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఇచ్చే ర్యాంకింగ్‌లలో యూనివర్సిటీ విభాగంలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ 26వ ర్యాంక్ దక్కించుకున్నట్టు ఉపకులపతి డాక్టర్ సారధివర్మ తెలిపారు. శనివారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా ప్రణాళిక, మౌలిక వసతులు, నాణ్యత నైపుణ్యం వంటి ప్రమాణాలు, పరిశోధనా ప్రాజెక్టు, ప్లేస్‌మెంట్స్, పీహెచ్‌డి పొందిన ప్రొఫెసర్స్ వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ఇస్తారని, ఈ అంశాలలో తమ యూనివర్సిటీ అత్యుత్తమంగా ఉందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లలో జాతీయ స్థాయిలో 26వ ర్యాంక్, ఇంజనీరింగ్ విభాగంలో 35వ ర్యాంక్, ఓవరాల్ కేటగిరిలో 46వ ర్యాంక్, మేనేజ్‌మెంట్ విభాగంలో 70వ ర్యాంకు వచ్చిందని చెప్పారు. యూనివర్సిటీ నుంచి ప్రతి ఏటా 6200 మంది విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసుకుంటున్నారని, అలాగే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో కూడా గత పదిహేడేళ్లుగా 100 శాతం ప్లేస్‌మెంట్స్ సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో యూనివర్సిటీ నైపుణ్యాభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ శ్రీనాథ్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎంహెచ్ఎస్ విభాగం డీన్ డాక్టర్ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

తప్పించుకున్న రిమాండ్ ఖైదీలు దొరికారు

- విశాఖలో పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా చోడవరం సబ్‌జైలు నుంచి తప్పించుకున్న రిమాండ్ ఖైదీలు ఇద్దరినీ శనివారం విశాఖలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రిమాండ్ ఖైదీలుగా ఉన్న నక్కా రవికుమార్ (30), బెజవాడ రాము (26) శుక్రవారం విధుల్లో ఉన్న డిప్యూటీ జైలర్‌ను సుత్తితో కొట్టి జైలు నుంచి పరారైన విషయం తెలిసిందే. వీరిని పట్టునేందుకు అనకాపల్లి జిల్లా పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. అలాగే నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. అందులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు తన సిబ్బందితో ద్వారకా నగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్ పరిసరాల్లో గాలిస్తుండగా రవికుమార్, రాములు కాంప్లెక్స్ వైపు నుంచి డాబాగార్డెన్స్ వైపు నడుచుకుంటూ వెళ్లడం గమనించారు. గొల్లలపాలెం ఎస్‌బీఐ జంక్షన్ వద్ద చాకచక్యంగా ఇద్దరినీ పట్టుకున్నారు. ఇద్దరినీ చోడవరం పోలీసులకు అప్పగించారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

నిజానికి ఆరు నెలల క్రితం భారత రాష్ట్ర సమితి పుంజుకుంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం తమదే అని బీఆర్‌ఎస్ నేతలు బలంగా నమ్మారు. ఇప్పుడు అదే పరిస్థితి ఉందా అంటే చెప్పలేం. ఎందుకంటే, ఎన్నికల వైతరణిని కేసీఆర్ సునాయాసంగా దాటాలంటే మధ్యలో ఎన్నో గండాలను అధిగమించాల్సి ఉంటుంది. బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నట్టుగా రేవంత్‌రెడ్డి–చంద్రబాబు–మోదీ కలిసి కుట్రపన్నారన్నది నిజమే అనుకుందాం. ఇలాంటి రాజకీయాలు కేసీఆర్‌కు కొత్త కాదు. 2019 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించడానికి జగన్మోహన్‌రెడ్డితో కలిసి కుట్ర చేశారు కదా! ప్రస్తుతం సాధారణ ఎన్నికలకు మూడేళ్లకు పైగా వ్యవధి ఉన్నందున సీబీఐ విచారణ ఎలా ఉండబోతుందన్నదే కీలకం. బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నట్టుగా బీజేపీ పెద్దలకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య అవగాహన నిజంగానే ఉంటే... ప్రస్తుత సంకటం నుంచి కేసీఆర్ తప్పించుకోలేరని చెప్పవచ్చు. కాంగ్రెస్, బీజేపీ ఆటలో కేసీఆర్ పావుగా మారతారని ఎవరైనా ఊహించగలరా?

రేవంత్ దెబ్బకు రెండు పిట్టలు!

'ఆయనొక అపర చాణక్యుడు – రాజకీయ గండర గండడు! పాచిక విసిరాడంటే రాజకీయ ప్రత్యర్థులు చిత్తు కావాల్సిందే'... తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు ఆయన మద్దతుదారులు తగిలించిన భుజకీర్తులు ఇవి. కాలం కలిసి వచ్చినంత వరకు ఆయన అలాగే వెలుగొందారు. 2023 ఎన్నికల తర్వాత ఆయన జాతకం తిరగబడింది. ఒకప్పుడు తన ఎత్తుగడలకు చిత్తయిన రాజకీయ ప్రత్యర్థులే ఇప్పుడు ఆయనపై పైచేయి సాధిస్తున్నారు. ఒకవైపు ఇంటిపోరు, మరో వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దూకుడుతో కేసీఆర్ పరిస్థితి తలకిందులవుతోంది. అధికారంలో ఉన్నప్పుడు ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి జుట్టు దొరకపుచ్చుకొని ఒక ఆట ఆడుకున్న కేసీఆర్... ఇప్పుడు అదే రేవంత్‌రెడ్డి ఎత్తుగడలకు చిత్తు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, అవకతవకలు జరిగాయని చాలాకాలంగా ఆరోపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవకాశం కోసం ఎదురుచూశారు. పీసీ ఘోష్ నివేదిక తదనంతర పరిణామాలతో కేసీఆర్‌కు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా కాళేశ్వరంపై సీబీఐతో విచారణ చేయిస్తామని శాసనసభలో ప్రకటించి కేంద్రానికి విజ్ఞప్తి పంపటం ద్వారా ఇటు భారత రాష్ట్ర సమితిని, అటు భారతీయ జనతా పార్టీని రేవంత్‌రెడ్డి ఒకేసారి ఇరకాటంలోకి నెట్టారు. తన చేతికి మట్టి అంటకుండా సీబీఐ భుజాలపై తుపాకీ పెట్టి కేసీఆర్‌ను దెబ్బతీసే ఎత్తుగడను ఆయన ఎంచుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా అవినీతి జరిగిందని చెప్పించి... కేసీఆర్‌పై చర్యలు తీసుకొని ఉంటే కక్ష సాధింపునకు పాల్పడ్డారన్న అపవాదు వచ్చి ఉండేది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల విశ్వసనీయత ప్రశ్నార్థకంగా ఉండేది. దీంతో నిజాన్ని నిగ్గు తేల్చే బాధ్యతను సీబీఐకి బదలాయించారు. ఈ చర్యవల్ల ఒక రకంగా బీజేపీ కూడా ఇరకాటంలో చిక్కుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసీఆర్ అండ్ కోకు క్లీన్ చిట్ ఇస్తే... బీఆర్‌ఎస్–బీజేపీ ఒకటేనని నిందించే అవకాశం రేవంత్‌రెడ్డికి దక్కుతుంది. అలా కాకుండా కేసీఆర్ అండ్ కోను సీబీఐ దోషులుగా నిర్ధారిస్తే తాను కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డానన్న అపవాదు నుంచి తప్పించుకోవచ్చు. ఒకవేళ సీబీఐ విచారణకు కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తే ఆ రెండు పార్టీలూ తోడు దొంగలని నిందించవచ్చు. రాజకీయాల్లో తనకు లోతు తెలియదని అనుకోవద్దని వివిధ సందర్భాలలో ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానిస్తూ రావడం ఈ సందర్భంగా గమనార్హం. ఫార్ములా వన్ కారు రేసు వ్యవహారం, ఫోన్ టాపింగ్ ఉదంతంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తుపై ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్నట్టుగా ఉంది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం లడ్డూలా రేవంత్‌రెడ్డి చేతికి అందింది. అందివచ్చిన ఈ అవకాశాన్ని దొరకపుచ్చుకున్న ముఖ్యమంత్రి తనలోని రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శించారు. చాతుర్యం అని ఎందుకు అనవలసి వచ్చిందంటే, కాళేశ్వరం వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలతో మాత్రమే దర్యాప్తు జరిపిస్తారని బీఆర్‌ఎస్ ముఖ్యులు భావించారు. వారి అంచనాలకు భిన్నంగా కేసును సీబీఐకి అప్పగించడంతో వారు కంగుతిన్నారు. అందుకే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరచుగా విమర్శించే సీబీఐని ఎంచుకోవడం ద్వారా రేవంత్‌రెడ్డి పార్టీ అధిష్ఠానాన్ని కూడా ధిక్కరిస్తున్నారని విమర్శలు చేశారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి తదుపరి చర్యలు తీసుకుంటారని భావించి, దాని ఆధారంగా చర్యలు తీసుకోకుండా నిలువరించాలని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులు ఎలా ఉన్నా తన లక్ష్యం దెబ్బతినకూడదని భావించి... ఎన్‌డీఎస్ఏ వంటి సంస్థల నివేదికల ఆధారంగా సీబీఐ చేత విచారణ జరిపించాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ విషయంలో కూడా బీఆర్‌ఎస్ నేతల అంచనాలకు భిన్నంగా ఆయన వ్యవహరించారు. హైకోర్టు కూడా సీబీఐ విచారణను అడ్డుకోజాలమని ప్రకటించింది. దీంతో నీళ్లు ఇచ్చిన మహానేతపై నిప్పులు కురిపిస్తారా అంటూ కేసీఆర్ తన సొంత మీడియాలో కథనాలు వండి వార్చారు. రాష్ట్రాన్ని సాధించిన మనిషిపై సీబీఐ విచారణ జరిపించడం అన్యాయమని విమర్శలు చేశారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా మహా కుట్ర జరిగిందని, రేవంత్‌రెడ్డి–ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు–ప్రధాని నరేంద్ర మోదీ కలిసి కుట్ర పన్నారని నిందించడం మొదలుపెట్టారు. ఇంకా నయం, చైనాలో ఇటీవల సమావేశమైన జిన్ పింగ్–పుతిన్–మోదీ కలిసి కుట్ర చేశారని ఆరోపించడం లేదంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ప్రతిసారీ బాబు బూచీ...

తెలంగాణ ఏర్పడి పదకొండు సంవత్సరాలు దాటినా, ఇప్పటికీ రాజకీయంగా ఇబ్బంది ఎదురైన ప్రతిసారీ చంద్రబాబును బూచిగా చూపించడం భారత రాష్ట్ర సమితికి అలవాటే. ఇప్పుడు కూడా కేసీఆర్‌పై సీబీఐ విచారణ జరిగితే అందుకు చంద్రబాబు కారణమని నిందించడం మొదలు పెట్టారు. తెలంగాణ సెంటిమెంటు పూర్తిగా ఆవిరైతే కేసీఆర్‌కు అజెండా ఉండదు. కనుక రాజకీయ వ్యూహంలో భాగంగా చంద్రబాబును ముడిసరుకుగా వాడుకోవడాన్ని ఆక్షేపించాల్సింది లేదు. అయితే, సీబీఐ విచారణ పర్యవసానాలు తెలంగాణ రాజకీయాలపై ఎలా ఉండబోతున్నాయన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. మూడేళ్ల తర్వాత జరగబోయే సాధారణ ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్ ఉనికిలో ఉండకూడదని రేవంత్‌రెడ్డి బరాబర్ కోరుకుంటున్నారు. కాంగ్రెస్–బీజేపీ మధ్యనే ఎన్నికల పోరు కేంద్రీకృతం కావాలని, మూడో పార్టీ రంగంలో ఉండకూడదు అన్నది రేవంత్‌రెడ్డి అభిమతం. అదే సమయంలో బీజేపీ కూడా భారత రాష్ట్ర సమితి ఉనికిలో ఉండకూడదనే భావిస్తోంది. బీజేపీ అగ్రనేతలు ప్రాంతీయ పార్టీల మనుగడకు వ్యతిరేకమన్న అభిప్రాయం ఎప్పటి నుంచో ఉంది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో తన కుమార్తె కవిత తీహార్ జైల్లో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తానని కేసీఆర్ ప్రతిపాదనలు పంపారు. ఈ విషయాన్ని కొంత కాలం క్రితం కవిత కూడా ధ్రువీకరించారు. విలీనం కాకపోయినా పొత్తు పెట్టుకుందామని బీఆర్‌ఎస్ నేతలు ప్రతిపాదించగా, పొత్తుతో ఆ పార్టీకి ప్రాణం పోయడం ఇష్టం లేని బీజేపీ అగ్రనేతలు అందుకు కూడా తిరస్కరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ జుట్టును కేంద్ర ప్రభుత్వం చేతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందించారు. వచ్చే ఎన్నికల నాటికి సీబీఐ విచారణ పూర్తవుతుందో లేదో తెలియదు. అయితే, కేసీఆర్ అండ్ కో పరిస్థితి దిన దిన గండం నూరేళ్ల ఆయుష్షుగా ఉంటుంది. కేసీఆర్‌ను దోషిగా నిర్ధారించి తదుపరి చర్యలు తీసుకుంటే బీఆర్‌ఎస్ అస్తిత్వం కోల్పోతుందని, రాజకీయంగా ఇది తమకు ప్రయోజనకరం అని భావిస్తే కేంద్ర ప్రభుత్వ చర్యలు ఆ దిశగానే ఉండవచ్చు. అంత దూరం వెళ్లడం ఇష్టం లేకపోతే బీఆర్‌ఎస్‌ను తమ పార్టీలో విలీనం చేయాలని బీజేపీ ప్రతిపాదించవచ్చు. లేదా పొత్తుపెట్టుకొని తాము పెద్దన్న పాత్ర పోషించవచ్చు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ నిస్సహాయ స్థితిలో ఉందని చెప్పవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఒంటి కాలిపై లేచినట్టుగా కేంద్ర ప్రభుత్వంపై కాలు దువ్వలేరు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుత పరిస్థితి అందరికీ తెలిసిందే. లిక్కర్ కుంభకోణంలో అరెస్టయి జైలుకు వెళ్లక ముందు కేజ్రీవాల్ జాతీయ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగారు. కాంగ్రెస్ పార్టీకి తానే ప్రత్యామ్నాయం అనేదాకా ఆయన ఆలోచనలు సాగాయి. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ఆప్ ఉనికి లేకుండా పోయింది. ఇండియా కూటమి నేతలు కూడా కేజ్రీవాల్‌ను పట్టించుకోవడం లేదు. ఇకపైనా... భారతీయ జనతా పార్టీ విజయానికి హరియాణాలో సహకరించినట్టుగా మున్ముందు జరిగే ఎన్నికల్లో కూడా కేజ్రీవాల్ అదే పాత్ర పోషించవచ్చు. కళ్లెదురుగా కేజ్రీవాల్ అనుభవాన్ని చూస్తూ కూడా కేసీఆర్ అండ్ కో తల ఎగరేస్తారని భావించలేం. చంద్రబాబు–రేవంత్‌రెడ్డికి ముడిపెట్టి రాజకీయంగా ప్రయోజనం పొందాలనుకోవడం వేరు. కేంద్ర పెద్దలు మోదీ–షాలతో పెట్టుకుని మనుగడ సాగించడం వేరు. కేసీఆర్ మీదనే సీబీఐ విచారణ జరిపిస్తారా అని హైదరాబాద్‌లో కూర్చొని విమర్శలు చేసినా, గింజుకున్నా ప్రయోజనం ఉండదు. లిక్కర్ కేసులో అరెస్టయ్యే వరకు కేజ్రీవాల్ జాతీయ స్థాయిలో కేసీఆర్‌కంటే బలమైన నాయకుడు. పలు రాష్ట్రాల్లో

> కేసీఆర్ ఇంటిలో మొదలైన పోరుకు కారణం దోచుకున్నది పంచుకోవడంలో వచ్చిన తేడాల వల్లనే అనే ప్రచారం జరగడంతో కవిత తన దిశను మార్చుకున్నారా? లేక, ఆమె కేసీఆర్ వదిలిన బాణమేనా? అన్న సందేహాలు ఇప్పుడు కలుగుతున్నాయి.

ఆమ్ ఆద్మీ పార్టీని విస్తరించారు. ఆయన బాటలోనే కేసీఆర్ కూడా పలు రాష్ట్రాలలో బీఆర్‌ఎస్‌ను విస్తరించాలనుకున్నారు. చివరకు సొంత రాష్ట్రంలోనే చతికిలపడ్డారు. కేజ్రీవాల్‌కు కూడా ఇదే అనుభవం ఎదురైంది. పుట్టిల్లు ఢిల్లీలోనే ఆప్ తుడిచిపెట్టుకుపోయింది. కేజ్రీవాల్ ఉద్యోగం పోయింది. ప్రస్తుతం బీఆర్‌ఎస్ నాయకులు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ... అంతర్గత సంభాషణల్లో మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి! ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీ జరిపిన దర్యాప్తు నివేదిక ఆధారంగా చంద్రబాబును జైల్లో పెట్టారు. దీంతో చంద్రబాబు పట్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడింది. కేజ్రీవాల్‌ను కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు అరెస్టు చేశాయి. చంద్రబాబు విషయంలో జరిగినట్టుగా కేజ్రీవాల్‌కు సానుభూతి లభించలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేస్తున్నప్పటికీ... ప్రజల్లో ఆయన విశ్వసనీయత సన్నగిల్లలేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేష్టల కారణంగా మోదీ ప్రతిష్ఠ జాతీయంగా, అంతర్జాతీయంగా మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ అండ్ కో కేంద్ర పెద్దలను ధిక్కరించజాలరు. ఒక్క మాటలో చెప్పాలంటే కేసీఆర్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు బీజేపీ పెద్దల చేతుల్లోనే ఉంది. ప్రస్తుతానికి వారి టర్మ్స్‌కు లోబడి నడుచుకోవాల్సిన పరిస్థితిలో కేసీఆర్ ఉన్నారు.



నెగ్గడం... తగ్గడం!

రాజకీయాల్లో ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో కూడా తెలియాలి. అది తెలుసుకున్నందువల్లే ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా 30 ఏళ్ల క్రితం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు మధ్యలో కొన్నాళ్లు అధికారం కోల్పోయినా మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నారు. చంద్రబాబును వివిధ సందర్భాలలో ఈసడించుకొన్న కేసీఆర్ ప్రస్తుత గడ్డు పరిస్థితుల్ని ఎలా అధిగమిస్తారో చూడాలి. చంద్రబాబును హైదరాబాద్ నుంచి తరిమేసిన ఘనుడు కేసీఆర్ అని బీఆర్‌ఎస్ నేతలు గొప్పగా చెప్పుకొంటారు. ప్రతికూల పరిస్థితుల్లో వెనకడుగు వేయడం, తగ్గి ఉండటం తెలుసు గనుకనే చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రాగలిగారు. మూడేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో విజయం సాధించి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాగలరా? అంటే ప్రస్తుతం చెప్పలేని పరిస్థితి. నిజానికి ఆరు నెలల క్రితం భారత రాష్ట్ర సమితి పుంజుకుంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం తమదే అని బీఆర్‌ఎస్ నేతలు బలంగా నమ్మారు. ఇప్పుడు అదే పరిస్థితి ఉందా అంటే చెప్పలేం. ఎందుకంటే, ఎన్నికల వైతరణిని కేసీఆర్ సునాయాసంగా దాటాలంటే మధ్యలో ఎన్నో గండాలను అధిగమించాల్సి ఉంటుంది. కాళేశ్వరం కేసులో విచారణ జరపబోతున్న సీబీఐ వచ్చే ఎన్నికల నాటికి ఆయనను నిర్దోషిగా ప్రకటించి వదిలేస్తే మాత్రం ప్రజల్లో సానుభూతి ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కావొచ్చు. కేంద్ర పెద్దలు అంత ఉదారంగా వ్యవహరిస్తారా? అన్నది ప్రశ్నార్థకమే. కీలు ఎరిగి వాత పెట్టినట్టు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరం అంశాన్ని తెర మీదకు తెచ్చారు. నిజానికి ఈ అంశం అటకెక్కినట్టే అని ఇప్పటి వరకు అందరూ భావించారు. ఏకంగా సీబీఐ విచారణను కోరతారని చాలా మంది ఊహించలేదు. ఈ నేపథ్యంలో సీబీఐ విచారణ ప్రారంభమవడంలో జాప్యం జరిగే కొద్దీ స్థానికంగా బీజేపీపై ఒత్తిడి పెరుగుతుంది. బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నట్టుగా రేవంత్‌రెడ్డి–చంద్రబాబు–మోదీ కలిసి కుట్రపన్నారన్నది నిజమే అనుకుందాం. ఇలాంటి రాజకీయాలు కేసీఆర్‌కు కొత్త కాదు. 2019 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించడానికి జగన్మోహన్ రెడ్డితో కలిసి కుట్ర చేశారు కదా! ప్రస్తుతం సాధారణ ఎన్నికలకు మూడేళ్లకు పైగా వ్యవధి ఉన్నందున సీబీఐ విచారణ ఎలా ఉండబోతుందన్నదే కీలకం. బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నట్టుగా బీజేపీ పెద్దలకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య అవగాహన నిజంగానే ఉంటే... ప్రస్తుత సంకటం నుంచి కేసీఆర్ తప్పించుకోలేరని చెప్పవచ్చు. కాంగ్రెస్, బీజేపీ ఆటలో కేసీఆర్ పావుగా మారతారని ఎవరైనా ఊహించగలరా? ప్రస్తుతానికి రాజకీయ ఎత్తుగడల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే పైచేయి అయింది. ఇకపై బీజేపీ, బీఆర్‌ఎస్‌లలో ఎవరిది పైచేయి కాబోతుందన్నది తెలియాలంటే వేచి చూడాల్సిందే. నిన్నటిదాకా బీఆర్‌ఎస్‌ను విమర్శించినా తెలంగాణ అస్తిత్వంపై దాడిచేసినట్టు ప్రచారం చేసినవాళ్లు, కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు లబ్ధి పొందినవాళ్లు ఎందుకనో ప్రస్తుతం మౌనంగా ఉన్నారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ జరపడమంటే తెలంగాణ అస్తిత్వంపై దాడి చేయడమేనని గుండ్రని బల్లల చుట్టూ కూర్చొని చర్చలు చేయడం లేదు కూడా!

> ప్రస్తుతం బీఆర్‌ఎస్ నిస్సహాయ స్థితిలో ఉందని చెప్పవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఒంటి కాలిపై లేచినట్టుగా కేంద్ర ప్రభుత్వంపై కాలు దువ్వలేరు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుత పరిస్థితి అందరికీ తెలిసిందే. లిక్కర్ కుంభకోణంలో అరెస్టయి జైలుకు వెళ్లక ముందు కేజ్రీవాల్ జాతీయ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగారు. కాంగ్రెస్ పార్టీకి తానే ప్రత్యామ్నాయం అనేదాకా ఆయన ఆలోచనలు సాగాయి. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ఆప్ ఉనికి లేకుండా పోయింది. ఇండియా కూటమి నేతలు కూడా కేజ్రీవాల్‌ను పట్టించుకోవడం లేదు. కళ్లెదురుగా కేజ్రీవాల్ అనుభవాన్ని చూస్తూ కూడా కేసీఆర్ అండ్ కో తల ఎగరేస్తారని భావించలేం. చంద్రబాబు–రేవంత్‌రెడ్డికి ముడిపెట్టి రాజకీయంగా ప్రయోజనం పొందాలనుకోవడం వేరు. కేంద్ర పెద్దలు మోదీ–షాలతో పెట్టుకుని మనుగడ సాగించడం వేరు. కేసీఆర్ మీదనే సీబీఐ విచారణ జరిపిస్తారా అని హైదరాబాద్‌లో కూర్చొని విమర్శలు చేసినా, గింజుకున్నా ప్రయోజనం ఉండదు. లిక్కర్ కేసులో అరెస్టయ్యే వరకు కేజ్రీవాల్ జాతీయ స్థాయిలో కేసీఆర్‌కంటే బలమైన నాయకుడు. పలు రాష్ట్రాల్లో ఆమ్ ఆద్మీ పార్టీని విస్తరించారు. ఆయన బాటలోనే కేసీఆర్ కూడా పలు రాష్ట్రాలలో బీఆర్‌ఎస్‌ను విస్తరించాలనుకున్నారు. చివరకు సొంత రాష్ట్రంలోనే చతికిలపడ్డారు.

ఇంటిపోరుతో ఉక్కిరి బిక్కిరి!

ఈ విషయం అలా ఉంచితే, ఇంటిపోరు కూడా కేసీఆర్‌ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఇంటి గుట్టు లంకకు చేటు అంటారు. ఇప్పుడు కేసీఆర్ పరిస్థితి అలాగే ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిన మాట వాస్తవమేనని, కాకపోతే అప్పటి సాగునీటిశాఖ మంత్రి హరీశ్‌రావు మాత్రమే అవినీతికి పాల్పడ్డారని కేసీఆర్ కుమార్తె కవిత స్వయంగా ప్రకటించారు. అవినీతి జరగడం వాస్తవమైతే అది హరీశ్‌రావుకు మాత్రమే పరిమితం అంటే ప్రజలు నమ్ముతారా? ఒకప్పుడు బీఆర్‌ఎస్ పార్టీని ఇంటి పార్టీగా ప్రచారం చేసిన కవితకు ఇప్పుడు ఆ ఇంటి పార్టీలో చోటు లేకుండా పోయింది. ఇంటి పార్టీ ఆడపడుచుకు ఇప్పుడు పుట్టింట కూడా ప్రవేశం లేదని అంటున్నారు. ఇంతకూ కవిత తెగింపునకు కారణం ఏమిటో? ఏమి చూసుకొని ఆమె పార్టీతో సంబంధం తెంచుకోవడానికి సిద్ధపడ్డారన్నది ప్రస్తుతానికి మిస్టరీగానే ఉంది. కొద్ది మాసాల క్రితం ధిక్కార స్వరం వినిపించిన కవిత అప్పుడు తన సోదరుడు కల్వకుంట్ల తారక రామారావును టార్గెట్ చేసుకున్నట్టుగా మాట్లాడారు. కేసీఆర్ దేవుడని, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ తనకు అండగా నిలవలేదని ఆరోపించారు. ఇప్పుడు సడన్‌గా ఆమె యూ టర్న్ తీసుకున్నారు. నాన్నను, పార్టీని రామన్నే కాపాడుకోవాలని కోరారు. కేవలం హరీశ్‌రావు, సంతోష్‌రావులను మాత్రమే ఆమె టార్గెట్ చేసుకున్నారు. మొదట్లో ఆమె హరీశ్‌రావు జోలికి వెళ్లలేదు. ఇప్పుడు కవిత అనే బాణం దిశ మార్చుకుంది. మొదట్లో కేటీఆర్‌కు గుచ్చుకుంటే ఇప్పుడు దిశ మార్చుకొని హరీశ్‌రావుకు గుచ్చుకుంది ఏమిటా అని రాజకీయ పరిశీలకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. కేసీఆర్ ఇంటిలో మొదలైన పోరుకు కారణం దోచుకున్నది పంచుకోవడంలో వచ్చిన తేడాల వల్లనే అనే ప్రచారం జరగడంతో కవిత తన దిశను మార్చుకున్నారా? లేక, ఆమె కేసీఆర్ వదిలిన బాణమేనా? అన్న సందేహాలు ఇప్పుడు కలుగుతున్నాయి. నిజానికి కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కూడా తనకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని కవిత మదనపడేవారు. కన్న కూతురైనప్పటికీ తనకంటే వరుసకు సోదరుడైన సంతోష్‌రావుకు పార్టీలో, ప్రభుత్వంలో ప్రాబల్యం పెరగడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయారు. అదే సమయంలో, కేటీఆర్ తదుపరి ముఖ్యమంత్రి అని ప్రచారం జరిగింది. అదే జరిగితే పార్టీలో తన పరిస్థితి మరింత దిగజారుతుందని తెలిసి కూడా అప్పట్లో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి ఆమెది. ఇంతలో ఎన్నికలు రావడం, నిజామాబాద్ నుంచి పోటీ చేయవద్దని కేసీఆర్ ఆదేశించడంతో ఆమెకు పుండు మీద కారం రాసినట్టయింది. పార్టీ అధికారం కోల్పోయినా కేటీఆర్, హరీశ్‌రావులు ఎమ్మెల్యేలు అయ్యారు. సంతోష్‌రావు ప్రాధాన్యత తగ్గలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే తాను రాజకీయంగా కనుమరుగు కావడం తథ్యమన్న ఆందోళన కవితలో ఏర్పడింది. ఎన్నికలకు ముందు నుంచి అసంతృప్తితో రగిలిపోతున్న ఆమె ఇప్పుడు బయట పడ్డారు. చివరకు పార్టీకి కూడా దూరమయ్యారు.

రాజకీయ వారసులెవరంటే...

ఎవరు అంగీకరించినా అంగీకరించకపోయినా మన సమాజంలో వారసులు అంటే కుమారులే అన్న భావన ఉంది. రాజకీయాల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది. మగ పిల్లలు లేని సందర్భంలోనే ఆడ పిల్లలకు రాజకీయ వారసత్వం లభిస్తోంది. కాంగ్రెస్ నాయకత్వం కూడా రాహుల్‌గాంధీకే దక్కడం గమనార్హం. ప్రియాంకగాంధీకి అర్హత లేదా? అంటే ఏం చెబుతాం? తెలుగు రాష్ట్రాలు మాత్రం ఇందుకు మినహాయింపు కావు కదా! ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డిని రాజశేఖరరెడ్డి వారసుడిగా ప్రజలు గుర్తిస్తున్నారు. అన్నతో విభేదించి రాజకీయ అరంగేట్రం చేసిన షర్మిల ప్రస్తుతానికి సక్సెస్ కాలేదు. తెలంగాణలో ఇందుకు భిన్నంగా జరుగుతుందని భావించలేం. ఇంకా చెప్పాలంటే కేసీఆర్ కుమారుడు, కుమార్తెతో పోల్చితే మేనల్లుడు హరీశ్‌రావుకు అటు ప్రజల్లో, ఇటు పార్టీ నాయకుల్లో ఆదరణ ఎక్కువ. కేసీఆర్ ఉన్నంత వరకు పరిస్థితి ఒక రకంగా ఉంటుంది. లేనప్పుడు మరో విధంగా ఉంటుంది. కేసీఆర్ వారసత్వం అయితే కేటీఆర్‌కు లేదంటే హరీశ్‌కు దక్కుతుంది. కానీ, కవితకు దక్కే అవకాశం లేదని చెప్పవచ్చు. బహుశా ఈ తత్వం ఆమెకు ఆలస్యంగా బోధపడినట్టు ఉంది. అయితే... అన్న లేదంటే తనకు వారసత్వం దక్కాలిగానీ హరీశ్ పోటీలో ఉండకూడదన్నది ఆమె ఆలోచన కావొచ్చు. అందుకే తాజాగా ఆమె హరీశ్‌ను టార్గెట్ చేసుకున్నట్టుగా ఒక అభిప్రాయం. కేసీఆర్ వారసత్వం ఎవరికి? అని ప్రస్తుత పరిస్థితుల్లో కొట్టుకోవడం ఆశ్చర్యంగా ఉంది. బీఆర్‌ఎస్ మనుగడపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి. కేంద్ర ప్రభుత్వం సీబీఐకి పూర్తి స్వేచ్ఛ ఇస్తే కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు కూడా బోనులో చిక్కుకుంటారు. అదే జరిగితే బీఆర్‌ఎస్ అస్తిత్వమే ప్రశ్నార్థకం అవుతుంది. మనిషి తాను నిస్సహాయుడిని అని భావించినప్పుడే దేవుడి వైపు చూస్తాడు. ఇప్పుడు కేసీఆర్ పరిస్థితి కూడా అదే కావొచ్చు. అందుకే ఆయన ఫాం హౌస్‌లో యాగాలు చేస్తున్నారు. 2023 ఎన్నికలకు ముందు రాజశ్యామల యాగం చేసినా అధికారం కోల్పోయారు. యాగాలు చేస్తే అధికారం సిద్ధిస్తుందన్నది నిజమైతే ప్రతి ఒక్కరూ చేయకపోతారా? 2018లో రాజశ్యామల యాగం అధికారం తెచ్చిందనుకుంటే, 2023లో ఎందుకు తెచ్చిపెట్టలేదన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. అయినా.. కర్మఫలం ఒకటి ఉంటుంది. అది మనల్ని వదలదు. కర్మఫలాన్ని అనుభవించాల్సిందే. యజ్ఞాలను, యాగాలను నమ్ముకొనే కంటే తల రాతను నమ్ముకోవడం మంచిది. మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాసిపెట్టి ఉంటే అవుతారు. లేని పక్షంలో ఎన్ని యాగాలు చేసినా నిష్ఫలమే!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

మధుర విషాద కాళింది.. భానుమతి!

వివిధ కళల సమాహారంతో పండిత, పామరులను అలరిస్తున్న ఏకైక మాధ్యమం చలనచిత్రం. తెలుగులో నిర్మించబడిన ఉదాత్త, కళాత్మక, కుటుంబ చిత్రాల కారణంగా 1950–1981 ప్రాంతాన్ని తెలుగు చలనచిత్ర 'స్వర్ణయుగం'గా అభివర్ణిస్తున్నారు. ఎంతోమంది మహానటులు, నటీమణులు తెలుగు ప్రేక్షకుల మనస్సులపై గాఢమైన ముద్రనువేసి చిరస్మరణీయులయ్యారు. వారిలో అభినేత్రి, మధుర గాయని, కథా రచయిత్రి, నిర్మాత, దర్శకురాలు, స్టూడియో అధినేత భానుమతీ రామకృష్ణ ఒకరు.

భానుమతి 1925 సెప్టెంబర్ 7న ఒంగోలు సమీపంలోని దొడ్డవరం గ్రామంలో బొమ్మరాజు వెంకటసుబ్బయ్య, సరస్వతమ్మ దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులిద్దరికీ శాస్త్రీయ సంగీతంలో ప్రవేశం ఉండడంతో సహజంగానే భానుమతికి సంగీతం పట్ల అభిలాష కలిగింది. పద్నాలుగేళ్ల వయసులోనే సి. పుల్లయ్య దర్శకత్వంలో 'వరవిక్రయం'లో కాళింది పాత్రను పోషించడమే కాక, ఆ సినిమాలో పాటలు పాడి ప్రేక్షకులను మెప్పించారు. 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ భానుమతిని ప్రశంసించి 'మధుర విషాద కాళింది' అని తన పుస్తకంపై రాసి ఆమెకు బహూకరించారు. తదుపరి సంవత్సరాల్లో విశ్వనాథ కవిరాజు అనే హాస్య రచయిత భానుమతికి కథలు ఎలా రాయాలో సూచనలిచ్చారు. 1943లో తన నాలుగో చిత్రం 'కృష్ణప్రేమ'లో నటిస్తుండగా అప్పటి అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఎస్ రామకృష్ణను భానుమతి ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహానంతరం సినిమా రంగానికి దూరంగా ఉండాలనుకున్నారామె. కానీ, నాటి ప్రసిద్ధ 'వాహినీ' డైరెక్టర్ బి.యన్.రెడ్డి, నటుడు లింగమూర్తి ఆమెను ఒప్పించి 'స్వర్గసీమ' (1946)లో నటింపజేశారు. ఆ చిత్రంలో 'ఓహో పావురమా' పాటతో తెలుగు, తమిళ ప్రేక్షకులకు భానుమతి మరింతగా దగ్గరయ్యారు. అగ్రనటిగా, గాయనిగా గుర్తింపు పొందారు.

భరణి సంస్థ పతాకంపై 'లైలా మజ్ను, విప్రనారాయణ, బాటసారి' మొదలైన చిత్రాలను నిర్మించారు భానుమతి. ఈ మూడు చిత్రాలూ తన నట జీవితంలో ఆణిముత్యాలని చెబుతూ నిర్మాత భానుమతిని అక్కినేని ప్రశంసించారు. బి.యన్.రెడ్డి నిర్మాణం, దర్శకత్వంలో వచ్చిన సినిమా 'మల్లీశ్వరి'. ఈ సినిమాలో భానుమతి తన విలక్షణ నటనతో పాటు, అపూర్వ గానంతోనూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'సెల్యులాయిడ్‌పై దృశ్య కావ్యం' అంటూ సినీ పండితులు ఈ చిత్రాన్ని ప్రశంసించారు. విప్రనారాయణ చిత్రంతో భానుమతికి తెలుగు సినీ లోకంలో అగ్రపీఠం లభించింది. తాను నిర్మించిన కొన్ని చిత్రాల్లో తండ్రి కోరికపై 'నగుమోము గనలేని', 'శరణం నీ దివ్యచరణం', 'శరణం భవ కరుణామయి', 'ఏ తావునరా నిలకడ నీకు', 'శాంతము లేక సౌఖ్యము లేదు', 'ప్రక్కల నిలబడి' వంటి శాస్త్రీయ సంగీత పాటలను ఆలపించారు. ఆరోగ్యకర హాస్యం తొణికిసలాడేలా 'అత్తగారి కథలు'ను భానుమతి రచించారు. ఆ కథలు ఇలా సాగుతాయి.. అత్తగారు సత్తెకాలం మనిషి. అన్నీ తనకే తెలుసుననుకునే అమాయకురాలు. ఆవకాయ పచ్చడి ఎలా పెడతారో ఆ అత్తగారికి తెలియదు. తోటలో పనిచేసే పాలవాడికి ఇద్దరు భార్యలు. 'మీరిద్దరూ సవతులైనా పోట్లాడుకోరేమే' అంటుంది అత్తగారు.



బారిష్టర్ పార్వతీశంలాగా భానుమతి 'అత్తగారు' ఒక విశిష్టమైన పాత్ర. ఈ కథల గురించి ప్రముఖ రచయిత 'భరాగో' (భమిడిపాటి రామగోపాలం) విలువైన వ్యాసాలతో ఆమె స్మృతి సంచికను 2006లో ప్రచురించారు. శారదా అశోకవర్ధన్, ఇంద్రగంటి జానకీబాల వంటి ప్రముఖ రచయిత్రులు భానుమతి జీవిత విశేషాల గురించి పుస్తకాలు రాశారు.


భానుమతి మాట పెళుసు, కానీ మనసు నవనీతం. ఈ పురుషాధిక్య సమాజంలో స్త్రీ శక్తి స్వరూపిణి. ఆత్మవిశ్వాసంతో మహిళలు ఉన్నతంగా ఎదగగలరని ఆమె నిరూపించారు. 'నాకు లభించిన సంగీత సాహిత్యాలు దేవీ ప్రసాదాలు. నిజాన్ని నిష్ఠురంగా మాట్లాడే నన్ను కొంతమంది గర్విష్ఠిగా భావిస్తే అందుకు నేను బాధ్యురాలిని కాను' అనేవారు. సినీరంగంలో ఎన్నో విజయాలు సాధించినా, తాను సగటు మధ్యతరగతి గృహిణిగానే ఉండడానికి ఇష్టపడేవారు. ప్రతిరోజూ దేవీపూజతో, ఆధ్యాత్మిక చింతనతో సంగీత సాహిత్య గోష్ఠులతో గడిపేవారు. సినీ రంగంలో ఎవరితోనూ అతిగా సాన్నిహిత్యం పెంచుకునేవారు కాదు. తనకు తాను గిరి గీసుకుని 'తామరాకు మీద నీటి బొట్టు' (ఈ పేరుతో ఆమె నిర్మించిన టీవీ సీరియల్ 2001లో ప్రసారం అయింది)లా భానుమతి జీవించారు. 'అత్తగారి కథలు'ను కూడా తాను అత్తగా, గీతాంజలి కోడలుగా సీరియల్ నిర్మించారామె.

భానుమతిని అనేక అవార్డులు, రివార్డులు వరించాయి. 'పద్మశ్రీ' (1966), 'పద్మభూషణ్' (2000) వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులతో పాటు 'అత్తగారి కథలు'కు 'ఆంధ్ర సాహిత్య అకాడమి' పురస్కారం, ఆవిడ ఆత్మకథ 'నాలో నేను'కు కేంద్ర ప్రభుత్వం పురస్కారం లభించాయి. ఇవేగాక తమిళనాడు ప్రభుత్వం నుంచి 'కలైమామణి', అన్నాదురై చేతుల మీదుగా 'నటనకు వ్యాకరణం' అనే బిరుదు పొందారు. వీటితో పాటు రాజాలక్ష్మి అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డు, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం (2004) ఆమెను వరించాయి. ఎం.జి.ఆర్. ఆమెను కొంతకాలం తమిళనాడు ప్రభుత్వ సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు.

పలు సందర్భాల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్, పీవీ రాజమన్నార్, బెజవాడ గోపాలరెడ్డి, కొడవటిగంటి కుటుంబరావు, ఖాసా సుబ్బారావు, మాలతీచందూర్ దంపతులు, వాసిరెడ్డి సీతాదేవి వంటి ప్రముఖులు భానుమతి విలక్షణతను, పాండిత్యాన్ని ప్రశంసించారు. శివాజీ గణేశన్, శోభన్‌బాబు, జానకి, కృష్ణకుమారి, మనోరమ వంటి తారలు ఆమెను ఎంతగానో అభిమానించేవారు. తెలుగు సినీ ప్రపంచంలో ఒక విశిష్ట వ్యక్తిగా జీవించిన భానుమతి మధుమేహం సంబంధిత ఆరోగ్య సమస్యలతో 2005 డిసెంబర్ 24న కన్నుమూశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీఆర్ వంటి వారిని తెలుగు ప్రజలు ఎలా మరువలేరో, అలాగే భానుమతి అభినయ కౌశలాన్ని, గాన మాధుర్యాన్ని, బహుముఖ ప్రజ్ఞనూ చిరకాలం జ్ఞాపకం చేసుకుంటారు.

▪ డా. పి.దక్షిణామూర్తి

(నేడు భానుమతి శతజయంతి)



● మహా నిమజ్జనం



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యాధరపురంలో ఏర్పాటుచేసిన 72 అడుగుల మట్టి కార్యసిద్ధి మహాగణపతి విగ్రహ నిమజ్జనం శనివారం రాత్రి ఘనంగా పూర్తయ్యింది. ఉన్నచోటనే ఫైరింజన్ పైపులతో నీళ్ల చల్లి నిమజ్జన కార్యక్రమాన్ని ముగించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సేవా సమితి వ్యవస్థాపకుడు డూండీ రాకేశ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు డి.వెంకట సుబ్బారావు, ఏ.సత్యనారాయణరావు, జీవీబీ రవికుమార్, పి.వెంకట రవికుమార్, ఎస్.నాగేశ్వరరావు, కొత్తా ముత్రేశ్వరరావు, సామా చైతన్య, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- విద్యాధరపురం

సమాచారం.. సందర్శనం

దసరా వేడుకల్లో ఇంద్రకీలాద్రిపై కొత్త ప్రయోగం

భక్తులకు సమస్త సమాచారం తెలిసేలా విజువల్ మెసేజింగ్ సిస్టమ్

- వీలుకాని పక్షంలో డిజిటల్ ఎల్ఈడీ స్క్రీన్లు
- క్యూ ఎందుకు ఆపారు, ఎంత రద్దీ ఉందన్న వివరాలు
- గత ఏడాది అనుభవాల నేపథ్యంలో కొత్త విధానం
- సమన్వయ కమిటీ సమావేశంలో నిర్ణయం



అప్పటి వరకు సాఫీగా సాగుతున్న క్యూ ఎందుకు ఆగింది? ఏ క్యూలో భక్తులు ఎక్కువగా ఉన్నారు? ఏ క్యూలో భక్తులు తక్కువగా ఉన్నారు? అమ్మవారి దర్శనం పూర్తయ్యేసరికి ఎంత సమయం పడుతుంది? ఇటువంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు భక్తులకు తెలియజేయాలని అధికారులు నిర్ణయించారు. నిరంతరం మైకుల్లో ప్రకటనలు చేస్తున్నా భక్తులకు సమాచారం కనిపించేలా స్క్రోలింగ్‌లు నడపాలని భావిస్తున్నారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణ సమన్వయ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులతో ముడిపడి ఉన్న ప్రతి సమాచారాన్ని డిజిటల్‌గా చూపించాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం విజువల్ మెసేజింగ్ బోర్డు (వీఎంఎస్)లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఈ ప్రణాళిక అమలుకాని పక్షంలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తారు.

ఆరుసార్లు దర్శనానికి బ్రేక్

దసరా ఉత్సవాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఆలయం ద్వారాలు తెరుచుకున్నాక ఆరు వేర్వేరు సమయాల్లో దర్శనానికి బ్రేక్‌లు పడతాయి. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించే సమయాల్లో దర్శనానికి అనుమతించరు. ప్రతి నైవేద్యానికి 10-15 నిమిషాల సమయం పడుతుంది. మొత్తంగా అరగంట వరకు దర్శనం నిలుపుదల చేస్తారు. రోజూ సాయంత్రం అమ్మవారికి సమర్పించే మహానివేదన సందర్భంగా గంటపాటు దర్శనానికి బ్రేక్ ఇస్తారు. శరన్న వరాత్రుల ప్రారంభం రోజున స్నపన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం అభిషేకం చేస్తారు. నివేదనగా అమ్మవారికి పాలను సమర్పిస్తారు. తర్వాత పరిమిత సంఖ్యలో ఉన్న అర్చకులు అమ్మవారికి మిగతా 6లో..

కీలక ప్రాంతాల్లో ఏర్పాటు

కొంతమంది భక్తులు నేరుగా దర్శనానికి క్యూలో వస్తారు. మరికొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నాక దర్శనానికి వెళ్తారు. దర్శనం పూర్తయ్యాక లడ్డూ ప్రసాదాలు కొనుగోలు చేస్తారు. దర్శనానికి ఇచ్చే బ్రేకులతో పాటు ఆయా కౌంటర్లు, ప్రదేశాల్లో ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు భక్తులకు తెలిసేలా ఎల్ఈడీ స్క్రీన్లు గానీ, వీఎంఎస్ బోర్డులు గానీ అమర్చాలని నిర్ణయించారు. వినాయకుడి ఆలయం వద్ద, ఘాట్‌రోడ్డు వద్ద, కనకదుర్గానగర్, కేశఖండనశాల, వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో ఈ ఏర్పాట్లు చేయబోతున్నారు.



నేడు కర్టన్‌రైజర్ ఈవెంట్

విజయవాడ ఉత్సవ్‌లో తొలి అడుగు

- అతిథులుగా సంయుక్త మీనన్, దివి వధ్య, మానసా వారణాసి
- పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో నిర్వహణ

6

దసరాకు పశ్చిమ బైపాస్

తాత్కాలికంగా అందుబాటులోకి తేవాలని నిర్ణయం



- ఎన్‌హెచ్ అధికారులతో ఎంపీ కేశినేని చిన్ని చర్చలు
- సంక్రాంతి నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ పశ్చిమ బైపాస్‌ను సంక్రాంతికి పూర్తిస్థాయిలో ప్రారంభించటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అలాగే, రాబోయే దసరా ఉత్సవాలను పురస్కరించుకుని తాత్కాలికంగా వాహనాలను మళ్లించాలని నిర్ణయించారు. దసరా ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలిరానున్నారు. అలాగే, దసరా ఉత్సవ్-2025, కృష్ణా వ్యవసాయ, పారిశ్రామిక ఎగ్జిబిషన్ జరగనున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండాలంటే విజయవాడ పశ్చిమ బైపాస్‌ను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. దీంతో నిర్వాహక కమిటీ సభ్యులు, ఎంపీ కేశినేని చిన్ని.. జాతీయ రహదారుల సంస్థ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం విజయవాడ వెస్ట్ బైపాస్ రెండు ప్యాకేజీలు కలిపి దాదాపు 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం మిగతా 6లో..



ఇక 350 సీసీ రేంజ్ బైకుల జోష్

- జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గింపు
- దసరా పండుగకు దిగిరానున్న ధరలు
- నగరం కేంద్రంగా పెరగనున్న కొనుగోళ్లు

- కథనం 6లో

నేడు ఇంద్రకీలాద్రి మూసివేత

చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 3.30 నుంచి..

తిరిగి సోమవారం ఉదయం 8.30 నుంచి దర్శనం



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాహుగ్రస్థ చంద్రగహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయాన్ని మూసివేయనున్నారు. ప్రధాన ఆలయంతో పాటు ఉపలయాలకు కవాట బంధనం చేస్తున్నట్లు ఈవో శీనానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణ మోక్షకాలం అనంతరం.. అంటే 8వ తేదీ సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు కవాట ఉద్ఘాటనం చేసి తలుపులు తెరుస్తామని, దేవతామూర్తులకు స్నపనాభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం అలంకరణ, అర్చన, మహానివేదన, హారతి జరుగుతాయని, సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తామని తెలిపారు. స్నపనాభిషేకాలు, అర్చనాది కార్యక్రమాల సందర్భంగా ఆర్జిత సేవలైన సుప్రభాతం, వస్త్రం, ఖడ్గమాలార్చన, నవగ్రహ శాంతిహోమం, గణపతి హోమాలను రద్దు చేశామని వివరించారు. రోజూ ఉదయం 7.30 గంటలకు నిర్వహించే ఆర్జిత సేవలను సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. కాగా, గ్రహణం సందర్భంగా జిల్లాలోని అన్ని ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేస్తారు. సోమవారం శుద్ధిచేసి భక్తులను అనుమతిస్తారు.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది, ఎన్.సి.ఎల్.టి బెంచ్-II, చెన్నై, తేది: 09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది. మరియు ప్రాంతీయ కార్యాలయ చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం:- 29-37-141, 2వ ఫ్లోర్, రామాలయం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ-520002. అధీకృత అధికారి చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, పటమట బ్రాంచ్ - 520001, విజయవాడ, ఎన్.టి.ఆర్ జిల్లా, బ్రాంచ్: విజయవాడ-2లో మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్.బి.ఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు).

ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదిల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదిలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరగా తెలిపిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందజేయబడకుండ తిరిగి వచ్చినందుకు సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణరావు



న్యాయమూర్తికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు శనివారం దర్శించుకున్నారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానానికి వచ్చిన ఆయనకు తొలుత ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీర్వాచనం పలుకగా, ఈవో అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఈ సందర్భంగా దసరా-2025 ఏర్పాట్ల గురించి వివరించారు.

ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనుల తనిఖీ



అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ ఆలయం అభివృద్ధి పనులను దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన అన్నదాన భవనం, లడ్డూ పోటు, కనకదుర్గానగర్‌లో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల స్థితిగతులపై ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల సౌకర్యార్థ చేపట్టిన పనులు సకాలంలో పూర్తి కావాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ వద్దని కమిషనర్ సూచించారు. ఆలయ అభివృద్ధి పనులు, దసరా ఉత్సవాల పనులు ఏకకాలంలో పూర్తి కావాలని, ఏ పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో పూర్తి సమాచారంతో వివరాలు అందించాలని దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.రాంబాబు, తదితర అధికారులను ఆదేశించారు.

విచారణ తర్వాత బాధ్యులపై చర్యలు

- జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి

నందిగామ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్] పెద్దవరం సహకార సంఘంలో అక్రమాలపై విచారణ జరుగుతుందని, విచారణ తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకొంటామని జిల్లా సహకార అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెద్దవరం సహలకార సంఘంలో 'పెద్దమాయ' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందిం చారు. ఈ సంఘంలో జూలై మాసంలో ఆడిట్ జరిగిందని, ఆ ఆడిట్‌లో కొన్ని అవకతవకలు వెలుగు చూశాయని తెలిపారు. దీనిపై ఆడిట్ అధికారులు నివేదిక అందించారని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగా సహకార చట్టం సెక్షన్ 51 ప్రకారం విచారణ చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా సమన్లు జారీ చేసినట్లు చెప్పారు. విచారణ పూర్తయిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకొంటామని వివరించారు. ఉన్నతాధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణ నిజం కాదని చెప్పారు.

అన్నదాన భవనం, లడ్డూ పోటులో వంటకు శ్రీకారం



గ్యాస్ సిలిండర్ వెలిగిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి కొండ దిగువన నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, లడ్డూ పోటులో దసరా ఉత్సవాలలో అన్న ప్రసాదం తయారీ, లడ్డూ ప్రసాదం తయారీ నిమిత్తం వంట ప్రారంభించేందుకు శనివారం దేవస్థానం స్థానాచార్యుడు వి.శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శీనానాయక్ పొయ్యలు వెలిగించి పాలు పొంగించి వంటలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మాట్లాడుతూ భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. దసరా ఉత్సవాలలో భక్తులకు నిరంతరం అమ్మవారి ప్రసాదాలు అందించడానికి ఈ రెండు కొత్త ప్రాంగణాలు ఉపయోగపడతాయన్నారు. అల్పాహారం, అన్న ప్రసాదం, ఉచిత ప్రసాదాలు, మూలా నక్షత్రం, విజయదశమి రోజుల్లో చిన్న లడ్డూ పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కోటేశ్వరరావు, రాంబాబు, ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రతి పౌర్ణమి రోజున నిర్వహించే గిరి ప్రదక్షిణ ఆదివారం ఉదయం 5.55 గంటలకు ప్రారంభమవుతుంది. ఘాట్ రోడ్డు ప్రవేశ ద్వారం వద్ద ఉన్న శ్రీకామధేను అమ్మవారి ఆలయం నుంచి మొదలై కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం జంక్షన్ కబేళా రోడ్డు, సీవీఆర్ బ్రిడ్జి, పాల ఫ్యాక్టరీ, భీమనవారి పేట, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి కొండపైకి గిరిప్రదక్షణలోని దుర్గామల్లేశ్వరుల ఉత్సవమూర్తులు చేరుకుంటారు. యథాస్థానంలో ప్రవేశిస్తాయి.

ఆర్టీసీలో ఎస్సీ, ఎస్టీ మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్

బస్‌స్టేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ డిమాండ్ చేశారు. శనివారం స్వాతంత్ర్య సమరయోధుల భవన్‌లో ఏపీపీటీడీ, ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా ఇంకా ఎస్సీ, ఎస్టీలను అంటరాని వారిగానే చూస్తున్నారన్నారు. ఈ పరిస్థితులు మారాలంటే పోరాటాలు చేయకతప్పదన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌ను రాష్ట్రానికి తీసుకొచ్చి మన సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తానని తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ ఎ.వి.రాజు మాట్లాడుతూ ఉద్యోగులు ఐక్యతతో ముందుకు వెళ్లాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులపైన జరిగే వేధింపులను వెంటనే అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.థామస్‌రావు, పి.సుభాస్, ఆర్టీసీ ఉద్యోగులు, తదితర పాల్గొన్నారు.

ఇక 350 సీసీ రేంజ్ బైకుల జోష్

- జీఎస్టీ 28 నుంచి 18 శాతం తగ్గించిన కేంద్ర ప్రభుత్వం
- దసరా పండుగకు దిగిరానున్న ధరలు
- విజయవాడ కేంద్రంగా పెరగనున్న కొనుగోళ్లు
- పండుగ సీజన్‌లో భారీగా డిమాండ్ ఉంటుందని అంచనా



> యువత మనస్సు దోచుకునే 350 సీసీ రేంజ్ బైకుల ధరలు ఇక దిగిరానున్నాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించడంతో ఎక్కువ మంది కొనుగోలు చేయడానికి అవకాశం ఏర్పడింది. దసరా పండుగ కూడా త్వరలోనే ఉండటంతో అమ్మకాలు జోరందుకోనున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కుర్రకారు ఎక్కువగా ఇష్టపడే బైకుల్లో 350 సీసీ బైకులకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. అన్ని వర్గాల యువతను ఈ బైకులు ఆకర్షిస్తుంటాయి. వీటిని కొనుగోలు చేయాలన్న ఆశ ఉన్నా.. ధరలు అధికంగా ఉండటం వల్ల చాలా మంది అందుకోలేకపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జీఎస్టీ మినహాయింపుల ప్రకటనలతో 350 సీసీ బైకుల ధరలు దిగి రానున్నాయి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా 350 సీసీ బైకులు పెరిగే అవకాశం ఉంది. నగరంలో 350 సీసీ బైక్ శ్రేణిలో రాయల్ ఎన్‌ఫీల్డ్, హార్లే డేవిడ్‌సన్ ప్రధానంగా ఉన్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు నగరంలో మూడు ఏజెన్సీలు ఉండగా.., ఉమ్మడి కృష్ణాజిల్లాలో పలు చోట్ల ప్రాంతీయంగా కూడా ఉన్నాయి. హార్లే డేవిడ్ సన్‌కు నగరంలో ఒకే ఒక్క షోరూమ్ ఉంది. నగర యువత కానీ, ఉమ్మడి జిల్లాకు చెందిన యువత కానీ ఎక్కువగా రాయల్ ఎన్‌ఫీల్డ్ 350 సీసీ బైకులను ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ఎన్‌ఫీల్డ్ బైకులు అయితే కాస్త అందుబాటు ధరల్లో ఉంటాయి.

10శాతం తగ్గనున్న ధరలు

350 సీసీ బైకులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 28 శాతం జీఎస్టీ విధిస్తోంది. దీంతో ప్రస్తుతం రూ.2.50 లక్షల మేర ధర పలుకుతోంది. ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన జీఎస్టీ మినహాయింపుల మేరకు 350 సీసీ బైకులకు 28 శాతం నుంచి 18 శాతం తగ్గించటం జరిగింది. దీంతో ఒకేసారి 10 శాతం మేర 350 సీసీ బైకుల ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీతో పాటు బైకుల ఆన్‌రోడ్ ప్రైజ్ కూడా గణనీయంగా తగ్గనుంది. ఆన్‌రోడ్‌లో భాగంగా రోడ్డు ట్యాక్స్, ఇన్సూరెన్స్ వంటివి కూడా కలిసి ఉంటాయి. రోడ్డు ట్యాక్స్, ఇన్సూరెన్స్ కాంపోనెంట్స్‌లో కూడా కొంత మేర తగ్గుదల ఉంటుందని తెలుస్తోంది. ఇవన్నీ కలిపితే దాదాపుగా మొత్తం రూ.30 వేల వరకు 350 సీసీ బైకుల ధర తగ్గనుంది. ప్రస్తుతం హై ఎండ్ ఎలక్ట్రికల్ స్కూటర్ల శ్రేణిలో ధరలతో సమానంగా 350 సీసీ హయ్యండ్ బైకుల ధరలు కూడా ఉండబోతున్నాయి. వివిధ వర్గాల యువతకు ఇది శుభపరిమాణమనే చెప్పుకోవాల్సి ఉంటుంది.

నెలకు 350 బైక్‌ల విక్రయం

విజయవాడ నగరంలో నెలకు 350 వరకు ఎన్‌ఫీల్డ్ బైకులు విక్రయిస్తున్నారు. అదే పండుగల సందర్భంలో అయితే 500 వరకు బైకులు అమ్ముడు పోతున్నాయి. ఈ లెక్కన చూస్తే ప్రస్తుత జీఎస్టీ తగ్గుదల కారణంగా 350 సీసీ బైకుల కొనుగోలుకు డిమాండ్ ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక మీదట నెలకు 500 వరకు బైకులు అమ్మగలమని భావిస్తున్నాయి. అలాగే పండగ సీజన్ నేపథ్యంలో 700 వరకు బైకులు అమ్మగలమని అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం అతిపెద్ద పర్వదినం దసరా వస్తుండటంతో.. బైకుల కొనుగోళ్ల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఇదే క్రమంలో 350 సీసీ బైకులు అనేవి ఇప్పటికిప్పుడు తయారయ్యేవి కావు. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వాటినే తక్కువ ధరకు విక్రయించగలవు. ఈ పండుగ సీజన్‌కు అయితే ఉన్న వాటినే విక్రయించగలవు. తయారీకి సమయం పడుతుంది కాబట్టి పండగ తర్వాత నాటికి మరిన్ని అందుబాటులోకి రాగలవు.

పెరగనున్న 650 సీసీ బైకుల ధరలు

ఉన్నత వర్గాలు ఆదరించే 650 సీసీ బైకుల ధరలు మాత్రం గణనీయంగా పెరగబోతున్నాయి. ప్రస్తుతం 28 శాతం ఉన్న జీఎస్టీని మరో 12 శాతం అదనంగా జోడించటంతో 40 శాతానికి జీఎస్టీ పెరిగింది. దీంతో ఈ బైకుల ధరలు భారీగా పెరగనున్నాయి. ప్రస్తుతం 350 సీసీ బైకుల ధర చూస్తే కనిష్టంగా రూ.4,50,000 ఉంది. జీఎస్టీ పెరుగుదలతో రూ.5 లక్షలకు చేరువగా బైకుల ధరలు పెరిగే అవకాశం ఉంది.

కొనుగోళ్లు పెరుగుతాయని భావిస్తున్నాం



ద్విచక్రవాహనాల శ్రేణిలో ప్రధానంగా 350 సీసీ బైకులకు జీఎస్‌టీని తగ్గించారు. దీంతో విక్రయాలలో పురోగతి ఉంటుందని భావిస్తున్నాం. ప్రస్తుత తగ్గింపు ప్రకారం రూ.15 వేల వరకు తక్షణం తగ్గే అవకాశం ఉంటుంది. వివిధ మోడళ్లను బట్టి రూ.20 వేల వరకు బైకుల ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీ తగ్గింపులతో పాటు దసరా కూడా రాబోతోంది. దీంతో మరింతగా సేల్స్ ఉండే అవకాశం ఉంది. దీనికి అనుగునంగా మేము కూడా ఏర్పాట్లు చేసుకుంటున్నాం.

-హరీష్, రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్



కొండాలమ్మ సన్నిధిలో రైల్వే రిజిస్ట్రార్

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మను సికింద్రాబాద్ రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బెంచ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.ప్రదీప్ కుమార్ దంపతులు శనివారం దర్శించుకొన్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం అనంతరం వీరిని సత్కరించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వైద్యుల సమస్యలపై మంత్రికి వినతి

విజయవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ పబ్లిక్ హెల్త్‌లో పనిచేస్తున్న వైద్యులు 25 ఏళ్ల సర్వీసులో ఒక్కసారి కూడా పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ చేస్తున్నారని జీడీఏపీపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాబ్జీ శ్యామ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రతి 3-4 ఏళ్లలోనే పదోన్నతులు ఇస్తున్నారన్నారు. సర్వీసు వైద్యుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు తగదన్నారు. వైద్యుల పదోన్నతుల పరిష్కారం కోసం తమిళనాడు, కేరళ, ఒడిశా, కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానం అమలు చేయాలని కోరారు. జనరల్ కేటగిరీ వైద్యులందరినీ ఒకే సీనియారిటీ పరిధిలోకి తీసుకురావాలని, నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని ఉన్నతస్థాయి పదవులను వైద్యాధికారులతో మాత్రమే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ పోస్టుల్లో సివిల్ సర్జన్ స్థాయి వైద్యులను, జిల్లాస్థాయి ప్రోగాం ఆఫీసర్ పోస్టుల్లో డిప్యూటీ సివిల్ సర్జన్ వైద్యులను నియమించాలని కోరారు.



మంత్రి సత్యకుమార్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

9న ఎన్టీఆర్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

- 27, 28వ స్నాతకోత్సవాలు ఒకేసారి నిర్వహణ
- వీసీ డాక్టర్ చంద్రశేఖర్ వెల్లడి

విజయవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ఈ నెల 9న నిర్వహించనున్నట్లు వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆవరణంలో మీడియాతో ఆయన మాట్లాడారు. కోవిడ్ కారణంగా 2021 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 27వ, 2022 ఏడాది బ్యాచ్‌కు చెందిన 28వ స్నాతకోత్సవాలు నిర్వహించలేదన్నారు. ఈ రెండు స్నాతకోత్సవాలు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన జరుగుతాయన్నారు. 27వ స్నాతకోత్సవానికి సంబంధించి 53 మంది విద్యార్థులకు, 28వ స్నాతకోత్సవానికి సంబంధించి 67 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించనున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. యూనివర్సిటీలో రీసెర్చ్ యాక్టివిటీస్ కోసం రూ.75 లక్షల గ్రాంట్ ఇచ్చినట్లు తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రభ, జాయింట్ రిజిస్ట్రార్(అకడమిక్) కె.నీలిమ, డిప్యూటీ రిజిస్ట్రార్ కె.సుసన్న రామర్స్, ప్రెస్ అండ్ మీడియా కన్వీనర్ ఎమ్.వి.అక్కిరాజు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

విజయవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో జరిగిన ప్రధానమంత్రి సభకు బందోబస్తు నిర్వహించడానికి వెళ్లి మరణించిన హోంగార్డు కుటుంబానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. ఎస్.అర్జున రావు హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తించేవారు. ప్రధాన మంత్రి బందోబస్తు నిమిత్తం విశాఖపట్నం వెళ్లిన ఆయన అక్కడ గుండె పోటుతో మరణించారు. దీంతో ఆయన భార్య ఎస్వీ లక్ష్మికి రూ.5లక్షల చెక్కును సీపీ రాజశేఖరబాబు అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ కె.సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి ఊరేగింపులో మహిళా ఎస్ఐపై దౌర్జన్యం

- ఒకరిని అదుపులోకి తీసుకున్న భవానీపురం పోలీసులు

విద్యాధరపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో పోలీస్ ఉద్యోగులపై దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోతున్నాయి. నాలుగు రోజుల క్రితం సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళలో విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్‌ను స్థానికులు చూస్తుండగానే మహిళా ఇష్టానుసారంగా దూషించి, చొక్కా పట్టుకున్న ఘటన మరువకముందే శుక్రవారం రాత్రి విద్యాధరపురంలో జరిగిన వినాయక నిమజ్జనం ఊరేగింపులో విధుల్లో ఉన్న ఓ మహిళా ఎస్ఐని ఓ వ్యక్తి అసభ్యకరంగా దూషించి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. విద్యాధరపురం సితార సెంటర్ వద్ద శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జనం ఊరేగింపునకు భవానీపురం మహిళా ఎస్ఐ అనూష తన సిబ్బందితో విధులు నిర్వహించారు. కొందరు యువకులు అత్యుత్సాహం ప్రదర్శించటంతో ఆ ఎస్ఐ వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. వారిలో ఓ వ్యక్తి ఆమెతో గొడవపడి అసభ్యకరంగా దూషించి, బెదిరింపులకు పాల్పడి దౌర్జన్యానికి దిగినట్టు సమాచారం. దీంతో ఎస్ఐ పైస్థాయి అధికారులకు ఆ వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు శనివారం అతనిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి తమ స్టైల్‌లో విచారించారు. అయితే కొత్తపేటకు చెందిన కూటమి నాయకుడు పోలీసు స్టేషన్‌కు వెళ్లి అధికారులతో మాట్లాడి అతనిపై ఎలాంటి కేసు లేకుండా బయటకు తీసుకువచ్చినట్టు తెలిసింది. అతని తీరుపై పోలీసు సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో ఉన్న మహిళా ఎస్ఐ పైనే దౌర్జన్యం చేసిన వ్యక్తి పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయాన్ని పోలీసులు బయటకు రానీయకుండా గోప్యంగా ఉంచినట్టు తెలుస్తోంది.

సమాచారం.. సందర్శనం

(5వ పేజీ తరువాయి)

అలంకారం చేస్తారు. ఈ కార్యక్రమాలు ఆరు గంటల వరకు సాగుతాయి. ఆ తర్వాత అర్చన జరుగుతుంది. అనంతరం అమ్మవారికి బాలభోగం సమర్పిస్తారు. ఈ సమయంలో భక్తులను దర్శనానికి అనుమతించరు. తర్వాత 6-7 గంటల మధ్యలో ప్రత్యేక నివేదనగా పులిహోర, కట్టెపొంగలి పెడతారు. 9 గంటలకు రాజభోగం సమర్పిస్తారు. అమ్మవారికి లడ్డు, పులిహోర, రవ్వకేసరి, చక్రపొంగలిని నైవేద్యంగా పెడతారు. ఈ సమయంలో 15 నిమిషాలపాటు దర్శనం ఆపుతారు. మధ్యాహ్నం 12-1 మధ్యలో ప్రత్యేక నివేదన సమర్పిస్తారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు ప్రసాదాన్ని నివేదనగా పెడతారు. ఈ నివేదనలు సమర్పించడానికి 10-15 నిమిషాల సమయం పడుతుందని అర్చకులు చెబుతున్నారు. మొత్తం ప్రక్రియ పూర్తయి, భక్తులను దర్శనానికి అనుమతించడానికి అరగంట వరకు సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. సాయంత్రం 6-7 మధ్య అమ్మవారికి మహానివేదన ఇస్తారు. ఇతర రోజుల్లో దీన్ని మధ్యాహ్నం 12 గంటలకు సమర్పిస్తారు. శరన్నవరాత్రుల్లో మాత్రం సాయంత్రం 6-7 గంటల మధ్య సమర్పిస్తారు. ఇది సమర్పించడానికి ముందు ప్రధాన ఆలయం పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తారు. మొత్తం ప్రక్రియ పూర్తవ్వడానికి గంట సమయం పడుతుంది. అప్పటి వరకు దర్శనానికి భక్తులను అనుమతించరు. మహానివేదన అనంతరం పంచహారతులు ఇస్తారు. ఈ సమయాల్లో భక్తులను దర్శనానికి అనుమతించరు. కొన్నిసార్లు దర్శనానికి బ్రేక్ పడటంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ వ్యవహారాలను భక్తులకు తెలియజేయడానికి ఈ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

దసరాకు పశ్చిమ బైపాస్

(5వ పేజీ తరువాయి)

పనుల విషయంలో ఇబ్బందులు ఉన్నాయి. ఇవి ఇప్పుడు పరిష్కారమయ్యేవి కావు. ఈ నేపథ్యంలో దసరా ఉత్సవాలకు తాత్కాలికంగా వెస్ట్ బైపాస్‌ను ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. గత సంక్రాంతి సందర్భంలో, రాజధాని అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సమయంలో దీనిని విజయవంతంగా ఉపయోగించుకున్నారు. అలాగే, గుంటూరు వైపు నుంచి ప్యాకేజీ-4ను కూడా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. పూర్తికాని రోడ్డు పోర్షన్‌ను కంకర చిప్స్, డస్ట్‌తో తాత్కాలికంగా అందుబాటులోకి తేవాలని ఎంపీ చిన్ని చెప్పారు. ఇందుకు ఎన్‌హెచ్ అధికారులు కూడా అంగీకరించారు.

నేడు కర్టన్‌రైజర్ ఈవెంట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'విజయవాడ ఉత్సవ్'కు కౌంట్‌డౌన్ మొదలైంది. కర్టెన్‌రైజర్ ఈవెంట్‌గా ఆదివారం పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో గ్రాండ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నటి సంయుక్త మీనన్, దివి వత్య రానున్నారు. ప్రత్యేక అతిథిగా ఫెమీనా మిస్ ఇండియా-2020 మానసా వారణాసి హాజరుకానున్నారు. విజయవాడ నగర సంప్రదాయ వారసత్వాన్ని, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తి కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు, సెలబ్రెటీల సంగీత కచేరీలు, టాలీవుడ్ ప్రమోషన్స్, ప్రపంచ రికార్డును నెలకొల్పేలా వరల్డ్ కార్నివాల్, కృష్ణానది ఒడ్డున డ్రోన్‌షో, ఫైర్‌వర్క్స్, చేనేత హస్తకళల ప్రదర్శనలు, ఫుడ్‌కోర్టులు, ఎగ్జిబిషన్లు, ప్రత్యేక పోటీలు, మిస్ విజయవాడ, విజయవాడ ఐడల్ అవార్డులు, 45 రోజుల పాటు ఎగ్జిబిషన్ నిర్వహణ ఈ విజయవాడ ఉత్సవ్‌లో ప్రత్యేకం. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్సవ కార్నివాల్‌ను నగరంలో నిర్వహించటంతో పాటు ప్రపంచ రికార్డును సాధించేలా చర్యలు చేపట్టడం మరో విశేషం. ఆదివారం జరిగే కర్టెన్‌రైజర్ ఈవెంట్‌లో ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పాటు ఏపీటీడీసీ ఎండీ అమరపాలి, పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరి, వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, శ్రీరామ్ రాజగోపాల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొంటారు.

మా పొట్ట కొట్టొద్దు

- జెన్కో అధికారులకు స్థానిక లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ విజ్ఞప్తి
- బూడిద కాంట్రాక్టు రద్దు చేసి ఉచితంగా ఇవ్వాలని డిమాండ్
- బూడిద చెరువు వద్ద ఆందోళన



బూడిద చెరువు వద్ద స్థానిక లారీ యజమానులు, డ్రైవర్లు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ స్వలాభం కోసం 40 ఏళ్లుగా ఉచితంగా ఇచ్చిన బూడిదను ఇప్పుడు టన్ను రూ.100 ధరకు అమ్మి మా పొట్ట కొట్టవద్దని జెన్కో అధికారులను స్థానిక లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వేడుకున్నారు. ఎన్టీటీపీఎస్‌కు చెందిన బూడిద చెరువు వద్దకు శనివారం సుమారు 40 మంది స్థానిక లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ చేరుకొని ఆందోళన చేశారు. బూడిద చెరువులో పని చేస్తున్న కాంట్రాక్టు సంస్థకు చెందిన మూడు యంత్రాలను దగ్గరుండి బయటకు పంపారు. ఈక్రమంలో కాంట్రాక్టు పొందిన సంస్థ సిబ్బందికి, స్థానిక లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్‌కు వాగ్వాదం చోటు చేసుకోగా, జెన్కో పోలీసులు సర్ది చెప్పారు. సోమవారం వరకు పనులు ఆపేయాలని కాంట్రాక్టు సంస్థ సిబ్బందికి ఎస్ఈ ఆదేశించినట్లు పోలీసులు వారికి చెప్పడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. అనంతరం స్థానిక లారీ ఓనర్స్ డ్రైవర్స్ మాట్లాడుతూ బూడిద చెరువు నిండినప్పుడు ఉచితంగా బూడిదను బయటకు తోలుకెళ్లమని చెప్పారన్నారు. ఇప్పుడు ఒక్కసారిగా ఒక ప్రయివేటు సంస్థకు బూడిదను అమ్ముకునేందుకు టన్ను రూ.3లకు లీజుకు ఇస్తే, వారి వద్ద మేము రూ.100లకు టన్ను కొనుగోలు చేసుకోవాలంటా.. ఇందే దుర్మార్గమని ప్రశ్నించారు. 25 టన్నులు రూ.2,500లకు కొనుగోలు చేసి ఎలా బతకగలమన్నారు. ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యం వల్ల సుమారు ఏడు గ్రామాల ప్రజలతో పాటు మేము బాధితులమే అన్నారు. మా కోసం ఒక ఆసుపత్రి పెడతామని, బూడిదను ఉచితంగా ఇస్తామని, సీఎస్ఆర్ ఫండ్స్ గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్న ఎన్టీటీపీఎస్ యాజమాన్యం ఒక్క హామీని అమలు చేయడం లేదని ఆరోపించారు. సుమారు 1.5 లక్షల మంది ప్రజల్లో అనేక మంది శ్వాస సంబంధిత, కిడ్నీ, కేన్సర్‌తో బాధపడుతున్నామన్నారు. గతంలో రోజుకు మూడు ట్రిప్పుల బూడిద ఉచితంగా ఇచ్చిన జెన్కో యాజమాన్యం ఇప్పుడు వారానికి రెండు మూడు ట్రిప్పులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బూడిద రవాణాను నమ్ముకొని సుమారు 400 లారీలు ఉన్నాయని, వాటిపై సుమారు 1,000 కుటుంబాల వారు ఆధారపడి జీవిస్తున్నారన్నారని వివరించారు.

రాజధాని వైభవం చాటేలా

19, 20, 21 తేదీల్లో అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్

- జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి రాష్ట్ర చైర్మన్‌చక్రధర్



విజయవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని వైభవాన్ని ప్రతిబింబించేలా అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ -2025ను నిర్వహిస్తున్నట్లు జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి(నారెడ్కో) రాష్ట్ర చైర్మన్ గద్దె చక్రధర్ అన్నారు. శనివారం ఓ హోటల్‌లో ప్రాపర్టీ ఫెస్టివల్ వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం స్థిరాస్తిరంగం పట్ల సానుకూలంగా చేపట్టిన సంస్కరణల ఫలితంగా ప్రస్తుతం పురోగమన దిశలో ఉన్నామన్నారు. నారెడ్కో సెంట్రల్ జోన్ చైర్మన్ సందీప్ మండవ మాట్లాడుతూ ఈ నెల 19, 20, 21 తేదీల్లో నిర్వహించే కార్యక్రమంలో అమ్మకందారులు ప్రత్యేక రాయితీలు అందిస్తున్నారని తెలిపారు. అర్హతలు ఉన్నవారికి బ్యాంకులు తక్షణ రుణాలు మంజూరు పత్రాలు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి, సెంట్రల్ జోన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ హరిప్రసాద్ రెడ్డి, సెంట్రల్‌జోన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ, సీఆర్డీఏ ప్రతినిధులు సీతారామయ్య, వాసిరెడ్డి వంశీ, పి.వి.కృష్ణ, కోడే జగన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ సెక్షన్ 11కేవీ ఐలా ఫీడర్ పరిధిలో పాత విద్యుత్ లైన్ల స్థానంలో కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా ఆదివారం ఆటోనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఉదయం 6నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ ఈఈ పి. హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్ ఒకటి, రెండు క్రాస్ మధ్య 4, 5, 6 రోడ్లు, రెండు, మూడు క్రాస్ మధ్య 4, 5, 6 రోడ్డుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎంపీ కేశినేని శివనాథ్

మొగల్రాజపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని విద్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా విద్య ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. తూర్పు పరిధి 8వ డివిజన్ బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులను శనివారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా , దాతల సహకారంతో రెండు కోట్ల 10లక్షల మేర నిధులతో రెండో అంతస్థు నిర్మాణం చేయడంతో పాటు 14 తరగతి గదులను అదనంగా నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ బోయపాటి పాఠశాలకు మంచి పేరు ఉందని, 2014లో సీఎంగా ఉన్న చంద్రబాబు పిలుపు మేరకు ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేసిందని తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ తన కేశినేని ఫౌండేషన్ నిధులతో నిర్మించిన లాంగ్ జంప్ పిట్‌ను పరిశీలించారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి మాట్లాడుతూ పాఠశాలకు రంగులు కూడా త్వరలో వేయిస్తామని చెప్పారు. టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, 8వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, కార్యదర్శి నారు రామారావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, మోడరన్ అకాడమీ ఫౌండర్ సుంకర పాపారావు, అమ్మ అసియేషన్ అధ్యక్షుడు సతీష్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, నాగుల్‌మీరా తదితరులు

బెజవాడ బార్ అభివృద్ధికి సహకరించండి

● ఎంపీ కేశినేని శివనాథ్‌కు వినతి

విజయవాడలీగల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్‌ను ఆధునికీకరించేందుకు సహకరించాలని బెజవాడ బార్ న్యాయవాదులు, బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్ సమక్షంలో శనివారం ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు ఎక్కువ మంది వుండటం వలన ఎప్పుడో నిర్మించిన వాష్‌రూమ్స్ కూడా సరిపోవడం లేదని, బిల్డింగ్ ఆధునీకరించి మరమ్మతులు చేయడానికి ఎంపీ సహాయాన్ని కోరుతూ న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎంపీ బార్ అసోసియేషన్‌కు తన సహాయ సహకారాలు అందిస్తానని న్యాయవాదులకు హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా,ఉపాధ్యక్షుడు పిళ్లా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ వరాహ లక్ష్మీ, తదితరులున్నారు.

చంద్రగ్రహణం వీక్షణానికి నేడు గోరా టెక్నో హబ్‌లో ఏర్పాట్లు

పటమట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి చంద్రగ్రహణాన్ని అందరూ వీక్షించేలా విజయవాడ నాస్తిక్ కేంద్రంలో గోరా టెక్నో హబ్ ఏర్పాట్లు చేసింది. ఆదివారం రాత్రి 9గంటల నుంచి అర్ధరాత్రి 2గంటల వరకు చంద్రగ్రహణం వీక్షణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు, సంపూర్ణ చంద్రగ్రహణంపై వివరాలు ప్రదర్శన, సైంటిస్టులచే ప్రసంగాలు ఉంటాయని, ఆసక్తి ఉన్న వారందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా గోరా టెక్నో హబ్ ఛైర్మన్ డాక్టర్ సమరం కోరారు.

ఘనంగా బాల గణపతి ఊరేగింపు

వన్‌టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూజారివారి వీధిలోని బాలగణపతి స్వామివారి మందిరం వద్ద బాలగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం బాలగణపతి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తరలి వచ్చి దర్శించుకుని గణపతి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం పుర వీధులలో బాలగణపతిని ఊరేగించారు. సేవా సమితి ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు, పాల్గొన్నారు.

యాగశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● ఇంజనీరింగ్ అధికారులకు ఈవో శీనానాయక్ ఆదేశం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ప్రాంగణంలో దాత సంగా నరసింహారావు సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న యాగశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని దేవస్థానం ఈవో వి.కె.శీనానాయక్ ఆలయ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఈవో, దాత సంగా నరసింహారావు, ఆలయ స్థానాచార్యుడు వి.శివప్రసాద్ శర్మ, ఈఈ కోటేశ్వరరావుతో కలిసి యాగశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా దాత పనులను ఈవోకు వివరించి పలు సూచనలు చేశారు. పనులు ఏమేరకు జరుగుతున్నాయని ఈవో ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుని పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఈఈకి సూచించారు. ఈనెల 15లోగా యాగశాల పనులు పూర్తవుతాయని ఈఈ కోటేశ్వరరావు తెలిపారు. అనంతరం వారు శివాలయాన్ని పరిశీలించారు.


యాగశాల పనులను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, దాత సంగా నరసింహారావు

దుర్గగుడిలో నిత్యాన్నదాన పథకానికి విరాళాలు


దాత అనిల్ కుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి పలువురు దాతలు శనివారం ఆలయ అధికారులకు విరాళాలు అందచేశారు. విజయవాడ సీతారామపురానికి చెందిన అనిల్‌కుమార్, అమ్మాజీలు వారి కుమార్తెలు ముత్యాల తేజస్వి, లేఖన పేరు మీద నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 అధికారులకు అందచేశారు. హైదరాబాద్, మల్కాజ్‌గిరి, గీతానగర్‌కు చెందిన కె.వి.కృష్ణారావు, కె.వి.లక్ష్మీలు నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,000లు అధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటం, విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అందజేశారు.

చవితి పందిరిలో ఎంపీ పూజలు



మాచవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ఎలాంటి విఘ్నాలు లేకుండా ఆశీస్సులు అందించాలని 6వ డివిజన్‌లో వినాయకుడ్ని వేడుకున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. లంబోధరాయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలో స్వామిని ఆయన శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, తదితరులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో గణేశ్ ఉత్సవాలు ముగింపు

● స్వచ్ఛాంధ్ర చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, తూర్పు ఎమ్మెల్యే గద్దె ప్రత్యేక పూజలు

కృష్ణలంక, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యం హోటల్ సెంటర్‌లోని శ్రీ గణేష్ మహోత్సవ కమిటీ చవితి పందిరిలో ఉత్సవాలు ఆఖరి రోజైన శనివారం స్వచ్ఛాంధ్ర కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి పండితులు హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నదానాన్ని ప్రారంభించారు. దాదాపు 5 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అభిషేక్, సందీప్, తవ్వా ప్రకాష్, కొల్లి అమర్, చేతు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం టక్కు టమార డప్పు వాయిద్యాలతో కృష్ణలంక పురవీధుల్లో గణేషుని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పెట్టి ఊరేగించారు. అనంతరం కృష్ణానదిలో విఘ్నేశ్వరుని నిమజ్జనం చేశారు.


సత్యం హోటల్ సెంటర్‌లో కొమ్మారెడ్డి పట్టాభి ప్రత్యేక పూజలు

సెక్యూరిటీ ఏజెన్సీలను ప్రభుత్వం ఆదుకోవాలి

పాస్మా రాష్ట్ర అధ్యక్షుడు నాగేంద్రరావు

గాంధీనగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న సెక్యూరిటీ ఏజెన్సీలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ సెక్యూరిటీ మెంబర్స్ అసోసియేషన్ (పాస్మా) రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి నాగేంద్రరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సంఘం రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ ఏజెన్సీలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మోటూరి శంకరరావు మాట్లాడుతూ సెక్యూరిటీ ఏజెన్సీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. సెక్యూరిటీ రంగం అభివృద్ధికి చట్టబద్ధమైన విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.నాగేశ్వరరావు, ఒంగోలు వేంకటేశ్వర్లు, సుమన్ ,నారాయణ, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కాలేజీలో నేత్రదానంపై అవగాహన

విజయవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు 40వ నేత్రదాన అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఎన్టీఆర్ జిల్లా డీపీఎం డాక్టర్ ఈఎస్ఎన్ మూర్తి నేత్రదానం ప్రాముఖ్యతపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కళ్లకు వచ్చే పలురకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ సిబ్బంది విద్యార్థులకు, మరణించిన దాతల నుంచి కార్నియాలను సేకరించే విధానాన్ని వివరించడంతో పాటు ప్రదర్శించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, ఫిజికల్ డైరెక్టర్ యుగంధర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు

ముగిసిన గణేశ్ ఉత్సవాలు

● ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎన్టీఆర్ విగ్రహం

రామలింగేశ్వరనగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలుగు యువత పటమటలంక కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. నవరాత్రి పూజలు అందుకున్న గణనాథుడుని ఊరేగింపుగా నిమజ్జనానికి శనివారం రాత్రి తరలించారు. నర్రా కిషోర్, యలమంచిలి దేవేందర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఊరేగింపులో ముందు భాగాన ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఊరేగింపునకు ముందుగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, యువనేత గద్దె క్రాంతి, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.



బొబ్బాకు ఘననివాళి


బొబ్బా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

పటమట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్ బొబ్బా వెంకటేశ్వరరావు 27వ వర్ధంతి సభ పటమట శాఖ ఆధ్వర్యంలో మీసేవ కేంద్రం వద్ద ఘనంగా నిర్వహించారు. తూర్పు నగర్ కార్యదర్శి కృష్ణ సీపీఎం పతాకాన్ని, సీఐటీయు పతాకాన్ని తూర్పు సీఐటీయూ అధ్యక్షుడు వీవీ రాజు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు పటమట, విజయవాడ నగర అభివృద్ధికై కౌన్సిల్‌లో, బయట ఎంతో కృషిచేశారని కొనియాడారు. ముఖ్యంగా పటమట ప్రాంతంలో వీధిలైట్లు, రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయడంలో ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. ప్రజలకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా సర్కిల్-3 కార్యాలయానికి ఆయన పేరు పెట్టి గౌరవించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, గురుమూర్తి, ఎల్లారావు, ఏడుకొండలు, నాంచారయ్య, శ్యాంబాబు, మోహిత్ కృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బుద్దువారి ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

నూతన పాలకవర్గానికి ఎంపీ కేశినేని శివనాథ్ హితవు

వన్‌టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీగంగా పార్వతి సమేత వసంత మల్లికార్జున దేవస్థానం (బుద్దువారి గుడి) అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హితవు పలికారు. పశ్చిమ నియోజకవర్గంలోని బ్రాహ్మణవీధిలోని బుద్దువారి గుడి ఆలయ చైర్మన్‌గా పిళ్లా సుదర్శనరావు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీకి నూతన కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం కమిటీ చైర్మన్‌గా నియమితులైన పిల్లా సుదర్శన్‌తో పాటు కమిటీ సభ్యులతో ధర్మకర్తగా ఎంపీ కేశినేని శివనాథ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, నియోజకవర్గ పరిశీలకులు చిట్టాబత్తుని శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎం.ఎస్.బేగ్, తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు పూడికతీత పనుల్లోనూ నిర్లక్ష్యం

● సీహెచ్ బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు పూడికతీత పనుల్లోను సంబంధిత అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేలోని రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న బుడమేరును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు మొద్దు నిద్రవీడి బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఈ పర్యటనలో కె. దుర్గారావు, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

బ్లూఫ్లాగ్ బీచ్‌లకు తక్కువేం కాదు!

- కృష్ణాజిల్లాలో చెంతనే వెలుగు చూడని అద్భుత బీచ్‌లు
- మంగినపూడి బీచ్ కంటే అద్భుతమైన మరో 3 బీచ్‌లు
- పెద్దగొల్లపాలెం, చిన్న గొల్లపాలెం, పెదపట్నం బీచ్‌లు అదరహో
- పరిశుభ్రంగా ఉండే బీచ్‌లపై దృష్టి పెడితే పర్యాటక స్వర్గధామమే
- ఎన్‌హెచ్ - 216 వెంబడి 3 కిలో మీటర్ల దూరంలో సుందర బీచ్‌లు



పాల నురుగులు కక్కే స్వచ్ఛమైన నీరు.. గోధుమ వర్ణపు ఇసుక మేటలు.. సుందరమైన ప్రాంతాలు.. అద్భుతమైన సూర్యాస్తమయపు దృశ్యాలు..! కృష్ణాజిల్లాలో ఆకట్టుకుంటున్న నాలుగు బీచ్‌లు ఇవి! బ్లూఫ్లాగ్ బీచ్‌లకు ఏమీ తక్కువ కాదు! కానీ వీటి గురించి ఎంత మందికి తెలుసు? కృష్ణాజిల్లాలో మంగినపూడి బీచ్ తప్పితే మిగిలిన బీచ్‌ల గురించి తెలిసింది తక్కువే. మంగినపూడి కంటే అద్భుతమైన బీచ్‌లు ఎన్నో ఉన్నాయి. రవాణా సదుపాయాలు కల్పిస్తే చాలు! ఇలాంటి బీచ్‌లను మన పక్కన పెట్టుకుని గోవాకు పరుగులు పెడుతున్నాం. ప్రకృతి వనరులు కలిగిన ఇలాంటి బీచ్‌లు మరెక్కడైనా ఉంటే ఒడిసి పట్టుకుని పర్యాటకంగా అభివృద్ధి చేసుకునేవారు! కృష్ణా జిల్లాలో పర్యాటక స్వర్గధామంగా ఉండే బీచ్‌లు ఏమిటి? అవెక్కడున్నాయి? వాటి ప్రత్యేకత ఏమిటి? అక్కడికి ఎలా వెళ్లాలనే వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. - ఆంధ్రజ్యోతి, విజయవాడ/కృత్తివెన్ను

కృత్తివెన్ను మండలంలో ఎన్‌హెచ్ - 216 వెంబడి 3 కిలోమీటర్ల దూరంలో చిన్న గొల్లపాలెం బీచ్ ఉంది. దీని ప్రత్యేకత ఏమిటంటే సముద్రంలో దీవి ఉంది. ఇది మానవ నిర్మిత దీవిగా చెప్పుకోవాలి. కొల్లేరు బ్యాక్ వాటర్ ఈ ప్రాంతాన్ని ముంచెత్తుతున్నప్పుడు ఈ ముంపును మళ్లించడానికి వీలుగా స్థానిక ప్రజలు బ్యాక్ వాటర్‌ను సముద్రంలోకి పంపేందుకు కొత్త కాలువను రెక్కల కష్టంతో తవ్వారు. దీంతో బ్యాక్ వాటర్ అంతా కొత్తకాలువ నుంచి సముద్రంలో కలిసేది. కాలక్రమంలో కాలువ వెంబడి సముద్ర తీరానికి అనుకుని దీవి ఏర్పడింది. ఈ దీవికి మూడు వైపులా కొత్త కాలువ మిగిలిన ఒకవైపు సముద్రం ఉంటుంది. ఈ దీవి పొడవు 9 కిలోమీటర్లు, వెడల్పు 5 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. మొత్తం 5వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో కొబ్బరిచెట్లు, సరుగుడు చెట్లు ఇతర పండ్ల చెట్లను రైతులు సాగు చేస్తున్నారు. దీన్ని చిన్న గొల్లపాలెం దీవిగా పేర్కొంటారు. ఈ దీవిని చూస్తే అద్భుత ప్రకృతి ప్రపంచం కనిపిస్తుంది. దీన్ని ఆనుకుని సుందరమైన బీచ్ ఉంటుంది. దీన్ని పెద్దగొల్లపాలెం బీచ్ అంటారు. సువిశాల బీచ్ కంటిని రెప్పార్పనీయకుండా చేస్తుంది. ఈ ప్రాంతం చాలా పరిశుభ్రంగా ఉంటుంది. పర్యాటకులు రావటానికి తేలికైన దారి లేదు. ఇదొక్కటే ఇక్కడి సమస్య!

చిన్న గొల్లపాలెం బీచ్

పెద్ద గొల్లపాలెం బీచ్

చిన గొల్లపాలెం నుంచి 6 కిలోమీటర్ల దూరంలో పెద గొల్లపాలెం బీచ్ ఉంది. స్వచ్ఛమైన బీచ్ ఇది. విస్తీర్ణం 4 కిలోమీటర్లు. ఈ బీచ్ చాలా పరిశుభ్రంగా ఉంటుంది. సాయంత్రాలు చాలామంది యువకులు బైక్‌లు వేసుకుని సముద్రతీరం వెంబడి మెరుపువేగంగా దూసుకుపోతూ ఎంజాయ్ చేస్తుంటారు. ఇక్కడి బీచ్ ఇసుక తిన్నెలతో కూడిన నేల చాలా గట్టిగా ఉంటుంది. బైక్‌లపై సవారీ చేసేవారు స్లిప్ అయి పడిపోరు. మెత్తటి ఇసుక మేటలు కట్టి పడేస్తారు. నీలం రంగున ఆకాశం నయనానందకరంగా ఉంటుంది. సాయంత్రం సూర్యాస్తమసమయాన బీచ్ పలు రంగుల్లో మెరిసిపోతుంది.





పెదపట్నం బీచ్

పెద్ద గొల్లపాలెం బీచ్ తర్వాత 10 కిలోమీటర్ల దూరంలో బందరు మండలం పరిధిలో పెదపట్నం బీచ్ ఉంటుంది. ఈ బీచ్‌కూడా 8 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది. ఈ బీచ్ చాలా సుందరంగా ఉంటుంది. సముద్రం ఈ వైపు ఉధృతంగా ఉంటుంది. గర్జిస్తున్నట్టుగా ఉంటుంది. ఈ ప్రాంతం కూడా ఎంతో పరిశుభ్రంగా ఉంటుంది. పెదపట్నం బీచ్‌కు ఒకసారి వస్తే మళ్లీ మళ్లీ రావాలనిపిస్తుంది. చిన్న గొల్లపాలెం, పెద్ద గొల్లపాలెం, పెదపట్నం బీచ్‌లు వరుసగా ఒకదాని వెంబడి ఒకటి ఉంటాయి. పెదపట్నం బీచ్ తర్వాత మంగినపూడి బీచ్ ఉంటుంది. ఈ బీచ్‌లన్నింటినీ నాలుగు కాల్వలు విడదీస్తాయి. చిన్న, పెద్ద గొల్లపాలెం బీచ్ మధ్య కొత్త కాలువ, పెద్ద గొల్లపాలెం, పెదపట్నం బీచ్ మధ్యన పెద లంక డ్రెయిన్, పెదపట్నం, మంగినపూడి బీచ్‌ల మధ్యన లజ్జబండ డ్రెయిన్ పెదన మీదుగా సముద్రంలో కలుస్తాయి. నాలుగు బీచ్‌లు మూడు కాలువలను కలిపి బీచ్ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయటానికి మంచి అవకాశం ఉంది.

పతాకస్థాయికి చంద్రబాబు కీర్తి

- మాజీ హోంమంత్రి వసంత

నందిగామ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దార్శనిక పాలకుడిగా మీకీర్తి పతాకస్థాయికి చేరిందని, అమరావతి నిర్మాణంతో ఆ కీర్తి చరిత్రలో ప్రత్యేక స్థానం సాధించనుందని మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కొనియాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లయిన సందర్భంగా శుక్రవారం సచివాలయంలో ఆయన చంద్రబాబును కలిశారు. ఇరువురు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. టీడీపీ తొలినాళ్ల అనుభవాలను నెమరవేసుకున్నారు. వసంత ఆరోగ్యంపై చంద్రబాబు ఆరా తీశారు. రాష్ట్ర అభివృద్ధికి మీ వంటి సీనియర్లు సేవలందించాలన్నారు. బీభత్సం తరువాత నెలకొన్న ప్రశాంతతను ప్రజలు ఇప్పుడు అనుభవిస్తున్నారని వసంత అన్నారు. సుదీర్ఘకాలంగా ఎన్నో ఎదురు దెబ్బలు తిన్నా విధానాలు మార్చుకోకుండా నమ్మిన సిద్ధాంతం కోసం నడిచిన మీ మహోన్నత వ్యక్తిత్వం భావితరాలకు ఆదర్శం కానుందన్నారు. రాష్ట్ర పునః నిర్మాణానికి చేస్తున్న కృషికి ప్రజలు అండగా ఉంటారని వసంత పేర్కొన్నారు.


వసంత నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న సీఎం

సాదియా అల్మాస్‌కు ఘనస్వాగతం

గన్నవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక విమానాశ్రయంలో జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్మాస్‌కు ఘనస్వాగతం లభించింది. కోస్టారికా దేశం శాంజోస్‌లో జరిగిన పోటీల అనంతరం శనివారం హైదరాబాద్ మీదుగా మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో సాదియా అల్మాస్‌కు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు భాస్కరరావు, సంయుక్త కార్యదరి ఎండీ మస్తాన్‌వలి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎస్కే సుభాని, నరసరావుపేట ఎంఐఎం ఇన్‌చార్జి షేక్ మౌలాలీ, ముస్లీం చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుర్, పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వచ్చి స్వాగతం పలికారు. అల్మాస్ పాటు ఆమె తండ్రి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి షేక్ సందానిని ఘనంగా సత్కారించారు. అనంతరం సాదియా మీడియాతో మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, స్పాన్సర్ల ప్రోత్సాహం వల్లే ఈ ఘనతను సాధించినట్టు తెలిపారు. ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధిస్తానని ఆశాభావం వ్యకం చేశారు.



జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన సాదియా అల్మాస్‌కు స్వాగతం పలుకుతున్న అసోసియేషన్ సభ్యులు

పండుగలకు 122 ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పండుగల సీజన్ దృష్ట్యా వివిధ ప్రాంతాలకు 122 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 06059 మధురై - భరోని 10 నుంచి నవంబర్ 26 వరకు బుధవారాల్లో, 06060 భరోని - మధురై 13 నుంచి నవంబరు 29 వరకు శనివారాల్లో, 06039 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ - భరోని 14 నుంచి నవంబరు 30 వరకు ఆదివారాల్లో, 06040 భరోని - ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ 17 నుంచి డిసెంబరు 3 వరకు మొత్తం నాలుగు రైళ్లు 12 సర్వీసులు చొప్పున బుధవారాల్లో నడుస్తాయి. 06081 తిరువనంతపురం నార్త్ - సంత్రాగచ్చి 5 నుంచి అక్టోబరు 17 వరకు శుక్రవారాల్లో, 06082 సంత్రాగచ్చి - తిరువనంతపురం నార్త్ 8 నుంచి అక్టోబరు 20 వరకు ఏడు సర్వీసులు చొప్పున సోమవారాల్లో నడుస్తుంది. 06103 తిరునల్వేలి - శివమొగ్గ టౌన్ 7 నుంచి అక్టోబరు 26 వరకు ఆదివారాల్లో, 06104 శివమొగ్గ టౌన్ - తిరనల్వేలి 8 నుంచి 27 వరకు ఈ రెండు రైళ్లు 8 సర్వీసులు చొప్పున సోమవారాల్లో నడుస్తాయి. 02841 షాలిమార్ - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ 22 నుంచి నవంబరు 24 వరకుసోమవారాల్లో, 02842 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - షాలిమార్ 24 నుంచి నవంబరు 26 వరకు ఈ రెండు రైళ్లు 10 సర్వీసులు చొప్పున బుధవారాల్లో నడుస్తాయి. కాగా, మరికొన్ని రైళ్లను మరికొన్ని రోజులపాటు పొడిగించారు. 06077 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - సంత్రాగచ్చి అక్టోబరు 4 నుంచి 18 వరకు శనివారాల్లో, 06078 సంత్రాగచ్చి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ అక్టోబరు 6 నుంచి 20 వరకు 3 సర్వీసుల చొప్పున సోమవారాల్లో నడుస్తాయి. 06539 ఎస్ఎంవిటి బెంగళూరు - బీదర్ శుక్ర, ఆదివారాల్లో నడుస్తుంది. అక్టోబరు 3 నుంచి 31 వరకు, 06540 బీదర్ - ఎంఎంవీటీ బెంగళూరు శని, సోమవారాల్లో నడుస్తుంది. అక్టోబరు 4 నుంచి నవంబరు 1 వరకు ఈ రెండు రైళ్లు 9 సర్వీసులు చొప్పున నడుస్తాయి.

వివాదాస్పద భూమి రిజిస్ట్రేషన్..!

- ప్రొటెస్ట్ పిటిషన్‌పై స్పందించని వైనం
- జగ్గయ్యపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

జగ్గయ్యపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వివాదంలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసిన జగ్గయ్యపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వీ రామకృష్ణను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్) శనివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. వత్సవాయి మండలం భీమవరం గ్రామంలో సర్వే నెంబర్ 310/1లో 1.54 ఎకరాల భూమిలో విజయవాడకు చెందిన బొగ్గవరపు లక్ష్మీ నరసింహ కుమార్ మరో నలుగురు బాగస్వాములుగా విజేత ఇండస్ట్రీస్‌ను ఏర్పాటుకు 1997లో కొనుగోలు చేశారు. ఆ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్లలో ఒకరైన గోనుగుంట్ల లక్ష్మణ్‌కుమార్ మృతి చెందటంతో ఆయన సోదరి పులిపాటి లక్ష్మీ సుకన్య అన్ రిజిస్టర్ వీలునామాతో విజేత ఇండస్ట్రీస్ పేరున ఉన్న స్థలాన్ని ఆమె పేరున బదలాయింపు చేసుకోవటంపై మిగిలిన భాగస్వాములు 2021లో అప్పటి సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో విచారణ అనంతరం పులిపాటి లక్ష్మీ సుకన్య పేరున జారీ చేసిన పట్టాదార్ పాస్ పుస్తకాన్ని రద్దు పరచాలని, ఆ భూమిని డిస్ప్యూట్ ల్యాండ్‌గా మార్క్ చేయాలని వత్సవాయి తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా గత జూన్ నెల 16న ఆ భూమిని లక్ష్మీ సుకన్య నందిగామకు చెందిన వ్యక్తులకు విక్రయించగా ఆ రోజు ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న సీనియర్ అసిస్టెంట్ వీ రామకృష్ణ రిజిస్ట్రేషన్ చేశారు. విషయం తెలుసుకుని సంస్థ భాగస్వాములు ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేసినా సబ్ రిజిస్ట్రార్ స్పందించలేదు. దాంతో భాగస్వాములు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ లక్ష్మీశ విచారించాల్సిందిగా విజయవాడ సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు. విచారణలో వివాదాస్పద భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్టు తేలటంతో ఆ రోజు రిజిస్ట్రేషన్ అధికారిగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ వీ రామకృష్ణను సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.


మంత్రి లోకేశ్ ఇంటి ముట్టడికి వచ్చిన ఎస్‌ఎఫ్‌ఐ నేతలు, శ్రేణుల్ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఉద్రిక్తంగా 'చలో విజయవాడ'

- విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం: ఎస్ఎఫ్ఐ

ధర్నాచౌక్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన 'చలో విజయవాడ'లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీసెంట్‌రోడ్డు నుంచి స్థానిక ధర్నాచౌక్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా నిర్వహించిన అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇంటి ముట్టడికి ప్రయత్నించిన ఎస్ఎఫ్ఐ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తీవ్ర తోపులాట జరిగింది. ఈ క్రమంలో ముగ్గురు మహిళా నేతలు స్పృహ తప్పగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పలువురు ఎస్ఎఫ్ఐ నేతలను పోలీసులు అరెస్టు చేసి నగరంలోని పలు స్టేషన్లకు తరలించారు. తొలుత నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులను నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. విద్యారంగంలో సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నా మంత్రి లోకేశ్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటాన్ని అభినందించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పీ రామ్మోహన్, కే ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దూరం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. తక్షణమే రూ.6400 ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, అర్హులైన ప్రతీ విద్యార్థికి తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌జే నాయుడు, కిరణ్, రవి, రాజా పాల్గొన్నారు.

నేడు గ్రామ గ్రామాన ఎరువులపై జన జాగృతి

- ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించండి
- అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల క్షేమం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఎరువులను పంపిణీ చేస్తోందని, ఎక్కడా గందరగోళానికి తావులేకుండా సరైన సమాచారం అందించేందుకు ఈనెల 7న ఆదివారం గ్రామగ్రామాన అధికారులు, సిబ్బంది ఇంటింటికీ చేరువై ఎరువులకు సంబంధించిన సమాచారాన్ని అందించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం రాత్రి కలెక్టర్ కార్యాలయం నుంచి రెవెన్యూ, వ్యవసాయ, సహకార, మార్క్‌ఫెడ్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియాతో పాటు వివిధ రకాల ఎరువులు అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయని ప్రణాళిక ప్రకారం ఎప్పటికప్పుడు ఎరువులు సరఫరా అవుతున్నాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో 5,546 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు మొత్తం 21,554 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. తమ సమీపంలోని సొసైటీ వివరాలతో పాటు ప్రస్తుతం ఆ సొసైటీలో ఎంతమేరకు ఎరువులు అందుబాటులో వున్నాయి, మరో వారం రోజుల్లో ఎంతమొత్తం ఎరువులు కొత్తగా వస్తాన్న అంశాలను తెలియజేయడంతో పాటు ఏ దశలో ఎంతమేరకు, యూరియాను, ఎరువులను ఉపయోగించాలనే దానిపైన అవగాహన కల్పించాలన్నారు. డబ్బు ఆదాతో పాటు పర్యావరణ పరిరక్షణకు, నేలసారాన్ని కాపాడుకొనేందుకు అందుబాటులోకి వచ్చిన నానో యూరియా వినియోగం, ప్రయోజనాలపైనా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులతో పాటు వివిధ స్థాయిలోని వ్యవసాయ అధికారులు ఉద్యాన అధికారులు, సిబ్బంది ఈ అన్నదాతల జాగృతి కార్యక్రమంలో పాల్గొనాలని, సరైన సమాచారం అందించి రైతులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్శిటీల్లో పోస్టులను భర్తీ చేయాలి

- గవర్నర్‌కు మాజీ ఎమ్మెల్సీ వినతి

గవర్నర్‌పేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వర్శిటీల్లో ఖాళీగా ఉన్న 4500 టీచింగ్ పోస్టులను భర్తీ చేయడానికి చాన్సలర్ హోదాలో చొరవ చూపాలని శనివారం మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి మెమొరాండం అందజేశారు. కేంద్రం విడుదల చేసిన మెమో నెంబరు 57ను అమలు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను సీపీఎస్ నుంచి ఓపీఎస్ పరిధిలోకి తేవాలని కోరారు.జీవో నెంబరు 114 అమలు చేసి కాంట్రాక్టు అధ్యాపకులను, ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని గవర్నర్‌ను కోరారు.


ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శిక్షణార్థులతో ముచ్చటిస్తున్న భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

భవిష్యత్ చోదకశక్తులుగా యువత ఎదగాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాన్ని అందిపుచ్చుకుని ఉద్యోగార్థులుగా కాకుండా శక్తివంతమైన భవిష్యత్ చోదకశక్తులుగా యువత ఎదగాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ (విజయవాడ చాప్టర్)లో శనివారం ఉదయం పచ్చని ప్రకృతిలో నడిచిన ఆయన అక్కడ శిక్షణార్థులతో కలిసి యోగ, వ్యాయామం చేశారు. ఈసందర్భంగా కొద్దిసేపు యువతతో ముచ్చటించి వారి ఆలోచనలు తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ప్రావీణ్యాలు, నైపుణ్యాలు మెరుగుపరచుకున్న యువత ఏ రంగంలోనైనా అద్భుతంగా రాణించగలదన్నారు. యువత భుజస్కందాలపై దేశభవిష్యత్తు ఆధారపడి ఉందన్న ఆయన వ్యక్తుల ప్రతిభాపాటవాలు, నైపుణ్యాలే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించగలవని విశ్వాసం వ్యక్తం చేశారు.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వన్‌స్టాప్ సెంటర్ (విజయవాడ)లో అడ్మినిస్ట్రేటర్ ఒక పోస్ట్, సైకో సోషల్ కౌన్సెలర్ ఒక పోస్టు భర్తీకి గతేడాది అక్టోబరు 16న నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించామని, అందులో ఎవరూ అర్హత సాధించనందున తిరిగి నోటిఫికేషన్ జారీ చేసినట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు లేదా ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసేందుకు స్థానిక అర్హులైన 18 నుంచి 42 ఏళ్ల వయసున్న మహిళా అభ్యర్థులు నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ మహిళలకు 5ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు గరిష్ట వయస్సులో సడలింపు ఉంటుందన్నారు. సెప్టెంబరు 9 వరకు ఆసక్తిగల స్థానిక మహిళా అభ్యర్థులు ఎన్టీఆర్.ఏపీ.జీఓవీ.ఇన్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిచేసి, ధ్రువీకరణ పత్రాల నకళ్లను గజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి, ఆ దరఖాస్తులను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి వారి కార్యాలయం, డోర్ నెంబరు 31-4-29/ఎ, గద్దె పూర్ణచంద్రరావు వీధి, మారుతీనగర్ 2వ లైను, విజయవాడ కార్యాలయంలో స్వయంగా సమర్పించాలన్నారు.


స్వామివారికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులు

వైభవంగా స్వామివారి శాంతి కల్యాణం

- కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

ఘంటసాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో వేంచేసి ఉన్న శ్రీ కాకుళేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. విశేషంగా అలంకరించిన దేవాలయ ముఖ మండపంలో కల్యాణమూర్తులను ఉంచి వేదపండితులు అగ్నిహోత్రం భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాంతి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి శాంతి కల్యాణానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలుత విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, పవిత్ర విసర్జన, మహాపూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శాంతి కల్యాణానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఈ వేడుకలను పర్యవేక్షించారు. ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), కుంపటి చిట్టిబాబు, శీలం శ్రీనివాస్, దాసం రామకృష్ణ, కొండవీటి నాని, కోటి, వినయ్, శ్రీను పాల్గొన్నారు.

విజయవంతంగా గణేశ్ ఉత్సవాలు

- ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు గోకరాజు గంగరాజు

లబ్బీపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గణేష్ ఉత్సవాలు నిర్వహణలో ప్రభుత్వ సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్టు ఆంధ్రప్రదేశ్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు గోకరాజు గంగరాజు తెలిపారు. బందర్ రోడ్డులోని గ్రాండ్ మినర్వా హోటల్‌లో శనివారం సమితి అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ సమితి పురోగతి వివరాలతో రూపొందించిన పుస్తకాన్ని సమితి పెద్దలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడు లేనివిధంగా సింగిల్ విండో పద్ధతి ద్వారా ఎలాంటి రుసుములు లేకుండా, ఉచిత విద్యుత్ సౌకర్యం అందించి సమన్వయంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఉత్సవాల్లో పలు చోట్ల ప్రమాదవశాత్తు చనిపోయిన 11 మంది కుటుంబాల్లో ప్రతి కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసహాయం అందజేయాలని నిర్ణయంచామన్నారు. వారికి త్వరలోనే ఆయా జిల్లాల సమితి సభ్యులు అందజేస్తారని, ఉత్సవాల విజయవంతంలో సహకరించిన ప్రభుత్వానికి, అధికారులకు, సమితి సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ రంగ ప్రసాద్, బీవీ రమణ కుమార్, కార్యదర్శులు దుర్గా ప్రసాద్ రాజు, వేణుగోపాల్, కుమారస్వామి, రమణ పాల్గొన్నారు.

మారణాయుధాలతో డ్యాన్స్

- గణేష్ నిమజ్జనంలో ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా అలజడి
- చూస్తూ ఊరుకున్న పోలీసులు
- భయాందోళనలో గ్రామస్థులు

వీరులపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అసలే నరసింహారావుపాలెం గ్రామం సమస్యాత్మకమైంది. అలాంటి గ్రామంలో శుక్రవారం గణేష్ నిమజ్జనంలో ఒక వర్గం వారు మరోవర్గాన్ని రెచ్చగొట్టేలా మారణాయుధాలు చేత పట్టుకొని గ్రామోత్సవం చేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. నిమజ్జనాలు పోలీసుల ప్రహారాలో జరుగుతున్నా ఇలాంటి ఘటన జరగడం పోలీసులు చూస్తూ ఊరుకోవడం విమర్శలకు తావిస్తోంది. గ్రామంలో ఒక వర్గం వారు వింత పోకడలకు తెరలేపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి వింత చేష్టలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


చేతిలో పెద్ద కత్తి పటుకుని ఒక వ్యక్తిపై ఎక్కి డ్యాన్స్ చేస్తున్న మరో వ్యక్తి





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
సైయారా	హిందీ చిత్రం	సెప్టెంబర్ 12
అమెజాన్ ప్రైమ్		
ది గర్ల్‌ఫ్రెండ్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 10
కూలీ	తమిళ చిత్రం	సెప్టెంబర్ 11
డూ యూ వన్నా పార్ట్‌నర్	హిందీ సిరీస్	సెప్టెంబర్ 12
జియో హాట్‌స్టార్		
బిగ్‌బాస్ 9	తెలుగు రియాలిటీ షో	సెప్టెంబర్ 07
రాంబో ఇన్ లవ్	తెలుగు సిరీస్	సెప్టెంబర్ 12

ఆరోగ్యానికి అరటి పువ్వు!



అరటికాయ ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలుసు. అయితే అరటి పువ్వుతోనూ ఆరోగ్య ప్రయోజనాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం..

- అరటి పువ్వులో కాల్షియం, పొటాషియం, ఐరన్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి.
- పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి.
- ఫైబర్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది.
- ఐరన్ రక్తహీనతను దూరం చేస్తుంది.
- అరటి పువ్వు తినడం వలన రక్తంలో చక్కెర స్థాయిలు కూడా నియంత్రణలో ఉంటాయి.

సండే సెలబ్రిటీ





కాంబినేషన్లతో... కథ వెనుకబడింది!

సినీ రంగంలో ఎత్తుపల్లాలు సర్వసామాన్యం. వాటిని తట్టుకొని నిలబడిన వారే ఈ రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోగలుగుతారు. అలాంటి ప్రయత్నం చేస్తున్న నిర్మాతే **అనిల్ సుంకర**. 'ఏ-టీవీ' ద్వారా వినోద రంగంలోకి అడుగుపెట్టిన అనిల్.. ఆ తర్వాత '14 రీల్స్' పతాకంపై అనేక విజయవంతమైన సినిమాలను నిర్మించారు. 'భోళాశంకర్' పరాజయంతో కొంత కాలం సినీ నిర్మాణానికి దూరంగా ఉన్నారు. మళ్లీ ఒక వినూత్నమైన రియాలిటీ షోతో, కొత్త చిత్రాలతో సెకండ్ ఇన్నింగ్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'తో తన అనుభవాలు పంచుకున్నారు.

మూడేళ్ల తర్వాత మళ్లీ రియాల్టీ షో ద్వారా సినీ నిర్మాణంలోకి ప్రవేశిస్తున్నారు కదా... ఎలా అనిపిస్తోంది?

బయట వాళ్లు ఏదేదో అనుకోవచ్చు. కానీ నేను ఇండస్ట్రీకి దూరంగా జరగలేదు. నాకు సినీ నిర్మాణంతో పాటు అనేక ఇతర వ్యాపారాలు ఉన్నాయి. సినీ నిర్మాణం అనేది వాటిలో పది శాతం మాత్రమే! అయితే గత మూడేళ్లుగా అన్నీ మందకొడిగా సాగాయి. దీనితో ఒడుదొడుకులు ఏర్పడ్డాయి. కానీ నేను 25 ఏళ్ల నుంచి వ్యాపారాలు చేస్తున్నాను. ఇలాంటి ఒడుదొడుకులు సహజమే!

> **నాకు నచ్చిన కంటెంట్‌ను నమ్మి ఇకపై సినిమాలు తీస్తా. ఇతరుల అభిప్రాయాలు కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కానీ కంటెంట్‌ను మనం పూర్తిగా నమ్మాలి. ఇతరులు అభిప్రాయాల మీదనే ఆధారపడకూడదనేది నా అభిప్రాయం. అంతేకాదు... ప్రేక్షకుల అభిరుచులు మారిపోతున్నాయి. దానికి తగ్గట్టుగా మనం కూడా మారాలి. ప్రేక్షకుల అభిరుచికి తగినట్లు మన కంటెంట్ ఉంటేనే విజయం సాధిస్తాం.**

'భోళాశంకర్' మీరు అనుకున్నట్లు విజయం సాధించలేదు కదా! ఆ సమయంలో మీరు ఎలా ఫీలయ్యారు?

'కర్ణుడి చావుకు కారణాలు కోటి' అంటారు.. అలా 'భోళాశంకర్' పరాజయానికి అనేక కారణాలు ఉన్నాయి. నా ఉద్దేశంలో ఈ సినిమా కొవిడ్‌కు ముందు విడుదలయితే మంచి విజయాన్ని సాధించేది. ఇది అజిత్ నటించిన ఒక తమిళ్ సినిమా. తమిళ్‌లో అది పెద్ద హిట్. అజిత్ సినీ జీవితంలో అతి ఎక్కువ కలెక్షన్లు సంపాదించింది. అందుకే ఈ సినిమాను ఎంపిక చేసుకున్నాం. కానీ కొవిడ్ వల్ల ఆ తమిళ సినిమాను ఓటీటీలలో అందరూ చూసేశారు. దానివల్ల కొంత ఆసక్తి తగ్గింది. ఇలా చెప్పుకుంటూపోతే అనేక కారణాలున్నాయి..

ఆ సినిమా పరాజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవిని కలిసారా? మీ సహనిర్మాతల రియాక్షన్ ఏమిటి?

సినిమా విడుదలకు ఒక రోజు ముందు చిరంజీవి గారితో మాట్లాడాను. "మీరు బాగా అలసిపోయారు. ఒక నాలుగైదు రోజులు విశ్రాంతి తీసుకోండి. అప్పుడు అన్నీ చూసుకుందాం" అన్నారు. సినిమా పరాజయం తర్వాత కూడా ఆయన ఇచ్చిన మద్దతు మరచిపోలేనిది. నా దగ్గర నుంచి ఒక్క పైసా కూడా తీసుకోలేదు. ఇక సహ నిర్మాతల విషయానికి వస్తే అందరూ నాకు మద్దతుగా నిలిచారు. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే- మేమందరం ఒకరికొకరు అండగా ఉంటాం. 'భోళాశంకర్' విడుదలకు ముందు రోజు ఇండస్ట్రీలో అనేకమంది నిర్మాతలు మా ఆఫీసుకు వచ్చారు. అలాగే నేను కూడా ఏదైనా సినిమా విడుదల ఉంటే వాళ్ల ఆఫీసుకు వెళ్తా. ఎందుకంటే- ఒక సినిమా హిట్ అయితే ఒక పాజిటివ్ వైబ్ వస్తుంది. మిగిలిన వాళ్ల సినిమాలు హిట్ అవుతాయి. ఇక... సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తూ ఉంటాయి. వాటిలో నిజం ఉండదు.

సినిమాతో కాకుండా రియాలిటీ షోతో మళ్లీ జర్నీ ఎందుకు మొదలుపెడుతున్నారు?

ఈ రియాలిటీ షోను కొవిడ్‌కు ముందు నుంచి డిజైన్ చేస్తున్నాము. ఇప్పుడు మంచి సమయం అనిపించింది. అంతకన్నా వేరే కారణం లేదు. ఈ షోను ప్రారంభిస్తున్నామని చెప్పగానే అనూహ్యమైన స్పందన వచ్చింది. అంత స్పందన వస్తుందని నేను అనుకోలేదు.

చిత్ర నిర్మాణానికి దూరంగా ఉన్నా... మీరు పరిశ్రమను గమనిస్తూనే ఉన్నారు కదా! ఈ మూడేళ్లలో ఏదైనా మార్పు వచ్చిందా?

ప్రతి ఏడాది పరిశ్రమ మారుతూనే ఉంటుంది. ఇది చాలా సహజం. ఇప్పుడు వీఎఫ్ఎక్స్‌లు ప్రవేశించాయి. కొత్త ప్రపంచాల నేపథ్యంలో సినిమాలు వస్తున్నాయి. భిన్నమైన కథలు సినిమాలు తీయాలనుకొనేవారికి ఇదొక మంచి సమయం.

> **ఓటీటీ వల్ల మంచే జరిగింది. అనేక భాషల్లో సినిమాలను చూసే అవకాశం ప్రేక్షకులకు లభించింది. దీని వల్ల వారి అభిరుచులు మారాయి. దానికి తగ్గట్టుగా పరిశ్రమ కూడా మారాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కోణం నుంచి చూస్తే ఓటీటీ మంచి మార్పే తీసుకు వచ్చింది.**

మీరు మంచి సమయం అంటున్నారు.. కానీ భారీ సినిమాలు దెబ్బతింటున్నాయి. ప్రేక్షకులు థియేటర్లకు రావటం లేదని అనేకమంది చెబుతున్నారు...

దీన్ని మనం రెండు కోణాల నుంచి చూడాలి. ఒకటి- తెలుగు సినిమా పరిశ్రమ ప్రారంభం అయిన దగ్గర నుంచి సినిమాల సక్సెస్ రేట్ ఐదు నుంచి పదిశాతం మాత్రమే! అంటే వంద సినిమాలు విడుదలయితే- వాటిలో విజయం సాధించేవి పది సినిమాలు మాత్రమే! మిగిలినవన్నీ యావరేజ్‌గా వెళ్తాయి. ఇక రెండో కోణం నుంచి చూస్తే భారీ బడ్జెట్ సినిమాలు పరాజయం చెందటానికి అనేక కారణాలున్నాయి. 'బాహుబలి' విజయం తర్వాత అనేకమంది నిర్మాతలకు అనేక కొత్త మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. ఓటీటీల ద్వారా అదనపు ఆదాయం లభించటం మొదలైంది. ఇలాంటి అంశాల వల్ల సినిమా బడ్జెట్లు పెరిగిపోయాయి. ఒకప్పుడు దర్శకుడు కథను ఎంపిక చేసుకొని - ఆ తర్వాత నటీనటులను ఎంపిక చేసుకొనేవాడు. నిర్మాత డబ్బులు పెట్టేవాడు. కానీ ఒక దశలో హీరో, దర్శకుడి కాంబినేషన్ కుదిరితే చాలనుకున్నాం. కథ వెనకబడిపోయింది. నేను ఎవరినీ విమర్శించటం లేదు. ఇలా చేసిన వారిలో నేను కూడా ఉన్నాను. ఎప్పుడైతే కథ సరిగ్గా కుదరదో అప్పుడు ప్రేక్షకుడు దాన్ని ఆదరించడు. చాలా సినిమాలకు జరిగింది ఇదే!

ఒక సినిమా పరాజయానికి ఇదే కారణమా?

ఇదే కాదు. ఇంకా అనేక కారణాలుంటాయి. ఉదాహరణకు సినీ నిర్మాణంలో జరిగే వృథా. అది రకరకాలుగా ఉంటుంది. దానివల్ల బడ్జెట్ విపరీతంగా పెరిగిపోతుంది. కాస్ట్ రికవరీ కాదు. మీకు ఒక ఉదాహరణ చెబుతాను. నేను తీసిన ఒక సినిమాలో క్లైమాక్స్‌లో ఒక ఊరేగింపు సీను ఉంటుంది. దాన్ని నాలుగు రోజులు తీయాలన్నారు. రోజుకు 30 లక్షల బడ్జెట్ ఇచ్చారు. మొదటి రోజు షూటింగ్ పూర్తయింది. రెండో రోజు షూటింగ్‌కు వెళ్లాను. అక్కడ చాలామంది ఖాళీగా కూర్చుని ఉన్నారు. 'వీళ్లందరు ఖాళీగా ఎందుకున్నారు?" అని అడిగితే వాళ్ల షూటింగ్ కాలేదన్నారు. ఇక్కడ సమస్య ఏమిటంటే- వీళ్లందరికీ మొదటి రోజు నుంచి లెక్కపెట్టి వేతనాలు ఇవ్వాలి. ఇలాంటి వృథా వల్ల నిర్మాతకు తడిసి మోపెడు అవుతోంది. వాటిని తగ్గించుకుంటే నిర్మాణ వ్యయం నియంత్రణలోకి వస్తుంది.

అది సాధ్యమవుతుందా? కార్మికులకు వేతనాలు పెంచటానికి నిర్మాతలు అంగీకరించారు కదా...

ఈ మధ్య నిర్మాతలలో కూడా అవగాహన బాగా పెరిగింది. ఈ ఖర్చులన్నీ నియంత్రణలోకి వస్తాయనే నమ్మకం నాకుంది. అంతేకాకుండా ఏఐ వల్ల సమీప భవిష్యత్తులో అనేక మార్పులు వస్తాయి. ఉదాహరణకు ఏఐ పూర్తిగా అభివృద్ధి చెందితే సెట్స్ వల్ల అయ్యే అదనపు ఖర్చులు ఉండవు. ఇలాంటి మార్పులు చాలా వస్తాయి.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అందానికి మొక్కజొన్న

మొక్కజొన్నను చాలామంది ఇష్టంగా తింటారు. దానితో వంటలూ చేస్తారు. అయితే మొక్కజొన్న అందాన్ని పెంచడంతో సహాయపడుతుందని తెలుసా..? ఆ వివరాలు తెలుసుకుందాం...



- మొక్కజొన్నలో విటమిన్ ఎ, సి, డి ఉంటాయి. ఇవి చర్మం మీది నల్లటి మచ్చలను తగ్గిస్తాయి.
- విటమిన్ ఇ చర్మం పొడిబారే సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
- కాపర్, జింక్, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి ఖనిజాలు ముడతలు, మచ్చలను మాయం చేస్తాయి.
- విటమిన్ ఇ పొడిబారకుండా సహాయపడుతుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై ముడతలను తగ్గిస్తాయి.
- మొక్కజొన్నలోని కొన్ని రకాల అమైనో ఆమ్లాలు కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మం కాంతివంతంగా మారేలా చేస్తాయి.

ఇలా వాడాలి:

- మొక్కజొన్న పిండిలో కొంచెం తేనె, పాలు కలిపి పేస్టులా చేయాలి. దీనిని ముఖానికి ప్యాక్‌లా వేసుకుని పదిహేను నిమిషాల తరువాత కడిగేయాలి. దీని వలన చర్మం మృదువుగా మారుతుంది.
- మొక్కజొన్న పిండిలో పసుపు, పెరుగు వేసి కలిపి మెత్తని మిశ్రమంగా చేసుకుని ముఖానికి రాసుకుని 20 నిమిషాల తరువాత కడిగేసుకోవాలి. ఇలా చేయడం వలన చర్మం మీది మచ్చలు పోయి, ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.
- ఒక గిన్నె మొక్కజొన్న పిండి, తేనె, కొంచెం నిమ్మరసం, నీరు కలిపి పేస్టులా చేసుకోవాలి. దీనిని ముఖానికి, మెడకు రాసి సున్నితంగా రుద్దాలి. దీని వలన చర్మం మీద మృతకణాలు తొలగిపోతాయి.
- మొక్కజొన్న పిండిలో కీరదోస గుజ్జును కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవాలి. అరగంట తరువాత కడిగేయాలి. ఈ ప్యాక్ చర్మం తేమను కోల్పోకుండా సహాయపడుతుంది.

సెలబ్ టాక్

పదిహేడేళ్లకే కెరీర్ ప్రారంభమైంది. బుల్లితెర మీదుగా ప్రయాణిస్తూ... వెండితెరపై అలరిస్తూ... భారత వినోద పరిశ్రమలో తిరుగులేని ఒక బ్రాండ్‌గా ఎదిగింది. యాభై ఏళ్ల జీవిత గమనం... ముప్పై ఏళ్లుగా పరిశ్రమతోనే కలిసి ప్రయాణం. 'బాలాజీ టెలీఫిలిమ్స్ లిమిటెడ్' అధినేత... ధారావాహికలకు వినూత్న హంగులు అద్దిన పారిశ్రామికవేత్త... ఏక్తా కపూర్ జైత్రయాత్ర ఇది.

సీరియల్ క్వీన్

'మహిళలకు ఓదార్పు బహుమతులు (కన్సొలేషన్ ప్రైజెస్) అక్కర్లేదు. కావల్సింది సమాన వేదిక, సమాన స్థాయి, సమాన అవకాశాలు. అవి అందిన రోజు వారి ఎదుగుదలను ఎవరూ ఆపలేరు'... ఇది ఏక్తా కపూర్ మాట. సగటు సినీ వారసులకు భిన్నం ఆమె. నిన్నటి తరం హీరో జితేంద్ర, శోభా కపూర్ కుమార్తెగా వెండితెరపై ఒదిగిపోవాలని ఆమె కలలు కనలేదు. ఒకరిపై ఆధారపడకుండా... స్వశక్తితో ఎదగాలని పరితపించారు.

"వెనక్కి తిరిగి చూసుకొంటే.. కొంత అల్లకల్లోలం, కొన్ని కొత్త మలుపులు, మరికొన్ని అద్భుత సందర్భాలతో కూడిన సుదీర్ఘ ప్రయాణం ఇది. కెరీర్‌ను నిర్మించుకొనే క్రమంలో ఈ మూడు దశాబ్దాల్లో... విభిన్న దశల్లో ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. అన్నిటినీ తట్టుకొని నిలబడటమే నా విజయ రహస్యం అని భావిస్తున్నా" అంటున్న ఏక్తా డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే తన కెరీర్‌కు పునాదులు వేసుకున్నారు. నిర్మాత, దర్శకుడు కైలాష్ సురేంద్రనాథ్ వద్ద ఇంటర్న్‌షిప్ చేశారు. 1994లో 'బాలాజీ టెలీఫిలిమ్స్' నెలకొల్పాక తండ్రి నుంచి ఆర్థిక సాయం తీసుకొని నిర్మాతగా మారి, హిందీ ధారావాహికలు తీశారు. మొదటి ఆరు పైలెట్ ప్రాజెక్టులు విజయవంతం కాలేదు. వాటిని ప్రసారం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆర్థికంగా నష్టపోయారు. అయితే మరుసటి ఏడాది చేపట్టిన 'మానో యా న మానో' సీరియల్, 'ధున్ ధమాకే' మ్యూజిక్ షోలు దూరదర్శన్, ఇతర చానల్‌లో ప్రసారమయ్యాయి. అదే సంవత్సరం వచ్చిన 'హమ్ పాంచ్'తో తొలిసారి విజయం రుచి చూశారు ఏక్తా. విద్యాబాలన్ తదితరులు అందులో నటించారు. 1995లో మొదలైన ఆ సీరియల్ నాలుగేళ్లు కొనసాగింది. ఇక అక్కడి నుంచి వరుస ప్రాజెక్టులతో దూసుకుపోయారు ఆమె. ఎంతగా అంటే... ఒకానొక సమయంలో దేశంలోని చానల్స్‌లో ప్రసారమయ్యే 50 షోస్‌లో 38 'బాలాజీ టెలీఫిలిమ్స్' నిర్మించినవే.



ఒడుదొడుకులు దాటి...

సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం, అంతుపట్టని వ్యూహాలతో అడుగులు వేయడం ఏక్తా నైజం. అదే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టింది. కానీ ఆ దూకుడే తరువాత వరుస పరాజయాలకు కూడా కారణమైంది. షూటింగ్‌లో అవసరానికి మించి ఖర్చు, ఆఖరి నిమిషంలో కంటెంట్‌లో కట్‌లతో బడ్జెట్ అమాంతం పెరిగిపోయేది. మారుతున్న ప్రేక్షకుల అభిరుచిని అంచనా వేయడంలో విఫలమవడం, ఏకపక్ష నిర్ణయాలవల్ల నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. ఆమె తీరుతో బడా టీవీ చానల్స్‌తో సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయినా ఏక్తా డీలా పడిపోలేదు.

'కె' సెంటిమెంటు...

కెరీర్‌లో ఎదురుదెబ్బల ఫలితం కావచ్చు... ఉన్నట్టుండి ఏక్తా ఆధ్యాత్మికత వైపు మళ్లారు. 'కె' అనే అక్షరం ఆమెకు సెంటిమెంట్‌గా మారింది. 'క్యోం కీ సాస్...' హిట్ తరువాత ఆ సెంటిమెంటు మరింత బలపడింది. 'కహానీ ఘర్ ఘర్ కీ, కభీ సౌతన్ కభీ సహేలీ, కోహి అప్నా సా, కసౌటీ జిందగీ కే'.. ఇలా 'కె' అక్షరంతో మొదలయ్యే పేర్లతో వరుస ధారావాహికలు వచ్చాయి. 2001లో 'బెస్ట్ ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు కూడా ఆమెకు దక్కింది. 'బాలాజీ మోషన్ పిక్చర్స్' పేరిట సినీ నిర్మాణం కూడా మొదలుపెట్టారు. 2008లో 'బాలాజీ టెలిఫిలిమ్స్' నిర్మించిన ఎనిమిది హిందీ షోస్ వివిధ చానల్స్‌లో ప్రసారమయ్యాయి. ఇతర తెలుగు, తమిళం తదితర భాషల్లో కూడా డబ్బింగ్ అయ్యాయి. అయితే తరువాతి కాలంలో అనూహ్యంగా సంస్థ రూ.14 కోట్లు నష్టపోయింది. ఓ బడా చానల్‌తో ఒప్పందం రద్దయింది. అదేసమయంలో టీవీ పరిశ్రమ సమ్మెతో పరిస్థితి మరింత దిగజారింది. అప్పటివరకు ఆమె పడిన శ్రమ వృథా అయింది.

అమ్మేయాలంటూ సలహాలు...

'బాలాజీ టెలీఫిలిమ్స్ లిమిటెడ్'గా ఎదిగిన కంపెనీ ఒక్కసారిగా నష్టాల్లోకి వెళ్లిపోవడంతో ఏక్తాపై రకరకాల వ్యాఖ్యలు. స్టాక్ ఎనలిస్టులు అయితే సంస్థను అమ్మేయమని ఉచిత సలహాలు ఇచ్చారు. అంతటి గందరగోళ పరిస్థితుల్లో కూడా తడబడలేదు ఆమె. దాన్ని ఒక సవాలుగా స్వీకరించి ధైర్యంగా ముందుకు సాగారు. లోపాలను సరిదిద్దుకొంటూ మళ్లీ సంస్థ నిర్మాణాన్ని మొదలుపెట్టారు. మరోవైపు బాలీవుడ్‌లోనూ 'ది డర్టీ పిక్చర్, వీర్ ది వెడ్డింగ్, లైలా మజ్నూ, క్రూ' తదితర హిట్ సినిమాలతో తనదైన ముద్ర వేశారు. 2017లో అంటే భారత్‌లో 'నెట్‌ఫ్లిక్స్' ప్రారంభమైన ఏడాదికి 'ఆల్ట్ బాలాజీ' పేరుతో వీడియో ఆన్ డిమాండ్ ప్లాట్‌ఫామ్ నెలకొల్పారు ఏక్తా. ఇది మంచి లాభాలు ఆర్జించి పెట్టింది. అయితే కంటెంట్ అభ్యంతరకరంగా ఉందంటూ పలు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఏక్తా, ఆమె తల్లి శోభ సంస్థ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా మాతృ సంస్థను విజయపథంలో నడిపిస్తున్నారు. వినోద రంగంలో ఆమె చేసిన సేవలకు గానూ 2020లో 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు.

> **బిడ్డకు తల్లి... కానీ...**
>
> ప్రత్యర్థులకు అందనంత ఎత్తుకు సంస్థను తీసుకువెళ్లిన ఏక్తా వ్యక్తిగత జీవితం కూడా అనూహ్యంగానే ఉంటుంది. వైవాహిక బంధంపై ఆసక్తి లేని ఆమె 2019లో సరోగసీ ద్వారా మగ బిడ్డకు జన్మనిచ్చారు. అప్పుడే కాదు, సంస్థను నడిపే క్రమంలో, తన ఆహార్యం, ఆకారం విషయంలోనూ ఎన్నో విమర్శలు, అవహేళనలు ఎదుర్కొన్నారు. "నా రూపంపైనే కాదు, నేను ధరించే వస్త్రాల గురించి, ఆఖరికి నా కేశాల గురించి కూడా వెటకారంగా, చులకనగా మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఇలాంటివి వినీ వినీ నా చర్మం మొద్దుబారిపోయింది. కానీ వీళ్లందరికీ నేను సాధించిన అపురూప విజయాలు కనిపించవు" అంటారు ఏక్తా.




వింటేజ్ హంగులతో ఇల్లు అందంగా...

ఇంటిని పాతకాలపు వస్తువులు, ఫర్నిచర్‌తో అలంకరించుకుంటూ వింటేజ్ హంగులద్దే ట్రెండ్ క్రమంగా పెరుగుతోంది. ఇలా వింటేజ్ లుక్‌తో ఇంటిని సరికొత్తగా ఎలా తీర్చిదిద్దుకోవాలో తెలుసుకుందాం...



- ఒకప్పుడు అందరూ తమ ఇంట్లో.. ముఖ్యంగా ముందుగది, పడకగదుల్లోని గోడలకు ఫొటో ఫ్రేములు ఏర్పాటు చేసుకునేవారు. అలాగే ఇప్పుడు కూడా అప్పటి కాలానికి సంబంధించిన బ్యాండ్, మ్యూజిక్ పోస్టర్లు; వింటేజ్ కార్లు, బైకుల పోస్టర్లు లాంటివి సేకరించి గోడలకు అంటించుకోవచ్చు. ప్రస్తుతం ఇలాంటి ఎన్నో రకాల పోస్టర్లు అందుబాటులో ఉన్నాయి. కుటుంబ సభ్యులతో కలిసి తీయించుకున్న పాత ఫొటోను అందంగా ఫ్రేమ్ కట్టించి హాల్లో పెట్టుకున్నా చక్కని వింటేజ్ లుక్ వస్తుంది.
- ఇంటి గోడలను ఖరీదైన వాల్ పెయింటింగ్స్‌తో నింపే బదులు ఒకప్పుడు ఎంతో ఆదరణ పొందిన రెట్రో ప్రింట్స్, నేచర్ థీమ్ వాల్ పేపర్లు, యానిమల్ ప్రింటెడ్ పేపర్లను తెచ్చి అంటిస్తే గత జ్ఞాపకాలను తాజాగా గుర్తు చేసుకోవచ్చు.
- ఒకప్పుడు మనం విరివిగా ఉపయోగించిన రాగి, ఇత్తడి వస్తువులను ఇంటి అలంకరణలో భాగం చేయవచ్చు. రెండు చెవుల గంగాళం ఇంట్లో ఉంటే దాన్ని శుభ్రం చేసి నిండా నీళ్లు నింపి అందులో రంగురంగుల పూలు పేర్చి హాల్లో ఎదురుగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇది ఇంటికి అందమైన వింటేజ్ శోభను అందిస్తుంది. రాగి లేదా ఇత్తడి గ్లాసులను ఫ్లవర్ వాజ్‌లుగా మార్చి ఇంట్లో అక్కడక్కడా పెట్టవచ్చు. ఇలాంటి లోహపు వస్తువులు ఎన్నో ప్రస్తుతం మార్కెట్లో లభ్యమవుతున్నాయి కూడా. పాత గ్రామ్‌ఫోన్, రేడియో, టీవీ లాంటి వాటిని ఒక టేబుల్‌మీద అందంగా అమర్చినా ఇంటికి చక్కని కళ వస్తుంది.
- కాటన్, లినెన్, జ్యూట్, చేనేత వస్త్రాలతో రూపొందించిన కర్టెన్లు, సోఫా కవర్లు, దిండు కవర్లు, దుప్పట్లు లాంటివి ఉపయోగిస్తే ఇంటికి పాతకాలపు అందం వచ్చేస్తుంది. పెద్ద పెద్ద పూలు, ప్రింట్లు అప్పటి ప్రత్యేకతలు.
- చెక్కతో రూపొందించిన బీరువాలు, కుర్చీలు, టేబుల్స్, టీపాయ్, బుట్ట ఉయ్యాల, చిన్న నిచ్చెన లాంటివి పాతకాలపు ఇంటి అందాలు. వీటితోపాటు విండ్ ఛైమ్స్, షాండ్లియర్స్, గోడ గడియారాలను అందంగా అలంకరించుకుంటే వింటేజ్ హోమ్ కళ్ల ముందు నిలుస్తుంది.



స్పోర్ట్స్

విజయవాడ ● ఆదివారం 7 సెప్టెంబరు 2025

డబ్రోస్కీ జోడీకి డబుల్స్ కిరీటం

యూఎస్ ఓపెన్ మహిళల డబుల్స్‌లో మూడో సీడ్ ఎరిన్ రౌటిఫ్ (న్యూజిలాండ్)-గాబ్రియెలా డబ్రోస్కీ (కెనడా) జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్లో గాబ్రియెలా ద్వయం 6-4, 6-4తో టాప్ సీడ్ జంట టేలర్ టౌన్‌సెండ్ (యూఎస్ఏ)-కాటెరీనా సినియకోవా (చెక్)కు షాకిచ్చి ట్రోఫీని అందుకుంది.



నిరుడు క్యాన్సర్‌తో పోరాడి.. నేడు విజేతగా నిలిచి..

ఏడాది క్రితం క్యాన్సర్ బారిన పడి ఎంతో వేదనను అనుభవించిన కెనడా టెన్నిస్ స్టార్ గాబ్రియెలా డబ్రోస్కీ (33).. ఇప్పుడు యూఎస్ ఓపెన్‌లో డబుల్స్ ట్రోఫీని ముద్దాడి చిరునవ్వులు చిందించింది. 2024, ఏప్రిల్‌లో డబ్రోస్కీ రొమ్ము క్యాన్సర్ బారిన పడింది. రెండు సర్జరీలు, రేడియేషన్ చికిత్స చేయించుకొన్న ఆమె మూడు నెలలపాటు ఆట నుంచి విరామం తీసుకొంది. కానీ, పోరాటపటిమ గల డబ్రోస్కీ.. అతి తక్కువ వ్యవధిలోనే క్యాన్సర్ నుంచి కోలుకొంది. రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ రాకెట్ పట్టింది. నిరుడు ఆగస్టులో పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడిన డబ్రోస్కీ.. ఫెలిక్స్ అలియాసిమితో జతకట్టి మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం గెలిచింది. ఆ తర్వాత కివీస్ క్రీడాకారిణి ఎరిన్ రౌటిఫ్‌తో కలిసి రియాద్‌లో జరిగిన డబ్ల్యూటీఏ ఫైనల్స్, సిన్సినాటితోపాటు పలు టోర్నీల్లో టైటిళ్లు సాధించింది. అదే జోష్‌తో తాజాగా యూఎస్ ఓపెన్ బరిలోకి దిగి విజేతగా నిలిచింది. ఇది కేవలం గెలుపు కాదు.. వ్యక్తిగతంగా, క్రీడాకారిణిగా తనకిది పునర్జన్మ అని డబ్రోస్కీ చెప్పుకొచ్చింది. అంతేకాదు.. 'నేను అనుభవించిన బాధ చాలా మందికి తెలియదు. టెన్నిస్ కోర్టులో ఎందుకు అంతగా నవ్వుతున్నావని అందరూ అడుగుతున్నారు. అది ఎందుకో నాకు మాత్రమే తెలుసు' అని బాధను సంతోషాన్ని కలగలిపి చెప్పిన డబ్రోస్కీ.. తన గాథతో నేటి తరం ప్లేయర్లకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.



యూఎస్ ఓపెన్

ఇక్కడా ఆ ఇద్దరే!

సెమీస్‌లో జొకోవిచ్‌కు ఝలక్

పురుషుల సింగిల్స్ ఫైనల్ నేడు

రాత్రి 11.30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..

వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో అల్కారజ్ x సినర్

న్యూయార్క్: ఈ ఏడాది వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ తుది పోరులోనూ నువ్వా.. నేనా? అని తేల్చుకునేందుకు వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సినర్, నెంబర్ టూ కార్లోస్ అల్కారజ్ సిద్ధమయ్యారు. ఈ ఏడాది ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ ఫైనల్లో తలపడిన ఈ ఇద్దరు.. చెరో టోర్నీ నెగ్గారు. తాజాగా యూఎస్ ఓపెన్ టైటిల్ ఫైట్‌లోనూ ఢీకొంటున్నారు. తద్వారా ఒకే సీజన్‌లో మూడు వరుస గ్రాండ్‌స్లామ్స్ ఫైనల్స్‌లో తలపడుతున్న ఆటగాళ్లుగా సినర్-అల్కారజ్ రికార్డులకెక్కారు. ఆదివారం జరిగే అంతిమ పోరులో విజేత ఎవరో తేలనుంది. డిఫెండింగ్ చాంపియన్ సినర్‌కిది వరుసగా ఐదో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కావడం విశేషం. ఇక.. రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ కోసం ఎన్నాళ్లుగానో వేచి చూస్తున్న 38 ఏళ్ల నొవాక్ జొకోవిచ్‌కు మరోసారి భంగపాటే ఎదురైంది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో స్పెయిన్ సంచలనం అల్కారజ్ 6-4, 7-6(4), 6-2తో వరుస సెట్లలో మాజీ చాంపియన్ జొకోవిచ్‌ను ఓడించాడు. మరో సెమీఫైనల్లో ఫెలిక్స్ అలియాసిమి (కెనడా)ని ఓడించేందుకు ఇటలీ స్టార్ సినర్ నాలుగు సెట్ల పాటు కష్టపడ్డాడు. కొద్దిసేపు మెడికల్ టైమ్ అవుట్ తీసుకున్న సినర్ చివరకు 6-1, 3-6, 6-3, 6-4తో గట్టెక్కి వరుసగా రెండోసారి ఇక్కడ ఫైనల్ చేరాడు. కెరీర్‌లో 300వ విజయం అందుకున్న సినర్‌కు ఇది వరుసగా ఐదో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కావడం విశేషం. నిరుడు యూఎస్ ఓపెన్ నెగ్గిన సినర్.. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ విజేతగా నిలిచాడు. ఆ వెంటనే ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరినా, అల్కారజ్ టైటిల్ ఎగరేసుకుపోయాడు. అనంతరం వింబుల్డన్‌లోనూ తుదిపోరుకు దూసుకెళ్లిన సినర్.. అల్కారస్‌ను ఓడించి చాంపియన్‌గా అవతరించాడు.



పోరాటం ఆపను..

ఈ సీజన్‌లో జొకోవిచ్ నాలుగు గ్రాండ్‌స్లామ్స్‌లోనూ సెమీస్‌కు చేరినా.. అతడి పోరు అక్కడితోనే ఆగిపోయింది. ఇందులో రెండుసార్లు సినర్ (ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్), ఓసారి అల్కారజ్ (యూఎస్ ఓపెన్) చేతిలో ఓడిన జొకోవిచ్.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జ్వెరెవ్‌తో సెమీస్‌లో గాయంతో మ్యాచ్ మధ్యలోనే వైదొలిగాడు. ఇలా.. 25వ స్లామ్‌ను ఖాతాలో చేర్చుకోవాలన్న జొకో భగీరథ ప్రయత్నాలకు ఈ యువతరం స్టార్లు అడ్డుపడుతున్నారు. అయినా కూడా గ్రాండ్‌స్లామ్స్‌లో తన పోరాటాన్ని ఆపేది లేదని అంటున్నాడు జొకో. తాను ఇప్పట్లో రిటైర్ అయ్యే అవకాశం లేదని, వచ్చే ఏడాది కూడా అన్ని మేజర్ టోర్నీల్లో ఆడాలనుకుంటున్నట్టు జొకో స్పష్టం చేశాడు.

ఆసియా కప్ హాకీ

ఫైనల్లో భారత్

నేడు కొరియాతో అమీతుమీ



రాత్రి 7.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

రాజ్‌గిర్: పురుషుల ఆసియాకప్ హాకీ టోర్నీలో భారత జట్టు ఫైనల్‌కు చేరింది. శనివారం చైనాతో జరిగిన సూపర్-4 ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఏకంగా 7-0 తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరపున అభిషేక్ (46, 50వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో విజృంభించగా.. శీలానంద్ (4), దిల్‌ప్రీత్ సింగ్ (7), మన్‌దీప్ సింగ్ (18), రాజ్‌కుమార్ పాల్ (37), సుఖ్‌జీత్ సింగ్ (39) తలో గోల్ చేశారు. ఈ గెలుపుతో భారత జట్టు సూపర్ 4 లీగ్ టేబుల్‌లో ఏడు పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ఇక నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియాతో భారత్ ఆదివారం జరిగే తుది పోరులో అమీతుమీ తేల్చుకోనుంది. అంతకుముందు కొరియా 4-3తో మలేసియాను ఓడించింది. కాగా, టోర్నీలో విజేతగా నిలిచిన జట్టు వచ్చే ఏడాది జరిగే వరల్డ్‌కప్‌నకు అర్హత సాధిస్తుంది. ఇక, చైనాలోని హాంగ్జౌలో జరుగుతున్న మహిళల ఆసియా కప్ హాకీ టోర్నీలో భారత్ రెండో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌ను నిలువరించింది. శనివారం జపాన్‌తో జరిగిన పోరును భారత్ 2-2తో డ్రాగా ముగించింది. తొలి మ్యాచ్‌లో భారత్ 11-0తో థాయ్‌లాండ్‌ను ఓడించిన సంగతి తెలిసిందే.

మిక్స్‌డ్ ఫైనల్లో జ్యోతి

● ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్‌ను భారత క్రీడాకారులు ఘనంగా ప్రారంభించారు. కాంపౌండ్ కేటగిరిలో రెండు విభాగాల్లో ఫైనల్స్‌కు దూసుకెళ్లి రెండు పతకాలు ఖాయం చేశారు. కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ/రిషభ్ యాదవ్ ద్వయం.. వరుసగా జర్మనీ, ఎల్ సాల్వడార్, చైనీస్ తైపీ జట్లను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఆదివారం జరిగే స్వర్ణ పతక పోరులో నెదర్లాండ్స్‌తో జ్యోతి జోడీ తలపడనుంది. ఇక.. రిషభ్, అమన్ సైనీ, ప్రథమేశ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో ఫైనల్ చేరింది. తొలుత ఆస్ట్రేలియాను, ఆ తర్వాత అమెరికాను చిత్తుచేసిన భారత త్రయం.. సెమీస్‌లో టర్కీని ఓడించింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఫ్రాన్స్‌తో భారత్ తలపడనుంది.

నిఖత్ ముందంజ

లవ్లీనా ఇంటికి ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో శనివారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. స్టార్ బాక్సర్లలో రెండుసార్లు చాంపియన్ నిఖత్ జరీన్ ముందంజ వేయగా, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్ ఇంటిబాట పట్టింది. 51 కిలోల విభాగం తొలి రౌండ్లో నిఖత్ 5-0తో జెన్నిఫర్ లజానో (అమెరికా)ను చిత్తుచేసి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. 75 కిలోల ప్రీక్వార్టర్స్‌లో టాప్ సీడ్ లవ్లీనా 0-5తో బుర్సా ఇసిల్దార్ (టర్కీ) చేతిలో ఓటమిపాలైంది. నరేందర్ (90+ కిలోలు) 4-1తో క్రిస్టోఫర్ (ఐర్లాండ్)పై విజయం సాధించి ప్రీక్వార్టర్స్ చేరాడు.

బుల్స్ బోణీ

ప్రొ కబడ్డీ లీగ్‌లో పైరేట్స్ చిత్తు



విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో బెంగళూరు బుల్స్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. వరుసగా మూడు ఓటముల అనంతరం తొలి విజయాన్ని నమోదు చేసింది. శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 38-30తో పట్నా పైరేట్స్‌ను చిత్తుచేసింది. బుల్స్ రైడర్ అలిరెజా మీర్జాయిన్ అద్భుతంగా రాణించి సూపర్ 10 సాధించగా.. మరో రైడర్ ఆశిష్ మాలిక్ 8 పాయింట్లు రాబట్టి బుల్స్ విజయంలో కీలక పాత్ర పోషించారు. పైరేట్స్‌లో అయాన్ సూపర్ 10 సాధించినా ఫలితం లేకపోయింది. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 37-28తో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది.

భారత్ 'ఎ' కెప్టెన్‌గా శ్రేయాస్



- నితీశ్ కుమార్‌కు చోటు
- ఆసీస్ 'ఎ'తో రెండు అనధికార టెస్టులు

న్యూఢిల్లీ: ఆసియాకప్ టీ20 టోర్నీలో చోటు దక్కించుకోలేకపోయిన శ్రేయాస్ అయ్యర్‌ను సెలెక్టర్లు కరుణించారు. అతడిని భారత్ 'ఎ' జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేశారు. శనివారం 15 మందితో కూడిన ఈ జట్టును ప్రకటించారు. ఆస్ట్రేలియా 'ఎ' జట్టు వచ్చే వారం భారత పర్యటనకు రానుంది. సెప్టెంబరు 16 నుంచి 26 వరకు లఖ్‌నవూలో భారత్ 'ఎ', ఆసీస్ 'ఎ' జట్ల మధ్య రెండు అనధికారిక నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లు జరుగుతాయి. శ్రేయాస్ గతేడాది ఫిబ్రవరిలో చివరి టెస్టు ఆడాడు. ఆసీస్ 'ఎ'పై ప్రభావం చూపగలిగితే అక్టోబరులో వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు ఎంపికయ్యే చాన్సుంది. ప్రస్తుతం శ్రేయాస్ వెస్ట్ జోన్ తరపున దులీప్ ట్రోఫీ సెమీస్‌లో ఆడుతున్నాడు. అలాగే గాయం నుంచి కోలుకున్న ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి కూడా 'ఎ' జట్టులో చోటు దక్కింది. ఇంగ్లండ్ పర్యటనలో అతను గాయపడిన విషయం తెలిసిందే. మరోవైపు రెండో టెస్టు కోసం కేఎల్ రాహుల్, సిరాజ్ జట్టులో చేరనున్నారు. అటు కరుణ్, సర్ఫరాజ్, శార్దూల్‌లకు సెలెక్టర్లు చోటివ్వకపోవడం గమనార్హం. ఈ రెండు టెస్టుల తర్వాత కాన్పూర్‌లో ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు జరుగుతాయి.

భారత్ 'ఎ' జట్టు: శ్రేయాస్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఎన్.జగదీశన్, సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (కీపర్), దేవ్‌దత్, హర్ష్ దూబే, ఆయుష్ బదోని, నితీశ్ కుమార్, తనుష్ కోటియన్, ప్రసిద్ధ్ క్రిష్ణ, గుర్నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, మనవ్, యష్ ఠాకూర్. రాహుల్, సిరాజ్ (రెండో టెస్టుకు).

28న బీసీసీఐ కొత్త చీఫ్ ఎన్నిక!

న్యూఢిల్లీ: కొత్త అధ్యక్షుడు, ఐపీఎల్ ఛైర్మన్‌ను ఎన్నుకోవడమే ప్రధాన అజెండాగా బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) ఈనెల 28న ముంబైలో జరగనుంది. ఏజీఎంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సహా కీలక ఆఫీసు బేరర్ల పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు అనుబంధ సంఘాలకు బోర్డు కార్యదర్శి దేవాజిత్ సైకియా సమాచారం అందించాడు. తనకు 70 ఏళ్లు నిండడంతో బోర్డు రాజ్యాంగం ప్రకారం అధ్యక్ష పదవి నుంచి రోజర్ బిన్నీ ఇటీవల తప్పుకొన్న సంగతి తెలిసిందే.

పన్ను రేటులో తేడా ఉన్నప్పుడు టైమ్ ఆఫ్ సప్లయ్ నిర్ధారణ ఎలా?



రాంబాబు గొండాల

ఇటీవలి 56వ జీఎస్‌టీ కౌన్సిల్ మీటింగ్‌లో జీఎస్‌టీకి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఇంత భారీ సంస్కరణలు చోటు చేసుకోవటం ఇదే తొలిసారి. ఈ నెల 22 నుంచి అమల్లోకి వచ్చే జీఎస్‌టీ తగ్గింపులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే పలు సూచనలు చేసింది. తగ్గించిన పన్ను ప్రయోజనాలు కచ్చితంగా వినియోగదారులకు చేరాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే నేరుగా వినియోగదారులకు అమ్మే వస్తువులకు అంటే బీ2సీ (బిజినెస్ టు కన్స్యూమర్) సరఫరాలో పెద్ద సమస్య లేకపోవచ్చు. ఎందుకంటే, ఈ నెల 22 నుంచి అమ్ముడయ్యే ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి తగ్గించిన ధరనే తీసుకోవచ్చు. కానీ బీ2బీ (బిజినెస్ టు బిజినెస్) సరఫరాలలో కొంత సమస్య ఉంటుంది. కారణం ఒక్కొక్కసారి అడ్వాన్స్ ముందే రావచ్చు. అలాగే ఇన్వాయిస్ కూడా ముందే ఇవ్వవచ్చు లేదా సరఫరా జరిగిన తర్వాత పేమెంట్ అందవచ్చు. మరి అలాంటప్పుడు పైకం ముట్టిన తేదీ, ఇన్వాయిస్ తేదీ లేదా వాస్తవ సరఫరా జరిగిన తేదీ, దేని ప్రాతిపదికన పన్ను శాతం తీసుకోవాలి. ఇంకా చెప్పాలంటే సర్వీస్‌లకు సంబంధించి ఈ సమస్య కొంత అధికం. ఎందుకంటే సర్వీస్‌లకు సంబంధించి ఇన్వాయిస్ గరిష్ఠంగా నెల రోజుల వరకు ఇవ్వవచ్చు. ఉదాహరణకు ఏదేనీ సర్వీస్ సెప్టెంబరు 20న అందిస్తే అంటే పాత రేటు ఉన్న సమయంలో అందిస్తే, ఇన్వాయిస్ నెలలోపు అంటే కొత్త రేటు అమల్లోకి వచ్చిన తర్వాత ఇచ్చే సౌలభ్యం సర్వీస్ అందించే వ్యక్తికి ఉంటుంది. ఒక్కొక్కసారి పేమెంట్ ముందు తీసుకుని, సర్వీస్ తర్వాత ఇవ్వవచ్చు. దీన్ని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

ఒక వ్యక్తి ఒక హోటల్‌లో సెప్టెంబరు 25న రూమ్ కావాలని సెప్టెంబరు 1న ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాడు. రూమ్ రెంట్ రూ.5,000 కూడా అప్పుడే చెల్లించారు. అలాగే ఆ రోజు అమల్లో ఉన్న 12 శాతం ప్రకారం రూ.600 జీఎస్‌టీ కింద చెల్లించటం జరిగింది. కానీ, నిజానికి ఆ వ్యక్తి రూమ్‌ను వాడుకునే నాటికి పన్ను శాతం 12 నుంచి 5 శాతానికి తగ్గటం జరిగింది. మరి సదరు హోటల్ యాజమాన్యం ఎంత పన్ను చెల్లించాలి?

ఒక సరఫరాకు సంబంధించిన పన్ను ఎప్పుడు చెల్లించాలనేది జీఎస్‌టీ చట్టంలోని 'టైమ్ ఆఫ్ సప్లయ్' ప్రకారం ఉంటుంది. ఏదేనీ ఒక సరఫరాకు సంబంధించి పన్ను రేటులో తేడా ఉన్నప్పుడు ఏ రేటును పరిగణనలోకి తీసుకోవాలనేది కూడా ఈ టైమ్ ఆఫ్ సప్లయ్ ప్రకారం తెలుసుకోవచ్చు. దీని ప్రకారం వాస్తవ సరఫరా జరిగిన తేదీ, ఇన్వాయిస్ జారీ చేసిన తేదీ లేదా సంబంధిత మొత్తం ముట్టిన తేదీ...ఈ మూడింటిలో కనీసం రెండు ఏ పీరియడ్‌లో జరిగితే ఆ పీరియడ్‌లో ఏ రేటు అమల్లో ఉందో దానినే పరిగణనలోని తీసుకోవాలి. పైన చెప్పిన ఉదాహరణలో సరఫరా సెప్టెంబరు 25న..అంటే కొత్త పన్ను రేటు అమల్లోకి వచ్చిన తర్వాత జరుగుతుంది. అలాగే పేమెంట్ పాత పన్ను రేటు ఉన్న సమయంలో అంటే సెప్టెంబరు 22 కంటే ముందు జరిగింది. కాబట్టి ఇప్పుడు ఇన్వాయిస్ తేదీ అనేది కీలకం. ఒకవేళ ఇన్వాయిస్ కూడా సెప్టెంబరు 22 తర్వాతే ఇచ్చి ఉంటే అప్పుడు సరఫరా, ఇన్వాయిస్ రెండు కొత్త రేటు అమల్లోకి వచ్చిన తర్వాత జరిగాయి కాబట్టి అప్పుడు కొత్త రేటు అంటే 5 శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఎక్కువ వసూలు చేసిన మొత్తాన్ని హోటల్ యాజమాన్యం సదరు అతిధికి కచ్చితంగా వెనక్కు ఇచ్చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా ఇన్వాయిస్ కూడా పేమెంట్ అందిన తేదీన అంటే సెప్టెంబరు 1నే ఇచ్చి ఉంటే.. అప్పుడు పేమెంట్, ఇన్వాయిస్, సరఫరా ఈ మూడింటిలో రెండు పాత రేటు అమల్లో ఉన్న సమయంలో ఉన్నాయి కాబట్టి రూమ్ వాడుకున్నది సెప్టెంబరు 25నే అయినప్పటికీ సంబంధిత పన్ను రేటు ప్రకారం అంటే 12 శాతం చెల్లించాలి. ఒక్కొక్కసారి సరఫరా పాత రేటు ఉన్న సమయంలో జరిగి.. అంటే సెప్టెంబరు 22 కంటే ముందు జరిగి ఇన్వాయిస్ లేదా పేమెంట్ తర్వాత రావచ్చు. అప్పుడు కూడా ఇదే పద్ధతి అంటే ఈ మూడింటిలో కనీసం రెండు ఏ పక్కన ఉన్నాయో చూసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్

సంపాదించేటప్పుడే రిటైర్మెంట్ తర్వాత అవసరాల కోసం ప్లాన్ చేసుకోవాలి. ప్రణాళికాబద్ధంగా పెట్టుబడులతోనే మలి దశ జీవితానికి ఆర్థిక భరోసా. లేదంటే ఇబ్బందులు తప్పవు. రిటైర్మెంట్ ఆర్థిక భద్రతను ఎలా ప్లాన్ చేసుకోవచ్చనే వివరాలు మీకోసం..

రిటైర్మెంట్ పొదుపులో పొరపాట్లు వద్దు

జాగ్రత్త వహిస్తేనే మలిదశ జీవితానికి ఆర్థిక భరోసా



రెక్కాడేటప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలి. ఇందుకోసం నెలనెలా కొద్ది మొత్తంలోనైనా పొదుపు చేయాలి. తర్వాత ఆ సొమ్ముతో మన లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులుగా పెట్టాలి. ఇళ్లు, పొలాలతో పాటు బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో క్రమానుగత పెట్టుబడులు (సిప్) లేదా ఇతర పెట్టుబడి సాధనాల్లో మదుపు చేయాలి. ఇందుకు ముందుచూపుతో పాటు క్రమశిక్షణ కూడా అవసరం. ఈ విషయంలో చాలా మంది కొన్ని పొరపాట్లు చేస్తుంటారు. అవేంటంటే..

అవాస్తవ లక్ష్యాలు

తెలివైన రిటైర్మెంట్‌కు వాస్తవిక లక్ష్యాలే పునాది. చాలీచాలని జీతాలతో భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంటే అవి కలలుగానే మిగిలిపోతాయి తప్ప ఆచరణకు నోచుకోవు. కాబట్టి మన ఆదాయం, ఖర్చులను దృష్టిపెట్టుకుని పెట్టుబడులు ప్లాన్ చేసుకోవాలి.

ద్రవ్యోల్బణం

రిటైర్మెంట్ కోసం పొదుపు చేసే వారిలో చాలా మంది ద్రవ్యోల్బణం ప్రభావాన్ని సరిగా పట్టించుకోరు. ద్రవ్యోల్బణం పొదుపు విలువను ఏటేటా తగ్గిం చేస్తుంది. ఈ రోజు రూ.లక్ష ఉన్న పొదుపు విలువ, రిటైర్మెంట్ నాటికి బాగా తగ్గిపోతుంది. మంచి కంపెనీల షేర్లు, మంచి రాబడులు పంచుతున్న ఈక్విటీ పథకాల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టడం ద్వారా ద్రవ్యోల్బణం సెగ నుంచి తప్పించుకోవచ్చు.

అత్యవసర నిధి

ఏ సమయంలో ఎలాంటి ఆపద లేదా అవసరం వస్తుందో ఎవరూ చెప్పలేరు. అందుకే, అత్యవసర, ఆకస్మిక ఖర్చుల కోసం ప్రత్యేక నిధి తప్పనిసరి. కానీ, చాలా మంది ఇందుకోసం ప్రత్యేకంగా ప్లాన్ చేసుకోరు. దీర్ఘకాలిక పెట్టుబడి నుంచే ఈ ఖర్చులు భరిస్తారు. దాంతో రిటైర్మెంట్ పెట్టుబడులకు గండి పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి వ్యక్తి కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తాన్ని అత్యవసర నిధిగా పక్కన పెట్టుకోవాలి.

ఈపీఎఫ్ విత్‌డ్రాయల్స్

కొత్త ఇంటి కొనుగోలు, పిల్లల పెళ్లిళ్లు లేదా అత్యవసర వైద్య ఖర్చుల కోసం చాలా మంది తమ ఈపీఎఫ్ నుంచి కొంత మొత్తాన్ని మధ్యలోనే వెనక్కి తీసుకుంటూ ఉంటారు. ఇది ఏ మాత్రం మంచిది కాదు. ఈపీఎఫ్ పొదుపును రిటైర్మెంట్ తర్వాత ఏర్పడే అవసరాలు తీర్చే దీర్ఘకాలిక పెట్టుబడిగా చూడాలే తప్ప, స్వల్పకాలిక అవసరాలు తీర్చే పెట్టుబడిగా చూడకూడదు.

పీపీఎఫ్‌పై ఉపేక్ష

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) పెట్టుబడులు, రాబడులకు పూర్తి పన్ను మినహాయింపు ఉంటుంది. పైగా ఈ పెట్టుబడి మొత్తాల చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వ హామీ ఉంటుంది. అయితే వడ్డీ రేట్లు తక్కువనే కారణంతో చాలామంది దీన్ని పెద్దగా పట్టించుకోరు. ఉద్యోగం లేదా సంపాదన ప్రారంభమైన వెంటనే పీపీఎఫ్‌లో కొద్ది స్థాయిలోనైనా పెట్టుబడులు ప్రారంభిస్తే, రిటైర్ అయ్యే నాటికి ఎలాంటి పన్నుల భారం లేకుండా పెద్ద మొత్తంలో చేతికొస్తుంది. 15 సంవత్సరాల కాలపరిమితి ఉండే ఈ పథకంలో ఒక్కో వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.500 కనీస స్థాయి నుంచి రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

ఆరోగ్య బీమా

ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు పెద్దలు. సంపాదించేటప్పుడు వచ్చే ఆరోగ్య సమస్యల కంటే ఈ రోజుల్లో రిటైర్మెంట్ తర్వాత వచ్చే అనారోగ్య సమస్యలే జేబుకు ఎక్కువగా చిల్లు పెడతాయి. ఆర్జిస్తున్న సమయంలోనే వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడం మంచిది. కంపెనీ హెల్త్ పాలసీ ఉంది కదా అని నిర్లక్ష్యం చేస్తే.. రిటైర్మెంట్ తర్వాత వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీ కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. కాబట్టి ఎంత తక్కువ వయసులో వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీ తీసుకుంటే అంత తక్కువ ప్రీమియం పడుతుంది.

టర్మ్ పాలసీలపై నిర్లక్ష్యం వద్దు


ఒకవేళ మీకేదైనా జరిగితే, మీపై ఆర్థికంగా ఆధారపడిన కుటుంబసభ్యులు రోడ్డున పడాల్సిందే. ఆదాయానికి తగ్గట్టు కవరేజీ ఉండేలా టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడం ద్వారా ఈ పరిస్థితి నుంచి బయట పడవచ్చు. ఈ పాలసీ కవరేజీ మీ వార్షిక ఆదాయానికి కనీసం 10 నుంచి 15 రెట్లు ఉండేలా చూసుకోవాలి. అప్పులు, పిల్లల బాధ్యతలు తీరిన తర్వాత అవసరమనుకుంటే టర్మ్ పాలసీ కవరేజీ మార్చుకోవచ్చు.

సాగదీయ వద్దు

రిటైర్మెంట్ పెట్టుబడులను సంపాదన ప్రారంభించిన వెంటనే ఆరంభించాలి. ఎంత త్వరగా ప్రారంభిస్తే మీ పెట్టుబడుల విలువ అంత త్వరగా పెరుగుతుంది. ఉదాహరణకు పాతికేళ్ల వయసున్న వ్యక్తి నెలకు రూ.15,000తో ఈక్విటీ పథకాల్లో సిప్ ప్రారంభించాడనుకుందాం. ఈ పెట్టుబడులపై సగటున 12 శాతం రాబడులు వచ్చినా రిటైర్ అయ్యే నాటికి రూ.10 కోట్లు పోగై ఉంటుంది. అదే ఒక 10 సంవత్సరాలు ఆలస్యంగా ప్రారంభిస్తే నెలకు రూ.లక్ష చొప్పున పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

ఆస్తుల వివిధీకరణ

అన్ని గుడ్లు ఒకే బుట్టలో పెట్టకూడదనేది సామెత. ఇది రిటైర్మెంట్ పెట్టుబడులకూ వర్తిస్తుంది. రుణ పత్రాల్లో పెట్టుబడులు స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చినా.. ద్రవ్యోల్బణం ఆ రాబడులను మింగేస్తుంది. దీర్ఘకాలంలో మన పెట్టుబడులు ద్రవ్యోల్బణానికి మించి రాబడులు ఇవ్వాలంటే మంచి కంపెనీల ఈక్విటీ షేర్లు లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాల్లోనూ మదుపు చేయాలి. ఇదంతా ఎందుకనుకుంటే ఈక్విటీ, రుణ పత్రాలు, బంగారం, వెండిలో సమానంగా మదుపు చేయడం మంచిది. ఇది కూడా మా వల్ల కాదనుకుంటే మ్యూచువల్ ఫండ్ సంస్థలు.. మల్టీ అసెట్ ఫండ్స్ పేరుతో ప్రత్యేక పథకాలు అందిస్తున్నాయి. మంచి రాబడులు అందించడంతో ఇటీవల ఈ ఫండ్స్ మంచి ఆదరణ పొందుతున్నాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,07,620 ▲	98,650 ▲	1,36,500 ▼
విజయవాడ	1,10,800 ▲	1,06,000 ▲	1,27,700 ▲
విశాఖపట్నం	1,08,490 ▼	99,450 ▲	1,38,000 ▲
రాజమండ్రి	1,08,490 ▲	99,450 ▲	1,27,600 ▲
ప్రొద్దుటూరు	1,10,700 ▲	1,01,480 ▲	1,27,500 ▲
ముంబై	1,06,338 ▲	97,406 ▲	1,23,170 ▼

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బీఎస్ఈ ఇండియా సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఆర్థిక రంగంలోని విభిన్న, ప్రముఖ సంస్థల్లో పెట్టుబడులు పెట్టే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. బీఎస్ఈ ఇండియా సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఈ ఫండ్‌కు బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. సిప్ రూపంలో అయితే రూ.500. ముగింపు తేదీ ఈ నెల 17.



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	108	విజయవాడ	132
వరంగల్	108	గుంటూరు	120
కరీంనగర్	108	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	108	చిత్తూరు	95
కర్నూలు	108	నెల్లూరు	100
విశాఖపట్నం	136	అనంతపురం	100
గోదావరి	132		



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	545
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

డ్రగ్స్ తయారీ

గుట్టురట్టు

- చర్లపల్లిలో 5.79 కిలోల మెఫెడ్రోన్ స్వాధీనం
- నార్కోటిక్స్ బ్యూరో, మహారాష్ట్ర పోలీసుల ఆపరేషన్
- బంగ్లాదేశీయురాలు సహా 12 మంది అరెస్టు



మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

హైదరాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అత్యవసర మందుల తయారీ మాటున చర్లపల్లి పారిశ్రామిక వాడలో ప్రమాదకరమైన మెఫెడ్రోన్(మ్యావ్‌మ్యావ్-ఎండీఎంఎ) మత్తుమందును తయారు చేస్తున్న ఫ్యాక్టరీ గుట్టును మహారాష్ట్ర పోలీసులు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) అధికారులు రట్టుచేశారు. భారీఎత్తున మెఫెడ్రోన్ మత్తుమందును స్వాధీనం చేసుకుని.. వేర్వేరు ప్రాంతాల్లో ఒక బంగ్లాదేశీ యువతి సహా.. 12 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను మహారాష్ట్రలోని మీరా భయాండర్-వాసాయ్ విహార్(ఎంబీవీవీ) పోలీసులు ఓ ప్రకటన ద్వారా విడుదల చేశారు. కాశీమీరా ఏరియాలో గత నెల 8న అనుమానాస్పదంగా కనిపించిన 23 ఏళ్ల యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 105 గ్రాముల మెఫెడ్రోన్(విలువ రూ.23.97 లక్షలు) లభించింది. ఆమెను బంగ్లాదేశ్‌కు చెందిన ఫాతిమా మురాద్ షేక్ అలియాస్ మొల్లాగా గుర్తించారు. రెహ్మాన్ షేక్ ఆమెకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించి, అతణ్ని అరెస్టు చేశారు. రెహ్మాన్ షేక్ ఇచ్చిన సమాచారం ఆధారంగా మెఫెడ్రోన్ దేశవ్యాప్తంగా సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. దీంతో మహారాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. మత్తుమందు క్రయవిక్రయాలతో సంబంధమున్న గ్యాంగులోకి తమ మనుషులను ప్రవేశపెట్టారు. రెహ్మాన్ షేక్‌తో కలిసి.. ఆ గ్యాంగు ద్వారా.. మహారాష్ట్రలోని 60 చోట్ల దాడులు చేసి, మత్తుమందుల రవాణాలో సంబంధం ఉన్న జావీద్, మహమ్మద్ ఫహీమ్, ఫిరోజ్, ముస్తఫా యూనస్ ఖాన్, ఇమ్రాన్, సలీంలను అరెస్టు చేసి, 178 గ్రాముల మెఫెడ్రోన్(విలువ రూ.23.97 లక్షలు) సీజ్ చేశారు. ఇదే ముఠాపై జరిపిన దాడిలో మరోచోట రూ.23.97 లక్షలు విలువ చేసే 178 గ్రాముల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చర్లపల్లి ప్రాంతంలో రెక్కీ నిర్వహించి, శుక్రవారం భారీ ఆపరేషన్ చేపట్టారు. స్థానిక నవోదయకాలనిలో ఉన్న వాగ్దేవి లాబ్స్‌పై దాడి, చేసి కంపెనీ యజమాని, ఐటీ నిపుణుడు శ్రీనివాస్ విజయ్ ఒలేటీతోపాటు తానాజీ పండరీనాథ్ పట్వారీని అరెస్టు చేశారు. వాగ్దేవి ల్యాబ్స్‌లో అత్యంత ఆధునిక యంత్ర పరికరాలను గుర్తించారు. చర్లపల్లిలో స్వాధీనం చేసుకున్న ముడిసరుకుతో సుమారు 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను తయారు చేయవచ్చని ఎన్సీబీ పేర్కొంది.

పన్ను సరళీకరణ.. అందరికీ ఉపయోగమే

(మొదటి పేజీ తరువాయి)

వాటిని రోజువారీ వినియోగ వస్తువుల కోణంలో క్రోడీకరించారు. మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా పేదలు వినియోగించే వస్తువులు, రైతులను ప్రభావితం చేసే వస్తువులపై ఎక్కువగా దృష్టిసారించారు. మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న దశ నుంచి వికసిత్ భారత్ దిశగా వెళ్లేందుకు కొత్త పన్ను రేట్లు దోహదపడే అవకాశముంది. టూత్ పేస్ట్ నుంచి వెన్న, జున్ను, కండెన్స్‌డ్ మిల్క్, పాస్తా, ప్యాక్ చేసిన కొబ్బరి నీళ్లు, గింజలు, ఖర్జూరాలు, సాస్‌లు, ఎయిర్ కండిషనర్లు, టీవీ సెట్‌లు, చిన్న కార్లు, బైక్‌లు, బ్యాండేజీలు, డయాగ్నస్టిక్ కిట్‌లు వంటివాటి దాకా వినియోగ వస్తువులపై తక్కువ పన్ను రేట్లు ఉంటాయి. ఇవన్నీ ప్రజలకు నేరుగా పన్ను ప్రయోజనాలు అందించేవే.

పన్ను తగ్గింపు ప్రయోజనాలు పరిశీలించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

కొత్త ధరలు సెప్టెంబరు 22 నుంచి అమలయ్యేలా కంపెనీలు తమ వ్యవస్థల్లో మార్పులు చేయాలి. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జీఎస్టీ రేటు తగ్గింపు ప్రయోజనాలను బదిలీ చేయడానికి వివిధ మంత్రిత్వ శాఖలతో కలిసి పని చేస్తున్నారు. పన్నుల తగ్గింపునకు ముందు, తరువాత ధరల స్థితిని జీఎస్టీ విభాగం నిశితంగా పరిశీలిస్తోంది. తగ్గిన పన్ను ప్రయోజనాలు వినియోగదారులకు అందివ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

రిటైల్ వ్యాపారులు పాత బిల్లులతో అంటే 28 శాతం బిల్లుల ఇన్‌పుట్ సరుకు లేకుండా తీసుకుని.. సెప్టెంబరు 22 తరువాత వాడుకునే అవకాశముందా?

పన్ను చెల్లింపుదారులు వస్తువులు లేదా సేవల వాస్తవ సరఫరా లేకుండా పన్ను ఇన్వాయిస్ జారీ చేస్తుంటే అవి నకిలీ ఇన్వాయిస్‌లు అవుతాయి. అటువంటి ఇన్వాయిస్‌లను గ్రహీతలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందలేరు.

చిరు వ్యాపారులు, ఎంఎస్‌ఎంఈలకు ఈ పన్నుల తగ్గింపు ఉపయోగపడుతుందా?

ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం, వేగవంతమైన పన్ను వాపసు ద్వారా దేశీయ డిమాండ్‌ను పెంచడం వల్ల.. ఎంఎస్‌ఎంఈ నిర్వాహకులకు ప్రయోజనాలు కలుగుతాయి. వారిలో మరింత పోటీతత్వం పెరుగుతుంది.

ఎంత మంది స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తారు?

పన్ను రేట్లను తగ్గించడం సాధారణంగా పన్ను సమ్మతి ని మెరుగుపరుస్తుంది. పన్ను రిటర్నుల్లో నిజాయితీని పెం చుతుంది, ఎగవేతలను తగ్గిస్తుంది.

ఏయే రంగాలపై ప్రభావం ఎక్కువ?

రూ.2,500 కంటే ఎక్కువ విలువైన వస్త్రాల ఖరీదు మరింత పెరుగుతుంది. ఎంఎంఎఫ్ ఫైబర్, నూలుపై పన్నును 18%, 12% నుంచి 5శాతానికి తగ్గించడం వల్ల వేలాది మంది స్పిన్నర్లు, నేత కార్మికుల మూలధన పెట్టుబడి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఎంఎస్‌ఎంఈ రంగంలో 70%-80% వస్త్ర, దుస్తుల యూనిట్లు ఉన్నందున, ఆర్థిక ఒత్తిళ్లను తగ్గిస్తుంది.

ఈ తగ్గింపు వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుందా?

2023-24 జీఎస్టీ ఆదాయ వివరాల ఆధారంగా.. వార్షిక ప్రాతిపదికన జీఎస్టీ పన్నుల హేతుబద్ధీకరణ నికర ఆర్థిక ప్రభావం రూ.48,000 కోట్లుగా ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. దీనిపై ఎస్‌బీఐ నివేదిక, హెచ్‌ఎస్‌బీసీ ఇచ్చిన నివేదిక.. రెండూ జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రభుత్వం స్వల్పకాలిక ఆదాయ నష్టాన్ని ఎదుర్కొంటుందని చెప్పాయి. అయితే వినియోగం పెరగడం ద్వారా పన్నుల చెల్లింపుల శాతం పెరుగుతుందని సూచించాయి.

భవిష్యత్తులో మరోసారిశ్లాబులు మారే అవకాశం ఉందా?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక పరోక్ష పన్నుల విధానంలో చేపట్టిన అతిపెద్ద సంస్కరణ.. జీఎస్టీ. పన్నుల వ్యవస్థను పర్యవేక్షించడం ద్వారా అవసరమైన సమయంలో మార్పులు తీసుకురావడం అనేది నిరంతర ప్రక్రియ. ద్రవ్యోల్బణం, పన్నుల భారాన్ని దృష్టిలో ఉంచుకుని జీఎస్టీ రిజిస్ట్రేషన్ పరిమితిని సమీక్షించాల్సిన అవసరం ఉంది.

ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ప్రభావం ఎంత?

రోజువారీ వస్తువులపై తక్కువ పన్ను విధించడంతో, అమ్మకాల పరిమాణం పెరుగుతుంది. ఎఫ్‌ఎంసీజీ కంపెనీ లు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది. ఆటోమొబైల్ రంగంలో.. చిన్న కార్లు, ద్విచక్ర వాహనాలు, విడిభాగాలు తక్కువ ధరలకే అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే టాటా మోటార్స్ తన కార్ల ధరలను రూ.1,55,000 వరకూ తగ్గించింది. జీఎస్టీ తగ్గింపుతో.. ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశీయ ఉత్పత్తి మెరుగవుతుంది.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

సైమా విజేతలు

● సత్తా చాటిన 'పుష్ప 2'.. 'కల్కి'



అశ్వనీదత్, కమల్ హాసన్



రష్మికకు అవార్డు అందిస్తున్న సుమలత



భాగ్యశ్రీ బోర్సేకు అవార్డు అందిస్తున్న ఖుష్బూ

దుబాయ్ వేదికగా 13వ 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ (సైమా) వేడుక ఘనంగా జరిగింది. తొలి రోజు తెలుగు, కన్నడ చిత్రాలకు అవార్డులు అందజేసి విజేతలను ప్రకటించారు. ఉత్తమ చిత్రంగా 'కల్కి 2898 ఏడీ' ఎంపికైంది. ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా రష్మిక అవార్డులను అందుకున్నారు. ఉత్తమ దర్శకుడిగా సుకుమార్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఉత్తమ సహాయ నటుడిగా అమితాబ్ బచ్చన్, ఉత్తమ ప్రతినాయకుడిగా కమల్ హాసన్ అవార్డులను కైవసం చేసుకున్నారు. ఉత్తమ నటుడిగా తేజ సజ్జా, ఉత్తమ నటిగా మీనాక్షీ చౌదరి, ఉత్తమ దర్శకుడిగా ప్రశాంత్ వర్మ క్రిటిక్స్ విభాగంలో పురస్కారాలు దక్కించుకున్నారు. నిర్మాత అశ్వనీదత్‌ను ప్రైడ్ ఆఫ్ తెలుగు సినిమా అవార్డు వరించింది. ఉత్తమ నూతన నిర్మాతగా నిహారిక, ఉత్తమ నూతన నటిగా భాగ్యశ్రీ బోర్సే అవార్డు అందుకున్నారు. 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ చిత్రాలు' అత్యధిక అవార్డులతో సత్తా చాటాయి.



అల్లు అర్జున్, రాక్‌లైన్ వెంకటేశ్



సతీమణి తబితతో సుకుమార్



నిహారిక, సుమలత, మీనాక్షీ చౌదరి

యాక్షన్ అడ్వంచర్‌గా తీర్చిదిద్దాం

కార్తీక్ ఘట్టమనేని



'చిన్నప్పటి నుంచి వింటున్న పురాణ, ఇతిహాస గాథలే 'మిరాయ్' సినిమాకు స్ఫూర్తి. మన మూలాలున్న కథ కాబట్టి ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. సినిమా అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అని దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చెప్పారు. తేజ సజ్జా కథానాయకుడిగా కార్తీక్ తెరకెక్కించిన చిత్రమిది. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కార్తీక్ మీడియాతో ముచ్చటించారు.

- మన సాంస్కృతిక మూలాలను స్పృశిస్తూ సాగే ఓ సూపర్ హీరో గాథగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం. మానవాళి మనుగడకు వచ్చే ముప్పునకు పరిష్కారం పురాణేతిహాసాల్లో ఉంటుందనే లైన్ చుట్టూ అల్లుకున్న కథ ఇది. యాక్షన్ అడ్వంచర్‌గా తీర్చిదిద్దాం. నటీనటులందరినీ రియల్ లొకేషన్లకు తీసుకెళ్లి చిత్రీకరణ చేశాం. దేశ విదేశాల్లోని ఎడారులు, అడవులు, మంచుపర్వతాల్లో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి చిత్రీకరణ చేశాం. ఇందులో చైనీస్ చిత్రాల తరహాలో ఫాస్ట్ యాక్షన్‌ను ట్రై చేశాం.
- తేజ ఈ సినిమా కోసం థాయ్‌లాండ్‌లో యుద్ధ విద్యల్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అలాగే మనోజ్‌కు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం ఉండడంతో ప్రతినాయక పాత్రకు ఆయన్ను తీసుకున్నాం.

హాలీవుడ్ సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది

సాహు గారపాటి



'కిష్కింధపురి' లాంటి హారర్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రాలేదు. ప్రేక్షకులు కచ్చితంగా థ్రిల్ అవుతారు. వారిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే అంశాలు చాలా ఉన్నాయి. హాలీవుడ్ సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది' అని నిర్మాత సాహు గారపాటి అన్నారు. ఈ నెల 12న విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- చాలా ఇంట్రస్టింగ్ హారర్ బ్యాక్‌డ్రాప్ ఉన్న కథ ఇది. ఇప్పటివరకూ హారర్ జానర్‌లో చాలా కథలు వచ్చాయి. కానీ ఇది సరికొత్తగా ఉంటుంది. ఒక రేడియో నుంచి వచ్చే వాయిస్, దాని చుట్టూ ఉండే హారర్ ఎలిమెంట్స్ ఆధారంగా దర్శకుడు అద్భుతంగా మలిచారు. ద్వితీయార్థంలో సినిమా సీరియస్ హారర్ ఫిల్మ్‌గా టర్న్ అవుతుంది.
- సాయి శ్రీనివాస్‌కు ఇది తొలి హారర్ చిత్రం. తన నటనతో కథకు పూర్తి న్యాయం చేశారు. కౌశిక్ కథను అద్భుతంగా చెబుతాడు. మోడరన్ ఫిల్మ్ మేకింగ్ స్టైయిల్‌తో సినిమాని తీశారు. అనుపమా పరమేశ్వరన్‌కు చాలాకాలంగా ఓ హారర్ సినిమా చేయాలనుంది. ఈ కథ వినగానే ఓకే చెప్పారు. బాలకృష్ణగారు, అనిల్ రావిపూడి కలయికలో ఓ సినిమా చేయాలనుకుంటున్నాం.

దర్శకుడి సృజనాత్మకతను అర్థం చేసుకోవాలి

డీవోపీ జగదీష్



'చిత్ర దర్శకుడితో డీవోపీ బాగా కనెక్ట్ అవ్వాలి. ఆయన సృజనాత్మకతను అర్థం చేసుకోవాలి. అప్పుడే సినిమా అద్భుతంగా తెరకెక్కుతుంది' అని అన్నారు కెమెరామెన్ జగదీష్ చీకటి. ఆయన డీవోపీగా వ్యవహరించిన 'అర్జున్ చక్రవర్తి' సినిమా ఇటీవలె విడుదలై విజయవంతంగా థియేటర్లలో నడుస్తోంది. ఈ సందర్భంగా జగదీష్ చిత్ర విశేషాలను మీడియాకు వివరించారు. 'మన దేశంలో కూడా గొప్ప సాంకేతిక నిపుణులు ఉన్నారు. హాలీవుడ్ స్థాయికి దీటుగా మనం సినిమాలు తీస్తున్నాం. 'అర్జున్ చక్రవర్తి' కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది. సౌండ్ అయినా, సినిమాటోగ్రఫీ అయినా దర్శకుడి విజన్‌కు తగ్గట్టుగా ఉండాలి' అని అన్నారు.

నవ్వుల విందు



కథానాయకుడిగా తన పంథా మార్చిన అల్లరి నరేశ్ కొన్నాళ్లుగా సీరియస్ కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఆయన తనదైన శైలిలో ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమవుతున్నారు. అల్లరి నరేశ్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం (నరేశ్ 65 - వర్కింగ్ టైటిల్) శనివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బేనర్స్‌పై రాజేశ్ దండ, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. చంద్రమోహన్ దర్శకుడు. ముహూర్తపు షాట్‌కు హీరో నాగచైతన్య క్లాప్ ఇచ్చారు. దర్శకుడు బాబీ కెమెరా స్విచ్చాన్ చేశారు. వీఐ ఆనంద్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ కథ ఆద్యంతం హాస్యంతో నవ్విస్తుంది, అల్లరి నరేశ్ సరికొత్త పాత్రలో అలరిస్తారు అని దర్శకుడు చెప్పారు. వెన్నెల కిశోర్, నరేశ్ వీకే, శ్రీనివాస్‌రెడ్డి కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: రాంరెడ్డి



ఘనవిజయం సాధించాలి

వీవీ వినాయక్

రవిప్రకాశ్, శివకుమార్, చరిష్మా శ్రీకర్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'విద్రోహి'. వీఎస్‌వీ దర్శకత్వంలో విజ్జన వెంకటసుబ్రహ్మణ్యం నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి తొలి పాటను దర్శకుడు వీవీ వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మంచి కథతో తెరకెక్కుతున్న చిత్రమిది. సినిమా ఘనవిజయం సాధించాలి' అని కోరారు. 'ఇప్పటి వరకూ రాని సరికొత్త పాయింట్‌తో రూపొందుతోన్న క్రైమ్ థ్రిల్లర్ ఇది' అని వీఎస్‌వీ చెప్పారు.

వివిధ ప్రాజెక్టుల్లో ప్రస్తుతం నీటి నిల్వల వివరాలు ఇవీ..

ప్రాజెక్టు	గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	నిల్వ శాతం	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	అవుట్ ఫ్లో (క్యూసెక్కులు)
ఆల్మట్టి	129.72	128.01	98.68	78,000	85,385
నారాయణపూర్	37.64	37.19	98.82	87,000	86,482
జూరాల	9.66	8.97	92.85	1,10,500	99,315
తుంగభద్ర	105.79	79.8	75.43	44127	40604
సుంకేశుల	1.24	1.24	100	40000	38458
శ్రీశైలం	215.81	210.51	97.55	122900	129266
నాగార్జునసాగర్	312.05	310.85	99.62	54656	54656
పులిచింతల	45.77	43.45	94.93	35450	34397
ప్రకాశం బ్యారేజీ	3.07	3.07	100	62347	62347
గొట్టా బ్యారేజీ	0.66	0.66	100	13609	13609
ధవళేశ్వరం బ్యారేజీ	2.93	2.93	100	771621	771621
ఏలేరు రిజర్వాయరు	24.11	15.09	62.59	2002	975

నిండు కుండల్లా జలాశయాలు

- తగిన వర్షాలు లేకున్నా ఎగువ నుంచి భారీగా వరద
- కాలువల ద్వారా చెరువులు నింపేందుకు ప్రయత్నాలు
- పంటలు పండుతాయని రాష్ట్ర రైతుల్లో ఆశాభావం

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవకున్నా .. ప్రధాన జలాశయాలు నిండు కుండల్లా మారాయి. ప్రధాన జలాశయాల్లోకి వస్తోన్న వరదను కాలువల ద్వారా చెరువులను నింపేందుకు వదులుతున్నా.. ఇంకా పెద్దమొత్తంలో కృష్ణా, గోదావరి జలాలు సముద్రంలోకి తరలిపోతూనే ఉన్నాయి. శనివారం దాకా సముద్రంలోకి 717 టీఎంసీల కృష్ణా జలాలు తరలిపోయాయి. గోదావరి జలాలు కూడా వచ్చిన వరద వచ్చినట్లుగానే కడలిపాలవుతున్నాయి. రాష్ట్ర ప్రధాన ప్రాజెక్టులు శ్రీశైలంలో 97.55 శాతం(210.51 టీఎంసీలు), నాగార్జునసాగర్‌లో 99.62 శాతం(310.85 టీఎంసీలు) మేర జలాలు నిల్వ ఉన్నాయి. రుతు పవనాల ప్రభావంతో రాష్ట్రంలో పెద్దగా వర్షాలు లేకపోయినా.. ఎగువ నుంచి వస్తోన్న వరద వల్ల రాష్ట్రంలోని జలాశయాల్లో నీళ్లు కనిపిస్తుండటంతో .. రైతుల్లో పంటలు పండుతాయన్న ఆశలు కనిపిస్తున్నాయి.

నిలకడగా గోదావరి నీటిమట్టం


పోలవరం/వేలేరుపాడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు వద్ద భారీగా పెరిగిన గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్టు నుంచి 8,06,738 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 37.50 మీటర్లకు తగ్గింది.

ఉత్తర కోస్తాలో వానలు.. దక్షిణ కోస్తాలో భగభగలు

- బాపట్లలో 38.8, కావలిలో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్రకు ఆనుకుని వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో శనివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది రెండు, మూడు రోజులు స్థిరంగా కొనసాగి, ఆ తర్వాత అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆవర్తనం ప్రభావంతో ఉత్తర కోస్తాలో శనివారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. దక్షిణ కోస్తాలో మాత్రం ఎండ ఠారెత్తించింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. బాపట్లలో 38.8, కావలిలో 38.1, నెల్లూరులో 37.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, దక్షిణ కోస్తాలో ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనం ఈనెల తొమ్మిదో తేదీ తర్వాత బలపడే అవకాశం ఉన్నందున 10 నుంచి 12వ తేదీ వరకు కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

పత్తి రైతుపై తేమ కత్తి



- 12 శాతం దాటితే కొనుగోలు చేసేది లేదన్న సీసీఐ
- రూల్స్ కఠినతరం చేస్తూ ఆదేశాలు
- నవంబరు, డిసెంబర్లలో రాష్ట్రంలో వరుస తుఫాన్లు
- తేమ శాతం తగ్గించడం ఏపీలో అసాధ్యం

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

పత్తి సీజన్ ఆరంభానికి ముందే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) బాంబు పేల్చింది. పత్తిలో తేమ 12 శాతానికి మించితే కొనుగోలు చేసే ప్రసక్తి లేదని స్పష్టం చేసింది. ఈ ఏడాది ఈ నిబంధనను మినహాయింపులు లేకుండా అమలు చేస్తామని పేర్కొంది. తేమ శాతం 8 నుంచి 12 మధ్య ఉంటేనే కొనుగోలు చేస్తామన్న నిబంధనను ఐదారు సంవత్సరాల క్రితమే సీసీఐ అమలులోకి తెచ్చింది. స్థానిక ప్రభుత్వాల ఒత్తిళ్లతో నిబంధన సడలింపుపై ఎక్కడికక్కడ నిర్ణయం తీసుకుంటోంది. గత ఏడాది రాష్ట్రంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విజ్ఞప్తితో నిబంధనను సడలించి పత్తిని కొనుగోలు చేశారు. ఈ సడలింపులతో పక్క రాష్ట్రాల్లో ఇబ్బందులు తలెత్తాయని సీసీఐ అధికారులు అంటున్నారు. దీంతో నిబంధనను తప్పనిసరి చేసినట్లు చెపుతున్నారు. ఇది రాష్ట్ర రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. భౌగోళిక, వాతావరణ పరిస్థితుల రీత్యా మిగిలిన రాష్ట్రాలతో ఏపీకి పొంతన ఉండదని రైతులు వివరిస్తున్నారు. పత్తి చేతికి వచ్చే సమయానికి రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయి. తుఫాన్లు వణికిస్తుంటాయి. ఐదేళ్ల ప్రమాణికంగా తీసుకున్నా అదే విషయం స్పష్టం అవుతుంది. పూర్తిగా తడిచిన పంటను తీసిన తర్వాత ఆరబెట్టటానికి సౌకర్యాలు సరిగా లేకపోవడంతో రైతులు హడావిడిగా అమ్మేస్తూ ఉంటారు. దీన్ని ఆసరా చేసుకొని వ్యాపారులు పత్తి ధరను పూర్తిగా తగ్గించి కొనుగోలు చేస్తూ ఉంటారు. ఈ పరిస్థితిలో సీసీఐ ఇచ్చే మద్దతు ధర రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ ఏడాది క్వింటా పత్తి ధర రూ.8,110 (మొదటి శ్రేణి), దిగువ శ్రేణి నాణ్యత కలిగిన పత్తికి రూ.7,710గా మద్దతు ధర నిర్ణయించారు. రాష్ట్రంలో అక్టోబరు 15 తర్వాత సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవనున్నారు. ఈ నేపథ్యంలో సీసీఐ నిబంధన సడలింపునకు ఇప్పటి నుంచే కృషి చేయాలని, లేకపోతే వ్యాపారుల చేతిలోపడి పూర్తిగా మునిగిపోతామని రైతాంగం గగ్గోలు పెడుతోంది.

11న సీసీఐ సీఎండీతో సమావేశం?

సీసీఐ నిబంధనలు కఠినతరం చేయడంపై జిన్నింగ్ మిల్లుల యజమానులు ఆగ్రహంగా ఉన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పిలిచిన టెండర్లను దేశవ్యాప్తంగా బహిష్కరించారు. రాష్ట్రంలోనూ ఇందుకు భిన్నంగా లేదు. ఈ పరిణామంతో ఖంగుతిన్న సీసీఐ జిన్నింగ్ యజమానుల సంఘాలతో ఈ నెల 11న సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. అన్ని రాష్ట్రాల అసోసియేషన్లు పాల్గొనే ఈ కీలక సమావేశంలో సీసీఐ సీఎండీ పాల్గొంటారని సమాచారం.


ఇవేం ఉల్లిపాయలు బాబోయ్!

రైతుబజార్లకు నాణ్యత లేని సరుకు సరఫరా

- కిలో రూ.18కి అమ్మాలని సిబ్బందికి ఆదేశం
- తోపుడుబండ్లపై కేజీ రూ.10- 15 మాత్రమే
- చిన్నసైజు పాయలపై ఆసక్తి చూపని జనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రైతుబజార్లలో అమ్ముతున్న ఉల్లిపాయల నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నపిల్లలు ఆడుకొనే గోలీకాయల పరిమాణంలో ఉన్న నాణ్యత లేని సరుకును కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. రైతులకు న్యాయం చేయడం కోసం నాణ్యత లేని ఉల్లిని రైతు బజార్లలో విక్రయించడం ఏమిటని మండిపడుతున్నారు. గత కొద్ది రోజులుగా కర్నూలు మార్కెట్ యార్డుకు ఇబ్బడిముబ్బడిగా ఉల్లి దిగుమతులు వస్తున్నాయి. అయితే క్వింటా రూ.600కు మించి పలక్కపోవడంతో రైతులు కుదేలయ్యారు. ఈ పరిస్థితిని గమనించిన సీఎం చంద్రబాబు... ఉల్లి రైతులను ఆదుకోవడానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. క్వింటా కనీస మద్దతు ధర రూ.1,200గా నిర్ణయించారు. అయితే అధికారులు మాత్రం అత్యుత్సాహంతో నాణ్యత లేని సరుకును వినియోగదారులకు అంటగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ, మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం ఉల్లిని కొనుగోలు చేస్తోంది. ఈ నెల 1 వరకు 580 టన్నులు, 2నుంచి శనివారం వరకు 1,650 టన్నుల మేర కొనుగోలు చేశారు. క్వింటా రూ.1,200 చొప్పున కొనుగోలు చేస్తున్న మార్క్‌ఫెడ్ అధికారులు సెకండ్, థర్డ్ క్వాలిటీ (ద్వితీయ, తృతీయ రకాలు) ఉల్లిని కూడా అదే ధరకు సేకరిస్తున్నారు. వాటిని కిలో రూ.18 చొప్పున విక్రయించాలని రైతుబజార్లకు పంపుతున్నారు. రవాణా, కూలీ ఖర్చులు కలుపుకుని, కిలో రూ.15 చొప్పున తిరిగి చెల్లించాలని ఆదేశిస్తున్నారు. మొన్నటివరకూ కిలో రూ.14-15కు అమ్మిన ఉల్లి ఇప్పుడు రూ.18 అంటే ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని రైతుబజార్ల సిబ్బంది చెబుతున్నారు. లావుగా ఉన్నవి ఏరుకొని, సన్నటివి వదిలేస్తుండటంతో వాటికి తామే డబ్బు కట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. నాణ్యమైన ఉల్లి రూ.100కు నాలుగైదు కిలోలు చొప్పున వీధుల్లోనే అమ్ముతున్నారని, సాంబారులో వాడే సైజు పాయలు కిలో రూ.18 చెబితే ఎవరూ కొనడం లేదంటున్నారు. చిన్న పాయలను తోపుడు బండ్లపై కిలో రూ.10-15కే ఇస్తున్నారని వినియోగదారులు పేర్కొంటున్నారు.



రైతుబజార్లలో విక్రయిస్తున్న నాణ్యత లేని ఉల్లిపాయలు

‘టెక్సోనా’లో మహిళా శక్తి

కడప గడపన గార్మెంట్స్ పరిశ్రమ.. ప్రస్తుతం 600 మందికి ఉపాధి.. 97 శాతం మంది మహిళలే.. అందరూ స్థానికులే

- మరో 1500 మందికి అవకాశాలు
- రెడీమేడ్ దుస్తుల తయారీ
- యూరప్, అమెరికా, జపాన్‌కు ఎగుమతి





ఈస్ట్‌మన్ మిషన్‌పై వస్త్రాల కటింగ్.. ఐరన్.. పార్సిల్ చేస్తున్న సిబ్బంది

(కడప-ఆంధ్రజ్యోతి)

అది... కడప నగర శివారు ఉన్న కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్. ఇందులో ఇటీవల ఏర్పాటైన టెక్సోనా రెడీమేడ్ దుస్తుల పరిశ్రమకు వెళ్తే.. సెక్యూరిటీ గార్డులు, ఎలక్ట్రీషియన్లతో పాటు అతి కొద్ది మంది ఉద్యోగులు మినహా అక్కడంతా మహిళలే కనిపిస్తారు. ఈ పరిశ్రమలో ప్రస్తుతం 600 మంది పనిచేస్తుండగా.. వారిలో 97 శాతం మహిళలు ఉన్నారు. ప్రాంగణమంతా మహిళలతో కిటకిటలాడుతోంది. అందరూ స్థానికులే. వారు కుట్టిన దుస్తులు యూరప్, అమెరికా, జపాన్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. సుమారు 17.50 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన టెక్సోనా మొదటి ఫేజ్‌ను ఈ నెల 2న మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ పరిశ్రమ మొత్తం 2100 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఇంకా 1500 మంది మహిళలకు ఉపాధి అవకాశాలున్నాయి. పనిచేయడానికి ఆసక్తి గల మహిళలు పరిశ్రమ పనివేళల్లో వచ్చి సంప్రదించవచ్చునని టెక్సోనా ప్రతినిధులు తెలిపారు. ఈ గార్మెంట్ పరిశ్రమ గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

స్థానికులకే ఉపాధి

కొన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యాక చిన్న చిన్న ఉద్యోగాలు మినహాయిస్తే ఎక్కువగా ఉత్తరాది వాళ్లకే ఇచ్చేవారు. కొప్పర్తి టెక్సోనాలో మాత్రం అంతా స్థానికులే. కడప నుంచి చుట్టూ 45 కి.మీ. దూరంలో ఉన్న మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. కడప, కమలాపురం, పులివెందుల, మైదుకూరు, రాజంపేట నియోజకవర్గాలకు చెందినవారు పనిచేస్తున్నారు. రోజూ కమలాపురం, వేంపల్లె, మైదుకూరు, ఖాజీపేట, జీవీ సత్రం, సిద్దవటం, ఒంటిమిట్ట తదితర మండలాలకు చెందిన మహిళలు వస్తున్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తారు. వీరికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. ఆదివారంతో పాటు ప్రభుత్వ సెలవు దినాలన్నీ వర్తిస్తాయి. టైలరింగ్ చేసే మహిళలకు నెలకు రూ.10 వేలు, నాన్ టైలరింగ్ అంటే.. వాషింగ్, చెకింగ్ ఇతర పనులకు రూ.9,600 వేతనం ఇస్తారు. ఇంపోర్టెడ్ కంపెనీల వారిచ్చిన దుస్తులను వారు సూచించిన డిజైన్ల ప్రకారం కుట్టాలి. దీనికోసం 45 రోజుల పాటు బెంగళూరు, చెన్నైకి చెందిన నిపుణులతో ఇక్కడే శిక్షణ ఇప్పిస్తారు. శిక్షణ సమయంలో రూ.2,500 స్టైఫండ్ ఇస్తారు. శిక్షణ పూర్తయిన తరువాత వేతనం అమలవుతుంది. ఈఎస్ఐ, పీఎఫ్ ఇతర సదుపాయాలు ఉంటాయి. ఇక ఏటా జీతం పెంపు, దీపావళికి బోనస్ ఉంటాయి.

రోజుకు 15 వేల పీస్‌ల తయారీ

టెక్సోనాలో అత్యాధునికమైన కుట్టుమిషన్లు, వాషింగ్ మిషన్లు, డ్రయర్స్ ఉన్నాయి. ఒక్కోటి సుమారు రూ.25 లక్షల విలువ చేసే కుట్టుమిషన్లు ఉన్నాయి. పరిశ్రమలో రోజూ 15 వేల పీస్‌లు కుట్టేలా అత్యాధునిక మిషనరీ ఉంది. అలాగే 25 వేల పీస్‌లు వాషింగ్, డ్రయింగ్ చేసే అత్యాధునిక మిషన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ రిలయన్స్‌కు సంబంధించి ప్యాంట్లు తయారు చేస్తున్నారు. త్వరలో జాకెట్లు కూడా ఇక్కడే తయారు కానున్నాయి. కంపెనీ ప్రతినిధులు సూచించిన డిజైన్ల మేరకు దుస్తులను కొలతల ప్రకారం కుట్టిన తర్వాత ఉతికి ఆరబెట్టి చివరగా ఐరన్ చేసి ప్యాక్ చేస్తారు. వీటన్నింటినీ బెంగళూరులోని ప్రధాన కేంద్రానికి సరఫరా చేస్తారు. అక్కడి నుంచి ఆర్డర్ల ప్రకారం విదేశాలలోని కంపెనీలకు ఎగుమతి చేస్తారు.

మహిళల కోసం సదుపాయాలు

పరిశ్రమలో పనిచేసే మహిళల కోసం కంపెనీ మౌలిక సదుపాయాలు కల్పించింది. ఐదేళ్ల లోపు చిన్నపిల్లలను వెంట తీసుకెళ్లవచ్చు. వారికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. అక్కడ ఆయా, టీచరు ఉంటారు. మహిళలకు అనారోగ్య సమస్యలు తలెత్తితే ప్రాంగణంలోనే వైద్యశాల అందుబాటులో ఉంది. డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు. ఇది గ్రీన్‌పార్కు పరిశ్రమ కావడంతో ఇటీవల 300 మొక్కలను పచ్చదనం కోసం నాటారు.

విద్యార్హత అవసరం లేదు



కొప్పర్తి పరిశ్రమలో 45 నుంచి 50 కి.మీ. దూరంలో ఉన్న స్థానిక మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. పనిచేయడానికి ఆసక్తి ఉన్న మహిళలు పరిశ్రమ పని వేళల్లో వచ్చి నేరుగా సంప్రదించవచ్చు. విద్యార్హత అవసరం లేదు. ఉన్నత చదువులు చదివిన వారికి ఉన్నత పదవుల్లో అవకాశాలు ఉంటాయి. ఇక్కడ మహిళలకు అన్ని వసతులూ ఏర్పాటు చేశాం. ఇది ఉత్తమ పరిశ్రమ.

\- విక్టర్, టెక్సోనా కడప ప్లాంటు హెడ్

వసతులు బాగున్నాయి



టెక్సోనా పరిశ్రమలో వసతులు బాగున్నాయి. టైలరింగ్‌లో ప్రతిభ కనబరచడంతో ఆపరేషన్స్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నాను. ఇక్కడంతా మహిళలమే పనిచేస్తున్నాం. ఉచిత రవాణా కూడా ఉంది.

\- బి.విజయనిర్మల, ఖాజీపేట

వంద మంది వస్తున్నాం



తొలుత నేను ఒక్కదానినే టైలరింగ్‌కు వచ్చాను. అన్ని వసతులు బాగుండడంతో మా ఊరి నుంచే సుమారు వంద మంది దాకా వస్తున్నాం. సాయంత్రం 5 గంటలకు ఇంటికి వెళుతున్నాం.

\- అఖిల, ఖాజీపేట

భద్రత బాగుంది



కంపెనీలో మహిళలకు భద్రత బాగుంది. పగటి పూటనే పని. అనారోగ్యం కలిగితే ఆసుపత్రి అందుబాటులో ఉంది. ఇక్కడ అన్ని వసతులు ఉన్నాయి.

\- లావణ్య, కడప

నెడ్‌క్యాప్, మెప్మా.. నిజమేమిటి చెప్మా!


అంతా సక్రమమే అని కమలాకర్, తేజ్‌భరత్ వివరణ

- అవాస్తవాలంటూ 'ఆంధ్రజ్యోతి' కథనానికి ఖండన
- 'ఇన్‌స్టలేషన్'ను దాచేసి... 'ప్రచారం' వరకే పరిమితం
- దాచేస్తే దాగని నిజం... లేఖల్లో అసలు వాస్తవం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'విజయవాడకు చెందిన ఎల్విన్ ఇండస్ట్రీస్ సంస్థ పీఎం-సూర్యఘర్‌పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని ముందుకు వచ్చింది. అదే విషయాన్ని మెప్మాకు ఫార్వర్డ్ చేశాం. ఇందులో ఎలాంటి లోటుపాట్లు లేవు. ఏ వెండర్‌కూ మేం ప్రాధాన్యత ఇవ్వలేదు. వినియోగదారుల్లో అవగాహన కార్యక్రమాలు ఎవరైనా చేపట్టవచ్చు" అని ఏపీ నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (నెడ్‌క్యాప్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్‌బాబు స్పష్టీకరించారు.

'సూర్యఘర్ పథకం అమలులో మేం ఒక నిర్దిష్ట కంపెనీ లేదా ఏజెన్సీని ప్రోత్సహించడం లేదు. మా సిబ్బందికి అలాంటి సూచనలేవీ జారీ చేయలేదు" అని మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ వివరణ పంపారు. 'సూర్యఘర్‌కు మాస్క్, మస్కా' శీర్షికన ప్రచురితమైన కథనంపై వారిరువురూ ఇలా స్పందించారు. 'ఆంధ్రజ్యోతి' ఎటువంటి నిర్ధారణలు చేసుకోకుండా, స్పష్టత కోరకుండా తన పేరు ప్రస్తావించి, అవాస్తవాలను ప్రచురించిందని తేజ్ భరత్ ఆక్రోశం, విచారం కూడా వ్యక్తం చేశారు. వారిరువురి స్పందనపై 'ఆంధ్రజ్యోతి' ప్రతిస్పందన ఇదీ....



systems at the grassroot level. This initiative will not only enhance adoption but also provide financial benefits to SHGs. Further, M/s. Elvin Industries, Vijayawada has submitted a proposal to NREDCAP for supporting awareness and installation activities under the scheme. The SHGs may support their initiatives wherever appropriate to strengthen outreach and implementation efforts.

"సూర్యఘర్ ప్రాజెక్టుపై ప్రచారం, ఇన్‌స్టలేషన్‌కు విజయవాడకు చెందిన ఎల్విన్ ఇండస్ట్రీస్ ముందుకు వచ్చిందని... స్వయం సహాయక సంఘాలు దీనికి సహకరించాలని కోరుతూ నెడ్‌క్యాప్ ఎండీ మెప్మా డైరెక్టర్‌కు పంపిన లేఖ ఇది. ఇవే అంశాలను ఉటంకిస్తూ... మెప్మా డైరెక్టర్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లకు లేఖలు పంపారు. కానీ... శనివారం వారిద్దరూ పంపిన వివరణలో 'ఇన్‌స్టలేషన్'ను వదిలేశారు."

ఏదీ వాస్తవం?

సూర్యఘర్‌కు 'మాస్క్, మస్కా' వేయడం అక్షర సత్యం! 'ఆంధ్రజ్యోతి' కథనం పూర్తిగా వాస్తవం! ఇందుకు తిరుగులేని ఆధారాలు ఉన్నాయి. రూ.8వేల కోట్ల విలువైన సూర్యఘర్ ప్రాజెక్టు ప్రచారం, ఇన్‌స్టలేషన్ కోసం విజయవాడకు చెందిన 'ఎల్విన్ ఇండస్ట్రీస్'కు సహకరించాలంటూ నెడ్‌క్యాప్ ఎండీ నుంచి మెప్మా డైరెక్టర్‌కు ఆగస్టు 28న ఒక లేఖ వెళ్లింది. ఆ లేఖను కోట్ చేస్తూ, అందులో పేర్కొన్న మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌లకు ఆగస్టు 30వ తేదీన మెప్మా డైరెక్టర్ లేఖ రాశారు. అందులో... ప్రచారంతో పాటు ఇన్‌స్టలేషన్ బాధ్యతలు కూడా ఎల్విన్ ఇండస్ట్రీస్‌కే ఇస్తున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారు. కానీ... శనివారం నెడ్‌క్యాప్ ఎండీ ఇచ్చిన వివరణలో మాత్రం... 'ఇన్‌స్టలేషన్' అనే పదాన్ని దాచేశారు. 'ప్రచారం' వరకే పరిమితమయ్యారు. 'సూర్యఘర్‌పై అవగాహన కల్పిస్తామని ఎల్విన్ ఇండస్ట్రీస్ ముందుకు వచ్చింది. దానినే నేను ఫార్వర్డ్ చేశాను' అని నెడ్‌క్యాప్ ఎండీ చెప్పడం గమనార్హం! ఇదొక్కటే కాదు... కమలాకర్ బాబు, తేజ్‌భరత్ దాటవేసిన, దాచేసిన నిజాలు ఇంకా ఉన్నాయి. సమాధానాలు చెప్పాల్సిన ప్రశ్నలూ ఉన్నాయి.

చెప్పండి సార్...

'సూర్యఘర్‌పై ఎవరైనా ప్రచారం చేయవచ్చు' అని మెప్మా, నెడ్‌క్యాప్ అధిపతులు చెబుతున్నారు. కానీ... ఇక్కడ ఎల్విన్ ఇండస్ట్రీస్ అంతకుమించి చేస్తోంది. బ్యాంక్ లోన్ కాకుండా లబ్ధిదారుడు చెల్లించాల్సిన వాటా రూ.23 వేలు తానే భరిస్తానని చెప్పింది. అంత అవసరం 'ఎల్విన్'కు ఏమొచ్చింది? ఇది 'ఇన్‌స్టలేషన్' కోసం వేసే వల! ఎంత మంది లబ్ధిదారులు ముందుకు వస్తే ఎల్విన్‌కు అంత లాభం! ఇది నిజం కాదంటారా?

'ప్రచారం, ఇన్‌స్టలేషన్' అనే రెండు పదాలనూ మెప్మా డైరెక్టర్ తన లేఖలో వాడారు. ఎల్విన్ ఇండస్ట్రీస్‌కు ఈ రంగంలో ఏం అనుభవం, అర్హత ఉందని సిఫారసు చేశారు? అదేమైనా ఎన్‌జీఓనా? లేక ప్రభుత్వ రంగ సంస్థా? ఒక ప్రైవేటు సంస్థను సిఫారసు చేయడంలోని ఆంతర్యం ఏమిటి?

'మెప్మా తరఫున ఏ సంస్థనూ ప్రోత్సహించలేదు' అని సంస్థ డైరెక్టర్ తేజ్ భరత్ చెబుతున్నారు. మరి... నెడ్‌క్యాప్ లేఖను ఉటంకిస్తూ, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రాజెక్టు అధికారులకు లేఖ ఎందుకు రాసినట్లు? నెడ్‌క్యాప్ కోరినవెంటనే ఓ ప్రైవేటు కంపెనీకి సహకరించాలంటూ లేఖ రాయడం 'ప్రోత్సహించడం' కాదా?

'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన వెంటనే.. శనివారం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లకు మరో సర్క్యులర్ పంపించారు. 'ఎల్విన్ ఇండస్ట్రీస్' ప్రస్తావన లేకుండా... 'సూర్యఘర్ ప్రాజెక్టుకు సహకరించండి' అని అందులో ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి'కి పంపిన వివరణకు ఈ కొత్త సర్క్యులర్‌నే జత చేశారు. మరి... గత నెల 30వ తేదీన రాసిన లేఖ మాటేమిటి? 'ప్రచారం, ఇన్‌స్టలేషన్ కోసం ఎల్విన్ ఇండస్ట్రీస్‌కు సహకరించండి' అని అందులో చెప్పలేదా? అది దాచేస్తే దాగుతుందా?

'మాస్క్' తీసిన కంపెనీ!

'అబ్బే.. ఎల్విన్ ఇండస్ట్రీస్ ప్రచారం మాత్రమే చేస్తుంది' అని కమలాకర్ బాబు, తేజ్ భరత్‌లు వివరణ పంపగా... 'కాదు కాదు. మేం సోలార్ రూఫ్‌టాప్‌ల వ్యాపారం కూడా చేస్తున్నాం' అని ఎల్విన్ సంస్థ 'మాస్క్' తీసేసి మరీ చెప్పింది. 'ఆంధ్రజ్యోతి' తన కథనంలో ఆ సంస్థ పేరు ప్రస్తావించనప్పటికీ... 'అది మేమే' అని బయటపడింది. "మేం ఈ ఏడాది ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పీఎం-సూర్యఘర్ పథకం అమలుకు ఎంప్యానల్ అయ్యాము. ఎంప్యానల్ అయిన కంపెనీలు వారి సోలార్ ప్లాంటు నాణ్యతను, ధరను ప్రజలకు వివరిస్తాయి. వారికి నచ్చితే బ్యాంక్ లోను లేదా సొంతంగా ఖర్చుపెట్టి ఇన్‌స్టలేషన్ చేయించుకుంటారు. దీనికి నెడ్‌క్యాప్‌తో ఎలాంటి సంబంధం లేదు. ఇందులో టెండర్ ప్రక్రియ లేదు. వర్క్ కాంట్రాక్టర్ ఆర్డర్ మాకు ఇవ్వలేదు" అని ఆ సంస్థ తెలిపింది. వెరసి... తాము ప్రచారంతోపాటు, ఇన్‌స్టలేషన్ పని కూడా చేస్తామని చెప్పేసింది. నెడ్‌క్యాప్ ఎండీ మాత్రం 'ప్రచారానికే' పరిమితమయ్యారు. ఎల్విన్ ఇండస్ట్రీస్ నిజంగా కేంద్ర ప్రభుత్వం వద్ద ఎంప్యానల్ అయి ఉంటే... ఆ విషయాన్ని 'మెప్మా'కు పంపిన లేఖలో నెడ్‌క్యాప్ ఎండీ చెప్పి ఉండొచ్చు కదా!? ఇక... ఎల్విన్‌తోపాటు చాలా కంపెనీలు 'ఎంప్యానల్' అయి ఉంటాయి. వాటన్నింటినీ కాదని... ఆ సంస్థకు మాత్రమే సహకరించాలని ఎందుకు లేఖలు రాసినట్లు?

‘పోటీ’కి టాటా!

విద్యుత్ పరికరాల సరఫరాలో ఇంకా పాత పద్ధతే

- జగన్ హయాంలో అర్థంలేని 'అర్హత' నిబంధనలు
- 100% సొంతంగా తయారు చేయాలనే షరతు
- స్థానిక కంపెనీలతోపాటు, జాతీయ సంస్థలకూ శరాఘాతం
- అనేక రాష్ట్రాలకు ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేస్తున్న కంపెనీలు
- సొంత రాష్ట్రంలో టెండర్లకు మాత్రం అనర్హులు
- పోటీలేకపోవడంతో అధిక ధరలు.. జనంపైనే అంతిమ భారం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కాంట్రాక్టు ఏదైనా పదిమంది పోటీ పడితేనే ధరలు తగ్గుతాయి. అర్థంలేని నిబంధనలు పెట్టి.. షరతుల చట్రం బిగిస్తూ పోతే చివరికి ఒకటిరెండు కంపెనీలకు మాత్రమే అర్హత లభిస్తుంది. విద్యుత్ పరికరాల సరఫరాలో ఇప్పుడు ఇదే జరుగుతోంది. పోటీతత్వానికి చోటు లేకుండా... గత ప్రభుత్వం అమలు చేసిన 'నిబంధన రాజ్యమే' ఇప్పటికీ నడుస్తోంది. దీంతో... ట్రాన్స్‌ఫార్మర్లు, కెపాసిటర్ల వంటి విద్యుత్ పరికరాల కొనుగోలు భారం పెరిగిపోతోంది. ఇదంతా చివరికి... ట్రూ అప్ చార్జీల రూపంలో వినియోగదారులపైనే పడుతోంది. విద్యుత్తు పరికరాల సరఫరా టెండరు ఖరారుకు జగన్ ప్రభుత్వం మార్కులు వేసే విధానాన్ని తెచ్చింది. ప్రభుత్వ విద్యుత్తు సంస్థలకు పరికరాలను మూడేళ్ల పాటు సరఫరా చేసిన అనుభవం ఉండాలని స్పష్టం చేసింది. అన్నింటికంటే దారుణమైన షరతు మరొకటి విధించింది. అది... ఆ సంస్థలు విద్యుత్ పరికరాలను వందశాతం తామే తయారు చేసి ఉండాలి. ఒక్కటంటే ఒక్క విడి పరికరమూ బయటి నుంచి కొనుగోలు చేయరాదు. ఈ షరతుతో అర్హుల జాబితా అమాంతం పడిపోయింది. పలుజాతీయ సంస్థలే కాదు... రాష్ట్రంలో ఉన్న విద్యుత్ పరికరాల తయారీ సంస్థలకూ టెండర్లలో పాల్గొనే వీలులేని పరిస్థితి. రాష్ట్రంలో కెపాసిటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే సంస్థలు ఐదారు ఉన్నాయి. తెలంగాణతో పాటు యూపీ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో టెండర్లలో పాల్గొంటూ... విద్యుత్ పరికరాలను సరఫరా చేస్తున్నాయి. కానీ... జగన్ సర్కారు పెట్టిన అర్థంలేని 'అర్హత' నిబంధనల కారణంగా సొంత రాష్ట్రంలో టెండర్లలో పాల్గొనే అవకాశం లేకుండా పోతోంది. జాతీయ స్థాయిలో పేరుపొందిన తయారీదారులు కూడా ఏపీలో అడుగు పెట్టలేకపోతున్నాయి. కూటమి ప్రభుత్వమైనా ఈ పద్ధతి మార్చాలని చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రతినిధులు కోరుతున్నారు.



డిపాజిట్ ‘గల్లంతు’

టెండర్ దక్కించుకున్న సంస్థ చెల్లించాల్సిన బ్యాంకు గ్యారెంటీ విధానంలోనూ జగన్ సర్కారు చేసిన మార్పులపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పరికరాలను సరఫరా చేసే సంస్థలు ఐదేళ్లపాటు గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఐదేళ్లలో పరికరాలు పనిచేయకపోతే వాటి స్థానంలో కొత్తవి బిగించాలి. అలా చేయకపోతే... విద్యుత్తు సంస్థలపై భారం పడుతుంది. ఇలా జరగకుండా ఉండేందుకు... సరఫరాదారుపై బాధ్యత పెంచేందుకు వారి నుంచి పది శాతం బ్యాంకు గ్యారెంటీలను వసూలు చేస్తారు. అంటే.. వంద కోట్ల రూపాయల పరికరాలు సరఫరా చేస్తే, పదికోట్లు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలి. ఐదేళ్ల గ్యారెంటీ కాలం గడిచిన తర్వాత మాత్రమే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు. ఇంత పెద్దమొత్తంలో బ్యాంకు గ్యారెంటీగా ఇచ్చినప్పుడు పరికరాల నాణ్యతపై సరఫరాదారు తప్పనిసరిగా దృష్టి సారిస్తారు. కానీ... జగన్ జమానాలో జరిగిన కొనుగోళ్లకు దీనిని పట్టించుకోలేదు. విద్యుత్తు పరికరాల సరఫరాదారులు ఎన్ని వేల కోట్ల రూపాయల విలువజేసే పరికరాలు సరఫరా చేసినా.. కేవలం రూ.20 కోట్లు బ్యాంకు గ్యారెంటీగా ఇస్తే సరిపోతుందంటూ నాటి ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. 'వేలకోట్లు వచ్చేశాయి. 20 కోట్లు పోతే పోయాయి' అని సరఫరాదారు తెగిస్తే చేసేదేమీ ఉండదు. ఈ నేపథ్యంలో... బ్యాంకు గ్యారెంటీ విషయంలోనూ కూటమి ప్రభుత్వం నిక్కచ్చిగా వ్యవహరించాల్సిన అవసరముందని విద్యుత్ రంగ నిపుణులు సూచిస్తున్నారు.



సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రులు పయ్యావుల, అనగాని, గొట్టిపాటి, నారాయణ, రాంప్రసాద్ రెడ్డి తదితరులు

'సూపర్‌హిట్' సభపై మంత్రుల బృందం సమీక్ష

▸ అనంతలో 10న జరిగే సీఎం సభకు చురుగ్గా ఏర్పాట్లు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈ నెల 10న జరిగే 'సూపర్ సిక్స్- సూపర్ హిట్' బహిరంగ సభ గురించి ఏడుగురు మంత్రుల బృందం శనివారం సమీక్ష నిర్వహించింది. ఈ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగర శివారులోని ఇంద్రప్రస్థ గ్రౌండ్స్‌లో భారీ వేదికను ఏర్పాటు చేస్తున్నారు. సభ, హెలీప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్ల గురించి తెలుసుకునేందుకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, నారాయణ, కొల్లు రవీంద్ర, సవిత, గట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్ రెడ్డి అనంతపురం వచ్చారు. మొదట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్‌తో చర్చించారు. బహిరంగ వేదిక, పార్కింగ్, హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు, భద్రత గురించి తెలుసుకున్నారు. అనంతరం సభాస్థలి వద్ద టీడీపీ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి అనంతపురం జిల్లా పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీ ముఖ్య నాయకులతో కలసి సుమారు గంటపాటు చర్చించారు. వేదిక వద్ద పనులను మంత్రుల బృందం పరిశీలించింది. సమీక్షలకు మీడియాను దూరం పెట్టారు.

వైసీపీ నేతలవి చిల్లర రాజకీయాలు: అనగాని



అనంతపురం క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'ప్రజలకు ఉపయోగపడే పాజిటివ్ వాతావరణంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. కానీ వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారు' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'మెడికల్ కాలేజీలపై దుష్ప్రచారం చేస్తున్నారు. రూ.600 కోట్లు పెట్టి రిషికొండపై ప్యాలెస్ కట్టేబదులు వారి హయాంలోనే ఎందుకు మెడికల్ కాలేజీలు నిర్మించలేదు? వైసీపీ నాయకుల్లా మేం రాష్ట్రాన్ని దోచుకుని, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం లేదు' అని అనగాని అన్నారు.



కర్నూలులో టిడ్కో గృహ సముదాయం వద్ద మంత్రి నారాయణకు సమస్యలు చెబుతున్న లబ్ధిదారులు

మార్చిలోపు టిడ్కో గృహాలు: మంత్రి నారాయణ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 163 టిడ్కో గృహ సముదాయాలు వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోపు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పి.నారాయణ చెప్పారు. కర్నూలు సమీపంలోని జగన్నాథగట్టు వద్ద టిడ్కో గృహ సముదాయాలను శనివారం ఆయన పరిశీలించారు. కర్నూలులోని టిడ్కో గృహాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.కోటి మంజూరు చేశామని నారాయణ తెలిపారు. కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ బి.నవ్య, 'కుడ' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మూర్ఖుల్ని శిక్షించాలి: పీవీఎన్ మాధవ్

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): హిందూ వ్యతిరేక వైసీపీ మూర్ఖుల్ని చట్టపరంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. శనివారం మాధవ్‌తో సహ పలువురు బీజేపీ నేతలు స్పందించారు. నందిగామలో వినాయక మండపం వద్ద వైసీపీ నేతలు మాంసాహార భోజనాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. 'వైసీపీ అధికారంలో ఉంటే రాముడి విగ్రహ శిరచ్ఛేదం, నరసింహుని రథం దగ్ధం, హిందూ పండగలపై ఆంక్షలు. ప్రతిపక్షంలో ఉంటే వినాయకుడి మండపాల్లో మాంసాహారం పంపిణీ. ఆ పార్టీ నేతల చర్యల్ని ప్రతి హిందువు తీవ్రంగా ఖండించాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విజ్ఞప్తి చేశారు. ఎంపీలు సీఎం రమేశ్, పురందేశ్వరి, నేతలు వల్లూరు జయ ప్రకాశ్ నారాయణ, నాగోతు రమేశ్ నాయుడు వైసీపీ తీరుపై మండిపడ్డారు.

పాకిస్థాన్ జెండాలతో హల్‌చల్

▸ కాకినాడలో నలుగురు అదుపులోకి, 4కార్లు స్వాధీనం



ర్యాలీలో పాకిస్థాన్, పాలస్తీనా జెండాలు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కేంద్రంలో పాకిస్థాన్ జెండాలు ప్రదర్శిస్తూ కార్లతో హల్‌చల్ చేసిన నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 4కార్లను సీజ్ చేశారు. శనివారం సీఐ ఎం.నాగదుర్గారావు వివరాలను వెల్లడించారు. ఈనెల 5న మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జగన్నాథపురం మసీదు వద్ద నిర్వహించిన ర్యాలీలో కొందరు పాక్, పాలస్తీనా జెండాలతో కవ్వించారు. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాడాలి

▸ అన్ని రంగాల్లో ప్రభుత్వాలు వైఫల్యం: కె.రామకృష్ణ

▸ విజయవాడలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సమాలోచన సదస్సు

గాంధీనగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించే లక్ష్యంతో బహుజన వర్గాలు సమైక్య పోరాటానికి సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర సమాలోచన సదస్సు విజయవాడలోని గాంధీనగర్‌లో ఉన్న ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పలు రంగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ధ్వజమెత్తారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, దళితులపై అత్యాచారాలు పెరిగాయన్నారు. జేఏసీ కన్వీనర్ కొరివి వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కాంగ్రెస్ పార్టీ నేత కొలనుకొండ శివాజీ పాల్గొన్నారు.

పులివెందులలోనూ పూర్తిగా కట్టలేదు: పట్టాభి

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా మెడికల్ కాలేజీని అసంపూర్తిగా వదిలేశారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి విమర్శించారు. జగన్ హయాంలో రూ.8,480 కోట్ల నిర్మాణ వ్యయంతో 17 మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన చేశారన్నారు. ఐదేళ్లలో వాటిపై కేవలం రూ.1451 కోట్లు ఖర్చు చేశారని, ఆ మొత్తంలోనూ రూ.975 కోట్లు కేంద్ర ప్రభుత్వానివని తెలిపారు. ఐదేళ్ల పాలనలో కేవలం 5 మెడికల్ కాలేజీలను ప్రారంభించి, వాటినీ సగంలో వదిలేశారని విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో పట్టాభి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పీపీపీ మోడల్‌లో 10 కాలేజీలను నిర్మిస్తుందని, వీటిని లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తారని, ఇందులో దోపిడీ ఎక్కడుందని ప్రశ్నించారు.

బనకచర్లపై ఆచితూచి!

▸ వివాదాలకు చోటివ్వకుండా ముందుకు

▸ కేంద్ర కమిటీకి సభ్యుల పేర్లు పంపని వైనం

▸ ఈలోపు చిన్న ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి

▸ 10 వేల కోట్ల ఖర్చుతో భారీగా జలఫలాలు

▸ వాటికి ప్రాధాన్యమివ్వాలంటున్న నిపుణులు

హడావుడి పడొద్దని ప్రభుత్వ యోచన



బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై ఆచితూచి ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దూకుడుగా కాకుండా, వివాదాలకు తావివ్వకుండా ప్రాజెక్టు పూర్తిచేసే మార్గాలపై అన్వేషణ సాగిస్తోంది. 'బనకచర్ల' ప్రాజెక్టు తెలంగాణలో రాజకీయ అంశంగా మారిన సంగతి తెలిసిందే. గోదావరి నుంచి వందల టీఎంసీలు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయని... అందులో నుంచి ఏటా 200 టీఎంసీలను మళ్లించేలా 'పోలవరం-బనకచర్ల' అనుసంధానం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ... దీనిపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. అక్కడి ప్రభుత్వంతోపాటు విపక్షాలకూ ఇది ఒక అస్త్రంగా మారింది. బనకచర్లతోపాటు గోదావరి, కృష్ణా ప్రాజెక్టులపై సమీక్షకు ఏర్పాటుచేయాలనుకుంటున్న కేంద్ర కమిటీకి సభ్యులను ప్రతిపాదించాలంటూ కేంద్ర జలశక్తి శాఖ రాసిన లేఖపై తెలంగాణ ప్రభుత్వం స్పందించలేదు. ఆ ప్రాజెక్టు తమకు అసలు ఆమోదయోగ్యం కాదని... అందువల్ల సభ్యులను ప్రతిపాదించే ఆస్కారం లేదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం ఈ విషయంపై ఆచితూచి వ్యవహరిస్తోంది. సభ్యుల పేర్లను పంపించే ప్రతిపాదనను ప్రస్తుతానికి పక్కన పెట్టింది. సమీక్ష కోసం సభ్యుల పేర్లు పంపాలని గత నెల 12వ తేదీన కేంద్ర జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి ప్రదీప్ ఎకుమార్ అగర్వాల్ ఉభయ రాష్ట్రాలకూ లేఖ రాశారు. ఈ లేఖ రావడానికి ముందే.. రాష్ట్రప్రభుత్వం జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వర రావు, ఈఎన్‌సీ నరసింహమూర్తిలను ఎంపిక చేసింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో... కమిటీకి పేర్లను పంపించే అంశాన్ని పక్కనపెట్టింది.

'పెండింగ్' పని పడదాం...

బనకచర్ల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.81 వేల కోట్లు! ఎన్నేళ్లకు పూర్తవుతుందో తెలియని ఈ ప్రాజెక్టును చేపట్టడంకంటే... ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయడం మంచిదని నిపుణులు భావిస్తున్నారు. 'బనకచర్ల వరమా... భారమా' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. రూ.పది వేల కోట్లలోపు వ్యయం చేస్తే రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని నిపుణులు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో... బనకచర్లపై అన్ని వివాదాలు కొలిక్కి వచ్చేలోగా పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు సమాచారం. హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 738 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం నియోజకవర్గంలో ఇటీవలే కృష్ణా జలాలు అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి వరద నీరు చేరుతుండడం.. అందులో కొంత పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్.. మల్యాల ఎత్తిపోతల గుండా కాలువలకు విడుదల చేస్తుండడంతో చెరువులు నిండుతున్నాయి. దీంతో కరువు పీడిత రాయలసీమలో హర్షం వ్యక్తమవుతోంది. చంద్రబాబు గత ఏడాది సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రూ.3,850 కోట్లతో హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులు పూర్తిచేసి సీమకు.. కుప్పం నియోజకవర్గం వరకు వరద నీటిని తరలించారు. దశాబ్దాల కలను నెరవేర్చారు. ఈ నేపథ్యంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తే అందే జల ఫలాలపై సర్కారులో ఆలోచన మొదలైంది. వరదల సమయంలో చెరువులన్నింటినీ నింపగలిగితే.. వర్షాభావ సమయంలో తాగు, సాగుకు పుష్కలంగా జలాలు అందుబాటులో ఉంటాయని సీఎం భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు మూడ్రోజుల్లో సాగు నీటి యాజమాన్య సంఘాలు, జల వనరుల శాఖ అధికారులతో సమావేశం కావాలని భావిస్తున్నారు.

విద్యార్థి దశలోనే విదేశీ భాషలపై శిక్షణ

సీడాప్ ద్వారా 50 వేల ఉద్యోగాలు

▸ రాష్ట్రంలో విదేశీ భాషల పరీక్ష కేంద్రాలు: లోకేశ్

▸ జర్మనీలో ఉద్యోగాలు పొందిన వారికి అభినందన



అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇకపై చదువు పూర్తయ్యాక కాకుండా చదువులో భాగంగానే జర్మన్, జపనీస్ లాంటి విదేశీ భాషలపై శిక్షణ ఇస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ(సీడాప్) ద్వారా రాబోయే ఐదేళ్లలో 50 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించడం లక్ష్యం అని చెప్పారు. సీడాప్, ఇండో యూరో సింక్రనైజేషన్ అండ్ జర్మన్ హెల్త్‌కేర్ సహకారంతో జర్మనీలో హెల్త్‌కేర్ విభాగంలో ఉద్యోగాలు సాధించిన 14 మంది రాష్ట్ర యువతీ యువకులు శనివారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రిని కలిశారు. ఉద్యోగాలు సాధించిన వారిని లోకేశ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్మనీలో ఉద్యోగాల కోసం మొదటి బ్యాచ్‌లో 171 మందికి శిక్షణ ఇవ్వగా, వివిధ విభాగాల్లో 40 మంది ఎంపికయ్యారని, 14 మంది త్వరలోనే జర్మనీ వెళ్లబోతున్నారని వివరించారు. మిగిలిన అభ్యర్థులు కూడా వివిధ దశల్లో శిక్షణ పూర్తిచేసుకుంటున్నారని, వారికి త్వరలోనే ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. రాష్ట్ర యువత అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాలు సాధించాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యమని, అందుకు అనుగుణంగా వారికి శిక్షణ అందుతోందన్నారు. అంతర్జాతీయ స్థాయి అవకాశాలను మన విద్యార్థులు అందిపుచ్చుకునేలా సీడాప్, ఓంక్యాప్ సంస్థల ద్వారా విదేశీ భాషలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈనెలలోనే నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తామని లోకేశ్ తెలిపారు.


లా, బీఈడీ, బీపీఈడీ అడ్మిషన్లకు షెడ్యూలు

▸ విడుదల చేసిన ఉన్నత విద్యా మండలి

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): న్యాయ, బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి శనివారం షెడ్యూలు విడుదల చేసింది. న్యాయ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నోటిఫికేషన్ ప్రచురిస్తామని 8 నుంచి 11 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. 12 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్లకు గడువు ఉంటుందని, 17న సీట్ల కేటాయింపు జరుగుతుందని వివరించింది. బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లకు 9 నుంచి 12 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 13 నుంచి 15 వరకు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని, 16న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని, 18న సీట్ల కేటాయింపు జరుగుతుందని పేర్కొంది. ఇక బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు 10 నుంచి 13 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 14 నుంచి 16 వరకు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని, 17న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని, 19న సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపింది.

ఎరువుల లభ్యతపై భరోసా ఇవ్వండి

▸ టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు ఆదేశాలు



అమరావతి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువులు లేవంటూ జరుగుతున్న ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టడంతోపాటు, రైతాంగానికి భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీచేశారు. శనివారం సీఎం ఇదే అంశంపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. "గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నుంచి జిల్లా కలెక్టర్ల వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఎరువుల సరఫరాను పరిశీలించాలి. ఎరువుల లభ్యత గురించి వివరించి, రైతులు ఎటువంటి ఆందోళన పడకుండా చూడాలి. అందరికీ ఎరువులు అందుతాయనే భరోసా కల్పించాలి. ఎరువుల సరఫరాలోని అనుమానాలను తొలగించాలి" అని నిర్దేశించారు. వెబ్ ల్యాండ్, ఈ-పంట అనుసంధానంతో రైతుల ఆధార్ ఆధారంగా వచ్చే రబీలో ఎరువులు సరఫరా చేయాలని, దీని కోసం ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని కోరారు. రాష్ట్రంలో ఎరువుల సరఫరా సక్రమంగా జరుగుతోందని, రైతులకు డిమాండ్ మేరకు ఎరువులు అందుతున్నాయని సీఎంకు అధికారులు వివరించారు. అయితే, ఎరువుల సరఫరాపై రైతుల నుంచి నేరుగా తాను తెప్పించుకున్న ఫీడ్ బ్యాక్ ఆధారంగా సీఎం సమీక్ష చేశారు. అధికారులు ఇచ్చే సమాచారంతో పాటు ఆయా జిల్లాల నుంచి తెప్పించుకున్న సమాచారాన్ని పోల్చిచూసుకుని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలిపి 77,396 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. ఆదివారం కాకినాడ పోర్టుకు ఒక నౌక వస్తోందని, దాని నుంచి 15వేల టన్నుల ఎరువులు అదనంగా అందుబాటులో ఉంటాయని, మరో 10రోజుల్లో ఇంకో 41 వేల టన్నుల ఎరువులు రాష్ట్రానికి అదనంగా రానున్నాయని తెలిపారు. బాపట్ల, కృష్ణా, కడప జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొరత ఉందని, ఈ సమస్యను అధిగమించేందుకు ఇతర ప్రాంతాల నుంచి ఎరువుల్ని పంపిస్తున్నామని తెలిపారు. సత్వరమే ఈ సమస్యను పరిష్కరించాలని సీఎం సూచించారు.

ఎక్సైజ్‌పై 'బార్' ఒత్తిడి

(మొదటి పేజీ తరువాయి)

బార్లకు దరఖాస్తులు రావాలని, లేనిపక్షంలో బదిలీ వేటు వేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించడం ఇప్పుడు ఆ శాఖలో కలకలం రేపుతోంది. అయితే, దరఖాస్తులు రాకపోతే తామేం చేయాలని జిల్లాల యంత్రాంగం తలలు పట్టుకుంది. ఎక్సైజ్ శాఖ రూపొందించిన కొత్త బార్ పాలసీ మొదటినుంచీ వివాద కేంద్రంగానే ఉంది. పాలసీలో నిబంధనలతో వ్యాపారం గిట్టుబాటు కాదని వ్యాపారులు నిరసన వ్యక్తంచేస్తున్నారు. ఇవేమీ పట్టించుకోని ఎక్సైజ్ శాఖ బార్లకు గత నెలలో నోటిఫికేషన్ జారీచేసింది. ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు తప్పనిసరిగా రావాలనే నిబంధన పెట్టింది. 840 బార్లలో కేవలం 56 బార్లకే ఆ మేరకు అందాయి. దీంతో అధికారులు చివరిక్షణంలో మూడు రోజులు గడువు పొడిగించారు. చివరికి కల్లుగీత కులాలకు కేటాయించిన బార్లతో కలిపినా 388 బార్లకే లైసెన్సీలు ముందుకొచ్చారు. నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన బార్లకు గడువు పొడిగించి ఈనెల 2న మళ్లీ లాటరీ నిర్వహించారు. మొత్తంగా రెండు విడతల్లో లాటరీ నిర్వహించినా 412 బార్లకే లైసెన్సీలు ఎంపికయ్యారు. మిగిలిపోయిన 428 బార్లకు ఈ నెల 3న మళ్లీ రీనోటిఫికేషన్ జారీచేశారు. ఈనెల 14 వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశం ఇచ్చారు. కాగా శనివారం నాటికి కేవలం ఐదు బార్లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు అందాయి. ఇంకా 423బార్లకు దరఖాస్తులు రావాల్సి ఉంది. ఇందుకోసం వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాలని, పాలసీ లాభసాటిగా ఉందని వారికి అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు జిల్లాల అధికారులను ఆదేశిస్తున్నారు. దరఖాస్తులు రాకుండా ఎక్కువ బార్లు మిగిలిపోతే సంబంధిత అధికారులపై బదిలీ వేటు తప్పదని ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీచేయడం యంత్రాంగంలో ఆందోళన పెంచింది. ఇప్పటికే రెండు జిల్లాల ఎక్సైజ్ సూపరింటిండెంట్లపై చర్యలు తీసుకున్నారు. దీంతో మిగిలిన అధికారులు బెంబేలెత్తే పరిస్థితి తలెత్తింది

ఇదేం విధానం..?!

నాలుగు దరఖాస్తులు తప్పనిసరిగా రావాలనే నిబంధన, బార్లకు ఇచ్చే మద్యంపై 15శాతం అదనపు ఏఆర్‌ఈటీ పన్ను పాలసీకి ప్రతికూలంగా మారాయి. అదనపు ఏఆర్‌ఈటీ తొలగించాలని వ్యాపారులు కోరినా ఆర్థిక శాఖ అంగీకరించలేదు. దీంతో లైసెన్స్‌ల కోసం ఎవరూ ముందుకు రాలేదు. ఇది ప్రభుత్వానికి చెడ్డపేరు కావడంతో ఎలాగైనా దరఖాస్తులు తెప్పించాలని ఉన్నతాధికారులు పట్టుబడుతున్నారు. తొలివిడత లాటరీ సమయంలో అతి తక్కువ దరఖాస్తులు వచ్చిన కోనసీమ, బాపట్ల జిల్లాల ఎక్సైజ్ సూపరింటిండెంట్లను ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేస్తూ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులను ఎక్సైజ్ అధికారుల గ్రూపులోనే పోస్ట్ చేసి మిగిలినవారు భయపడేలా చేయడం అందరినీ ఆందోళనకు గురిచేసింది. ఆ తర్వాత వారిని తిరిగి జిల్లాలకు పంపినట్లు తెలిసింది. కాగా ఎక్సైజ్ సూపరింటిండెంట్ స్థాయి అధికారిని బదిలీ చేసే అధికారం ప్రభుత్వానికే ఉంటుంది. ఏఈఎస్ స్థాయి అధికారుల వరకే ఎక్సైజ్ డైరెక్టర్ చర్యలు తీసుకోవచ్చు. కానీ డైరెక్టరే చర్యలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.



శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో అసంపూర్తిగా మెడికల్ కళాశాల భవనాలు



పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లిలోనూ అసంపూర్తిగా..

'వైద్యం'పై విషం

(మొదటి పేజీ తరువాయి)

వాటిని పూర్తి చేయలేరు. అలాగని... ఇప్పటికే ఖర్చు పెట్టిన ప్రజాధనాన్ని వృథా చేయలేరు. అందుకే... ఆ పది కాలేజీలను పీపీపీ పద్ధతిలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. కానీ... దీనిపై జగన్ తనదైన శైలిలో దుష్ప్రచారం మొదలుపెట్టారు. తాను 17 మెడికల్ కాలేజీలు కట్టేసినట్లు కలరింగ్ ఇస్తూ... వాటిని ప్రభుత్వ పెద్దల బినామీలకు ప్రైవేటుకు ఇస్తున్నారంటూ అభాండాలు వేస్తున్నారు.

కర్త, కర్మ జగనే

'మెడికల్ కాలేజీల నిర్మాణాలకు డబ్బులు విషయం మీకెందుకు అన్న. ప్రభుత్వాన్ని నడుపుతోంది నేను. డబ్బు అదే వస్తుంది' అంటూ జగన్ 17 మెడికల్ కాలేజీలు కట్టాలంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఇందుకు రూ.8,500 కోట్లు కావాలి. ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం అడ్డగోలుగా అప్పులు చేసిన జగన్ మెడికల్ కాలేజీల విషయంలోనూ అదే మార్గాన్ని ఎంచుకున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూసి బ్యాంకులు రుణాలు ఇవ్వలేమని చేతులెత్తేశాయి. కాలేజీల కోసం తీసుకున్న వందల ఎకరాల భూములు తనఖా పెట్టడానికి కూడా గత ప్రభుత్వం సిద్ధపడింది. చివరికి నాబార్డు ద్వారా రూ.3672కోట్ల అప్పు మంజూరైంది. పాడేరు, మచిలీపట్నం, పిడుగురాళ్ల కాలేజీల నిర్మాణానికి కేంద్రం 975 కోట్లు కేటాయించింది. కేంద్ర ప్రత్యేక సహకారం, ఎన్టీఆర్ వైద్య సేవ నిధుల నుంచి రూ.302 కోట్లు సమకూర్చుకోవాలని నిర్ణయించారు. అంటే.. మొత్తం అప్పులు, కేంద్రం నిధులే. రాష్ట్ర ప్రభుత్వం రూపాయి ఖర్చు పెట్టలేదు. రుణాలు తీసుకున్నా, కేంద్రం సాయం చేసినా కూడా జగన్ ప్రభుత్వం కాలేజీలను పూర్తి చేయలేకపోయింది.

అప్పులు, కేంద్రం నిధులతోనే...

- కేంద్ర ప్రభుత్వం మంగళగిరిలో 1100 కోట్లతో ఎయిమ్స్‌ను కేవలం 17నెలల్లో నిర్మించింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క కాలేజీని కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేకపోయింది.
- రూ.2125 కోట్ల విలువైన పనులు మాత్రమే గత ప్రభుత్వం చేయగలిగింది. అందులోనూ రూ.1451 కోట్లు మాత్రమే కాంట్రాక్ట్ సంస్థలకు బిల్లులు ఇచ్చింది. మరో రూ.674 కోట్లు ఇప్పటికీ చెల్లించాల్సి ఉంది. నాలుగేళ్లల్లో 25 శాతం పనులు చేసి, 16 శాతం బిల్లులే చెల్లించారు.
- పార్వతీపురం మెడికల్ కాలేజీకి సంబంధించిన టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేయలేదు.
- గత ప్రభుత్వంలోనే కాలేజీల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో ఫేజ్-2 మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ నుంచి అనుమతులు లభించలేదు.

ఇదీ కూటమి సర్కారు నిర్ణయం

- తొలి దశలో ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల కళాశాలలపై ఒప్పందాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పెనుకొండ, అమలాపురం, నర్సీపట్నం, పాలకొల్లు, బాపట్ల, పార్వతీపురం మెడికల్ కళాశాలల పనులను రెండో దశలో అభివృద్ధి చేయాలని క్యాబినెట్ తీర్మానించింది. వీటిని పీపీపీ విధానంలో పూర్తి చేస్తారు. 2027-28 విద్యా సంవత్సరం నాటికి వీటి నిర్మాణాలు పూర్తి చేసి అడ్మిషన్లు కూడా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- 420 పడకలతో ఆసుపత్రులను నిర్వహించడంతోపాటు వాటిని నేషనల్ మెడికల్ కమిషన్ ప్రమాణాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయనుంది. కొత్త మెడికల్ కళాశాలల్లో 150 వరకు ఎంబీబీఎస్ సీట్లు పెరుగుతాయి.
- 2023-24 మధ్య గత ప్రభుత్వం అరకొర వసతులతో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కళాశాలలను ప్రారంభించింది. అక్కడ పూర్తిస్థాయిలో సేవలందించేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.



పులివెందులలో నిర్మాణం పూర్తయినా వినియోగంలో లేని ఐపీ బ్లాక్

జగన్ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీల నిర్మాణ లెక్కలు (రూ.కోట్లలో)

కాలేజీ	నిర్మాణ వ్యయం	రుణాలు /నిధులు	4 ఏళ్లల్లో చేసిన ఖర్చు	పెండింగ్ బిల్లులు
నాబార్డు రుణంతో నిర్మించే కాలేజీలు				
విజయనగరం	500	500	169	63
మార్కాపురం	475	275	75	28
మదనపల్లె	475	275	71	41
పులివెందుల	500	275	371	79
ఆదోని	475	500	71	24
నర్సీపట్నం	500	375	27	15
అమలాపురం	475	475	109	50
పాలకొల్లు	475	275	70	70
బాపట్ల	505	297	69	49
పెనుగొండ	475	275	54	35
పార్వతీపురం	600	150	టెండర్లు పిలిచారు	
కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించే కాలేజీలు				
పాడేరు	500	325	156	39
మచిలీపట్నం	550	325	248	40
పిడుగురాళ్ల	500	325	217	39
కేంద్ర నుంచి ప్రత్యేక సహకారం, ఆరోగ్యశ్రీ నిధులు				
రాజమండ్రి	475	80	123	35
ఏలూరు	525	139	177	34
నంద్యాల	475	82	118	28
మొత్తం	8,480	4,948	2,125	674

యాజమాన్య హక్కు ప్రభుత్వానిదే

"ప్రభుత్వ నిర్ణయంపై వైసీపీ విషం చిమ్మడం మొదలు పెట్టింది. 'రూ.8,500కోట్ల విలువైన కాలేజీలను రూ.5,000కోట్లకే బినామీలకు లీజులకు ఇస్తున్నారు' అంటూ గగ్గోలు పెడుతోంది. అసలు నిర్మించని కాలేజీలను ప్రభుత్వం ఎలా ప్రైవేటు పరం చేస్తుంది? పీపీపీ విధానంతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందనేది అవాస్తవం. కళాశాలలపై నియంత్రణ, యాజమాన్య హక్కు ప్రభుత్వానిదే. ఫీజులపై నియంత్రణ ప్రభుత్వం చేతిలోనే ఉంటుంది. ఓపీ సేవలు ఉచితంగానే అందుబాటులోకి వస్తాయి" అని ప్రభుత్వం స్పష్టం చేసింది.






మహా.. వినాయక నిమజ్జనం

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు విజయవాడలో ఘనంగా జరిగాయి. విద్యాధరపురంలో డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 72 అడుగుల కార్యసిద్ధి మహాగణపతి మట్టి విగ్రహ నిమజ్జనం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొలువుదీర్చిన చోటనే.. పైపులతో నీళ్లు చల్లుతూ వినాయక విగ్రహ నిమజ్జనం పూర్తి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.

- విజయవాడ (విద్యాధరపురం), ఆంధ్రజ్యోతి

ఫైరింజన్లతో నీరు చల్లుతూ వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శనివారం గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ తీరం జన సంద్రంగా మారింది. శోభాయాత్రలో ఖైరతాబాద్ మహా గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హైదరాబాద్‌లో సుమారు 2.54 లక్షల విగ్రహాలు నిమజ్జనం చేశారు. బాలాపూర్ లడ్డూ వేలంలో రూ.35 లక్షలు పలికింది.



గణనాథుల రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

అలరించిన చిన్నారుల.. గణనాథులు

గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే ఓ ఎడ్లబండి. దానిపై ఠీవిగా కొలువుదీరిన వినాయకుడు. ఆ వెనుక 31 చక్రాలతో పొడవైన ట్రాలీ.. దానిపై చిన్ని చిన్న గణనాథులు. ఆ ఎడ్లబండినీ.. ట్రాలీని లాక్కుంటూ.. నిమజ్జనానికి తీసుకెళుతున్న చిన్నారులు. ...ఇదీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక శివారు చాకలిపాలెంలో శనివారం కనిపించిన దృశ్యం. స్థానిక న్యాయవాది మొల్లేటి శ్రీనివాస్ కుటుంబం గత పదిహేనేళ్లుగా ఏటా వినాయక చవితి రోజున గణనాథులతో కూడిన బొమ్మలకొలువు ఏర్పాటుచేసి, చివరిరోజు ఊరేగింపుగా తీసుకెళ్లి.. నిమజ్జనం చేస్తోంది. ఈ శనివారం కూడా గణనాథులకు ప్రత్యేక పూజలు చేసి, పుర వీధుల్లో ఊరేగించి, రాజోలు మండలం సోంపల్లిలో నిమజ్జనం చేశారు. రాజోలులో జరిగే ఓ కార్యక్రమానికి అటుగా వెళుతున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఈ గణనాథుల ఊరేగింపును చూసి, కారు దిగి ఆసక్తిగా తిలకించారు. స్థానికులతో కలిసి కాసేపు ఆ ట్రాలీని లాగారు.

- పి.గన్నవరం, ఆంధ్రజ్యోతి



తురకపాలెంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు

తురకపాలెంలో ఇంటింటి సర్వే

» రంగంలోకి ఎయిమ్స్ వైద్యులు

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తురకపాలెంలో ప్రబలిన విష జ్వరాలకు కారణాలు అన్వేషించడంలో వైద్య బృందాలు తలమునకలయ్యాయి. హెల్త్ ఎమర్జెన్సీలో భాగంగా మూడు రోజుల్లో గ్రామస్థులందరి ఆరోగ్య అంశాలకు సంబంధించిన ప్రొఫైల్ సిద్ధం చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటి సర్వే చేపట్టింది. ప్రతి ఒక్కరి నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. జ్వర బాధితుల రక్త నమూనాలను కల్చర్ పరీక్షల కోసం పంపుతున్నారు. గ్రామంలో మెలియోయిడోసిస్ జ్వరాలు ప్రబలినట్లు అనుమానిస్తున్న నేపథ్యంలో.. వీటిని నిగ్గు తేల్చేందుకు మంగళగిరిలోని ఎయిమ్స్ వైద్యులు గ్రామాన్ని సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో కలసి గ్రామస్థుల రక్తనమూనాల సేకరణలో, వైద్య చికిత్సల్లో తమవంతు సాయం అందిస్తున్నారు. మరో పక్క సీఎం ఆదేశాల మేరకు గ్రామస్థులకు శనివారం ఉచిత భోజన శిబిరం ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు దీనిని నిర్వహించనున్నారు. ఇంటింటికీ మినరల్ వాటర్ పంపిణీ చేశారు. గ్రామంలో కూడా పెద్ద సైజు వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు గ్రామంలో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. తురకపాలెంలో ప్రబలిన జ్వరాలపై పలు ప్రజాసంఘాలు, వైద్య సంఘాలు, సేవా సంస్థల ప్రతినిధులు నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి స్థానికంగా పర్యటించారు. మృతుల కుటుంబ సభ్యులను కలిసి వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో.. ఆపద సేవలు!

» అత్యవసర సర్వీసులు ఒకే గొడుగు కిందకు
» 100, 112, 1930, 1972లకు ఒకే కమాండ్ కంట్రోల్
» టెక్ టవర్ కేంద్రంగా.. ఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణ
» 24 గంటలూ 152 మంది సిబ్బందితో నిర్వహణ
» యూఈఆర్‌సీసీ పేరుతో త్వరలో అందుబాటులోకి
» ప్రజల సంతృప్తికే ప్రాధాన్యం: డీజీపీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆపదలో ఉన్న మహిళ అర్ధరాత్రి 112కు ఫోన్ చెయ్యగానే పోలీసులు క్షణాల్లో స్పందిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల కొట్టేసిన సొమ్ము గురించి 1930కు సమాచారమిచ్చిన గంటలోపే రికవరీ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. వరదలు, ప్రమాదాల్లో చిక్కుకున్న బాధితులను సకాలంలో రక్షిస్తున్నారు. అత్యవసర సేవలకు సంబంధించి 'టోల్ ఫ్రీ' నెంబర్లకు ఫోన్ చెయ్యగానే సంబంధిత పోలీసులు అప్రమత్తం అవుతున్నారు. ఇక, నుంచి మరింత పకడ్బందీగా ఈ అత్యవసర సేవలు ప్రజలకు చేరువ కానున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు ఎదురవుతున్న సవాళ్లను మరింత సమర్థవంతంగా పరిష్కరించేందుకు పోలీసులు సర్వసన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర పోలీసు శాఖ వ్యూహంతోపాటు సాంకేతికతను కూడా వినియోగించుకుని అత్యవసర సేవలను మరింత వేగంగా అందించేందుకు అడుగులు వేస్తోంది. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు రాష్ట్రంలో ఏ మూల ఎవరికి ఇబ్బంది వచ్చినా తక్షణమే స్పందించి ఉపశమనం కల్పించేందుకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మంగళగిరిలోని టెక్ టవర్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనుంది. పోలీసు టోల్ ఫ్రీ నెంబర్లన్నీ ఒకే చోటకు తీసుకొచ్చి ఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు రేయింబవళ్లు సేవలందించేలా ఏర్పాట్లు చేస్తోంది. విజయవాడ, విశాఖపట్నం పోలీసు కమిషనరేట్లతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకోవడంతో పాటు కేంద్ర హోంశాఖ పరిధిలోని 'టోల్ ఫ్రీ' నెంబర్ల సేవల్ని సైతం సమన్వయం చేసుకోనుంది. 'యూనిఫైడ్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ అండ్ కమాండ్ సెంటర్(యూఈఆర్‌సీసీ)' పేరుతో మంగళగిరిలోని రాష్ట్ర



పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలోని టెక్‌టవర్ లో ఈ ప్రత్యేక విభాగం సిద్ధమవుతోంది.

16 రకాల సేవలు

రాష్ట్రంలో పోలీసు అత్యవసర సేవలకు సంబంధించిన 'డయల్ 100'కు ప్రతి రోజూ సరాసరి 15 వేల ఫోన్ కాల్స్ వస్తున్నాయి. సైబర్ నేరాలకు సంబంధించి 1930 ద్వారా ప్రతి రోజూ 2,300 కాల్స్, మహిళల రక్షణకు 112తో పాటు 'శక్తి' యాప్ ద్వారా 120 కాల్స్, గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగానికి సంబంధించి 10 కాల్స్ 1972 నెంబర్‌కు వస్తున్నాయి. కేంద్ర హోంశాఖ నిర్వహించే వాటితో కలిపి ఏపీ పోలీసు శాఖలో వివిధ సేవలకు సంబంధించి మొత్తం 16 రకాల టోల్ ఫ్రీ నెంబర్లున్నాయి. అయితే వాటిలో కొన్ని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో.. మరి కొన్ని టెక్ టవర్‌లో.. ఇంకొన్ని విశాఖపట్నం, తిరుపతి తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. ఒక్కొక్కటి ఒక్కోచోట ఉండటంతో పర్యవేక్షణ, సేవల్లో నాణ్యత సంతృప్తికరంగా ఉండడం లేదని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఇటీవల ఉన్నతస్థాయి సమీక్షలో నిర్ధారణకు వచ్చారు.

ఇక.. ఏకీకృతం!

అత్యవసర సేవల టోల్ ఫ్రీ నెంబర్లకు పలుమార్లు ప్రజలు ఫోన్ చేసినా సరైన స్పందన రావట్లేదనే విమర్శలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం.. పర్యవేక్షణ లోపంతో పాటు వేర్వేరు నెంబర్లు, వేర్వేరు చోట్ల ఉండటంతో సమన్వయ లోపం, గందరగోళం కూడా. ఈ విషయాన్ని గుర్తించిన డీజీపీ అన్నింటినీ ఒకే చోటకు చేర్చి ఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో సేవలు మెరుగు పరిచేందుకు నడుం బిగించారు. శ్రీకాకుళం నుంచి విజయవాడ వరకు ఒక డివిజన్. గుంటూరు నుంచి నెల్లూరు దాకా మరో డివిజన్. రాయల సీమ జిల్లాలు మూడో డివిజన్‌గా ఏర్పాటు చేసి ముగ్గురు డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు, సాంకేతిక సిబ్బందితో అంతర్జాతీయ స్థాయి కాల్ సెంటర్ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మొత్తం 152 మందితో ఏర్పాటైన ఈ బృందంలో 28 మంది అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సేవల్లో అంతరాయం కలగకుండా చూస్తారు.

స్మార్ట్ పోలీసింగ్ దిశగా: డీజీపీ

"పోలీసింగ్ అంటే శాంతి భద్రతల పరిరక్షణ ఒక్కటే కాదు. ఆపదలో ఉన్న వారికి అత్యంత వేగంగా సేవలందించడం కూడా." అని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. ఇప్పటికే పోలీసు శాఖ ద్వారా పలు సేవలు అందుతున్నా ప్రజలకు 100శాతం సంతృప్తికరమైన సేవలు అందడం లేదన్నారు. అందుకే సేవలన్నింటినీ ఒకే చోటకు చేర్చి అంతర్జాతీయ ప్రమాణాలతో సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ప్రజలకు సేవలందించేందుకు యూఈఆర్‌సీసీ తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. టెక్ టవర్‌లోని మూడో అంతస్తులో అంతా సిద్ధం చేస్తున్నామని, సీ-డాక్ నుంచి అనుమతి రాగానే ప్రారంభిస్తామని చెప్పారు. దీంతో ఏపీ పోలీసు శాఖ దేశంలో ఒక మార్గదర్శి కాబోతోందన్నారు.

సంపద సృష్టించి.. సమాజానికి సేవలందించండి

మన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండ్ తీసుకురండి

యువ పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా సంపద సృష్టించి సమాజానికి సేవలందించాలని యువ పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు సూచించారు. దేశీయ ఉత్పత్తులను అంతర్జాతీయ ప్రమాణాలతో తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో 'ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆర్గనైజేషన్'కు చెందిన యువ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. వివిధ రంగాలకు సంబంధించి రాష్ట్రంలో అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు, పర్యాటకం, రక్షణ, అంతరిక్ష, ఎలక్ట్రానిక్స్ లాజిస్టిక్స్.. ఇలా వేర్వేరు రంగాల్లో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. విశాఖలో గూగుల్ సంస్థ అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ప్రతి జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం ఉన్న యువతను తయారు చేసేందుకు మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నడుపుతున్న సంస్థలను మరింత వృద్ధిలోకి తీసుకురావాలని, 'ఆంధ్రా పారిశ్రామిక వేత్తలు' అనే పేరు నిలబెట్టాలని కోరారు.

51 మంది ఎంపీడీవోలకు పదోన్నతులు

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 51 మంది ఎంపీడీవోలకు ప్రభుత్వం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పించింది. వారికి ఆయా జిల్లాల్లో పోస్టింగ్‌లు కూడా ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ పదోన్నతులు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయని తెలిపారు.

జీఎస్టీ కొత్త స్లాబులతో రాష్ట్ర ఆదాయంలో పెరుగుదల

» బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ కొత్త స్లాబులతో వ్యవసాయ, వ్యాపార, రియల్ ఎస్టేట్ రంగాలకు భారీ ఊరట లభించనుందని, తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. జీఎస్టీ స్లాబులు తగ్గడంతో నిత్యావసరాలు, ఇతర వస్తువులు చౌకగా లభిస్తాయని, ఫలితంగా మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. వ్యాపారాలు వృద్ధి చెందుతాయని, నిర్మాణ రంగం పుంజుకుంటుందని తద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందన్నారు.

మద్యం స్కాంలో మరో ముగ్గురికి బెయిల్

» ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్పకు మంజూరు
» పాస్‌పోర్టులు కోర్టులో సమర్పించాలని ఆదేశం.. నేడు విడుదల చేయనున్న అధికారులు

విజయవాడ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో మరో ముగ్గురికి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విజయవాడలోని జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, జగన్ మాజీ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు డిఫాల్ట్ బెయిల్ మంజూరైంది. మద్యం స్కాంలో ధనుంజయ్‌రెడ్డి ఏ31, కృష్ణమోహన్‌రెడ్డి ఏ32, బాలాజీ గోవిందప్ప ఏ33గా ఉన్నారు. మే 13వ తేదీన గోవిందప్ప, అదే నెల 16వ తేదీన ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టయ్యారు. బెయిల్ కోసం ఈ ముగ్గురు దాఖలు చేసిన పిటిషన్లపై వాదప్రతివాదనలు పూర్తవడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు శనివారం బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించారు. ముగ్గురూ లక్ష రూపాయల చొప్పున బాండ్‌లు సమర్పించడంతోపాటు ఇద్దరి చొప్పున పూచీకత్తులు సమర్పించాలని, ఒక్కో పూచీకత్తు కింద రూ.లక్ష డిపాజిట్ చేయాలని షరతు విధించారు. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, సాక్షులను కలవరాదని, సిట్ అధికారులు పిలిచినప్పుడు విచారణకు హాజరుకావాలని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే బెయిల్‌ను రద్దు చేస్తామని తీర్పులో పేర్కొన్నారు. కాగా, ఆ ముగ్గురినీ ఆదివారం విడుదల చేస్తామని జైలు అధికారులు తెలిపారు.

మిథున్‌రెడ్డికి మధ్యంతర బెయిల్

విజయవాడ, రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం స్కాం కేసులో రాజమహేంద్రవరం జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈనెల 9న జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. మద్యం స్కాంలో ఏ4గా ఉన్న మిథున్‌రెడ్డిని జూలై 19న సిట్ అరెస్టు చేసింది. ఎంపీ అయిన తనకు ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ మిథున్‌రెడ్డి పిటిషన్ వేశారు. దీనిపై న్యాయాధికారి పి.భాస్కరరావు శనివారం తీర్పు వెలువరించారు. తిరిగి 11న సాయంత్రం ఐదు గంటలకు మిథున్‌రెడ్డి లొంగిపోవాలని స్పష్టం చేశారు. మిథున్‌రెడ్డి శనివారం సాయంత్రం జైలు నుంచి విడుదలై నేరుగా వైసీపీ నేత జక్కంపూడి గణేశ్ ఇంటికి వెళ్లారు.

డీసీసీబీ డైరెక్టర్ పోస్టుల భర్తీ ఎప్పుడో?!

» కూటమి పార్టీల నుంచి ఆశావహుల ఎదురుచూపు

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లలో డైరెక్టర్ పదవుల కోసం కూటమి పార్టీల ఆశావహులు ఎదురుచూస్తున్నారు. మూడు నెలల క్రితం నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగంగా 13 ఉమ్మడి జిల్లాల స్థాయిలో ఉన్న ఈ రెండింటిలో అధికారేతర పర్సన్ ఇన్‌చార్జి(చైర్మన్)లను మాత్రమే ప్రభుత్వం నియమించింది. అధికారికంగా డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయలేదు. డీసీసీబీ, డీసీఎంఎస్‌ల్లో ఏడు చొప్పున డైరెక్టర్ పోస్టులను నియమించుకునే అవకాశం ఉన్నందున కొందరు నేతలు ఈ పదవులు ఆశిస్తున్నారు. కాగా, ఏపీ కో-ఆపరేటివ్ బ్యాంక్(ఆప్కాబ్)కు గత మేలో అధికారేతర పర్సన్ ఇన్‌చార్జి(చైర్మన్)లను నామినేట్ చేసిన ప్రభుత్వం, ఇంకా డైరెక్టర్లను నియమించలేదు. ఇప్పుడు డైరెక్టర్లుగా ఏడుగురిని నియమించుకునే వెసులుబాటు ఉందని చెప్తున్నారు. కాగా, గత ప్రభుత్వం డైరెక్టర్లు లేకుండా అధికారేతర పర్సన్ ఇన్‌చార్జితోనే కాలం గడిపింది.

హంద్రీ నీవా జలాలపై తప్పుడు ప్రచారం

» శ్రీసత్యసాయి జిల్లా వాసి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

కుప్పం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా కాలువలో కృష్ణాజలాలు మాయమైపోయాయంటూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చి, వెళ్లగానే హంద్రీ నీవా కాలువ చుక్క నీరు లేకుండా ఎండిపోయిందని ఇటీవల కొందరు అవాస్తవాలను ప్రచారం చేశారు. దీనిపై ఈ నెల 3న చిత్తూరు జిల్లా కుప్పం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు అనంతరం శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన నాగిరెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు కుప్పం డీఎస్పీ పార్థసారథి తెలిపారు. నిందితుడు హంద్రీ నీవా కాలువకు సంబంధించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడమే కాకుండా ప్రభుత్వ పెద్దలు, అధికారులను కించపరుస్తూ వీడియోలు, ఫొటోలు తయారుచేసి ఫార్వర్డ్ చేస్తున్నాడన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.